

తైవాన్‌లోని హువలిన్ నగరంలో భూకంపానికి దెబ్బతిన్న భవనాలు

Estd 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com

Journalism first!



సంపుటి: 62 • సంచిక: 29 •గురువారం 8 ఫిబ్రవరి 2018 • విజయవాడ ✻ పేజీలు: 22 • వెల: 5.00 •Published from: Vijayawada | Kurnool | Hyderabad | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Suryapet | Anantapur | Nellore | Nizamabad

ముహూర్తం శ్రీ హేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘమాసం, తిథి: బహుళ అష్టమి మ. 1.23 వరకు, అనంతరం నవమి; నక్షత్రం: విశాఖ సా. 5.23 వరకు, అనంతరం అనురాధ; అమృతకాలం: ఉ. 8.05 నుండి 9.45 వరకు; వర్జ్యం: రా. 9.43 నుండి 11.27 వరకు; దుర్ముహూర్తం: ఉ. 10.00 నుండి 10.48 వరకు, తదుపరి మ. 2.48 నుండి 3.36 వరకు; రాహుకాలం: మ. 1.30 నుండి 3.00 వరకు; యమగండం: ఉ. 6.00 నుండి 7.30 వరకు;



కాంగ్రెస్ పాపాల పుట్ట

అరాచక విభజనతో ఏపీకి అష్టకష్టాలు

- పార్లమెంట్ తలుపులు మూసి విడగొట్టారు
- రాజకీయ లబ్ధికే మొగ్గు చూపారు
- తెలంగాణ మనోభావాలను మేము గౌరవించాం
- మీ అవమానాల నుంచే తెదేపా ఆవిర్భావం
- ఆత్మగౌరవం కోసమే ఎన్టీఆర్ పోరాడారు
- లోక్‌సభలో నిప్పులు చెరిగిన ప్రధాని మోడీ

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నిప్పులు చెరిగారు. దేశం అభివృద్ధి చెందకపోవడానికి కాంగ్రెస్ తప్పుడు విధానాలే కారణమని ధ్వజమెత్తారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత సుదీర్ఘకాలం అధికారంలో ఉన్న హస్తం పార్టీ, ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి, ఒకకుటుంబం ప్రయోజనాలకోసం దేశశ్రేయస్సును పణంగా పెట్టింది. ఆ కుటుంబం కోసమే పియానో వాయిస్తూ, రాగాలు ఆలపించిందని తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రధానమంత్రి ఉభయసభల్లో ప్రసంగించారు. లోక్‌సభలో 90 నిముషాలు, రాజ్యసభలో 60 నిముషాలు మాట్లాడారు. ప్రభుత్వంపై అసత్య ప్రచారం చేయడం ద్వారా మధ్యతరగతి, సామాన్య ప్రజల్లో అసంతృప్తిని వ్యాప్తిచేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నదని ఆగ్రహించారు. వ్యవస్థలన్నింటినీ కాంగ్రెస్ తన గుప్పిట్లో ఉంచుకునేది. స్వాతంత్ర్యం తర్వాత కాంగ్రెస్ హయాంలో

➪ 9వ పేజీలో...

ప్రసంగాలు వద్దు... ఏం చేశారో చెప్పండి!

5 లో

- అడిగింది చెప్పకుండా ఆరోపణలా?
- ప్రధానికి రాహుల్‌గాంధీ సూటి ప్రశ్న





హామీలొద్దు.. నిధులివ్వండి

- సర్దిచెప్పొద్దు... వివరణ ఇవ్వండి
- మీరిచ్చిన దానికంటే బాహుబలి కలెక్షన్లే ఎక్కువ
- లోక్‌సభలో కేంద్రాన్ని నిలదీసిన తెదేపా
- జయదేవ్ ఘాటైన పదజాలంతో ఉక్కిరి బిక్కిరి

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి జరిపిన బడ్జెట్ కేటాయింపులపై కేంద్ర ప్రభుత్వాన్ని ఇరకాటంలో పడేసిన తెలుగు దేశం ఎంపీలు, వరుసగా మూడో రోజు పార్లమెంటును ఆందోళనలతో అట్టుడికించారు. ప్రభుత్వంపై ముప్పేట దాడితో ఉక్కిరిబిక్కిరి చేశారు. ముఖ్యంగా లోక్‌సభలో గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్ ప్రసంగంలో ప్రతిపక్ష నేతలు సైతం ఉపయోగించని ఘాటైన పదజాలాన్ని ప్రయోగించారు. నాలుగేళ్లుగా దేశాన్ని పరిపాలిస్తున్న మోడీ సర్కారు తీరును ఉతికి ఆరేశారు. విభజన హామీలు

➪ 5వ పేజీలో...

మళ్లీ ఆత్మగౌరవ ఉద్యమం తప్పదా?

- బీజేపీ, కాంగ్రెస్‌ల పరస్పర ఆరోపణలు
- అన్యాయంపై తేల్చని నేతలు
- 1982 లోనూ ఇదే పరిస్థితి

(న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)

తెలుగు ప్రజలు మరోసారి ఆత్మగౌరవ ఉద్యమానికి సిద్ధపడాల్సిన పరిస్థితులు గోచరిస్తున్నాయి. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై కేంద్రంలోని అధికార, ప్రతిపక్షాలు పరస్పర ఆరోపణలకు పాల్పడ్డం తప్ప రాష్ట్రానికి చేకూర్చదల్చిన ప్రయోజనాలపై ఇతమిద్ధంగా తేల్చడంలేదు. బడ్జెట్‌పై దేశాధ్యక్షుని ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై బుధవారం పార్లమెంట్‌లోని రెండు సభల్లో ప్రసంగించిన ప్రధాని మోడీ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ అనుభవిస్తున్న దురవస్థలకు కారణం కాంగ్రెస్సేనంటూ దుయ్యబెట్టారు. నీలం సంజీవరెడ్డి, పివి నరసింహారావు, అంజయ్య వంటి నేతల్ని కాంగ్రెస్ ఏమార్చిందంటూ విమర్శించారు. రాష్ట్ర విభజనకు బిజెపి వ్యతిరేకం కాదుగాని, అసంబద్ధ విభజనను తాము అంగీకరించలేదన్నారు. ఇలా ప్రస్తుత పరిస్థితికి కారణాల్ని కాంగ్రెస్ పైనే నెట్టేయడంలో కృతకృతులయ్యారు. రాష్ట్రం నుంచి లోక్‌సభలో కాంగ్రెస్‌కు ప్రాతినిధ్యం కొరవడ్డంతో మోడీ వ్యాఖ్యలకు కనీసం నిరసన తెలిపే గళం కూడా కనిపించలేదు. సంఖ్యాబలం సరిపోక మోడి ప్రసంగాన్ని కాంగ్రెస్ ఎంపీలు అడ్డుకోలేక పోయారు. తద్వారా తాజా బడ్జెట్‌లో రాష్ట్రానికి కేటాయింపులకు వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్‌లో ఎగిసిపడుతున్న ఉద్యమ జ్వాలల్ని కాంగ్రెస్ వైపు

➪ 3వ పేజీలో...

మాల్దీవులకు భారత్ సైన్యం!

- చైనా మాటలను లెక్కచేయని ఇండియా

7 లో

పృథ్వి-2 క్షిపణి సక్సెస్

- పెరిగిన అణ్వాయుధ ప్రయోగ సామర్థ్యం

7 లో

ప్రధాని భార్యకు తప్పిన ముప్పు

- యశోదాబెన్‌కు స్వల్ప గాయాలు.. ఒకరి మృతి

7 లో

నేడు రాష్ట్ర బంద్‌కు పిలుపు

- జయప్రదం చేయాలి
- వివిధ పక్షాల వినతి

వివరాలు 8లో...

ఔరా..!



ఇంకెంత కాలం మభ్యపెడతారు?!



- కేంద్రం అక్కడో మాట... ఇక్కడో మాట
- చంద్రబాబుపై నమ్మకం పోతోంది...
- మోడీ న్యాయం చేస్తారని ఆశించా
- ప్లకార్డులు, స్లోగన్స్‌తో పనులు కావు
- 2014లో పోటీ చేయకపోవడం పొరపాటే
- శాంతియుత బంద్‌లకే మా మద్దతు
- విభజన సమస్యలపై ఉమ్మడి వేదిక అవసరం
- జనసేన అధినేత పవన్‌కల్యాణ్

11న పవన్‌తో ఉండవల్లి భేటీ

3 లో

పద్దులు భారీ! ...నిధులేవీ?



- మోడీ కేర్‌తో సహా అన్నీ ప్రజాకర్షక పథకాలే
- తక్షణ వ్యయం చేయాల్సిన పనిలేనివే
- విధివిధానాలతో చాలా సమయం అవసరం
- ప్రజా నిరసన తప్పించుకునే చాణక్యం
- తక్షణ ఆచరణలోకి అంతంతమాత్రమే
- బెడిసి కొట్టిన సంస్కరణల వ్యూహం
- రూటు మార్చిన కేంద్ర ప్రభుత్వం

(న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)


ఇప్పటికిప్పుడు తక్షణ వ్యయం అవసరంలేని పథకాలతోనే కేంద్రం బడ్జెట్ పద్దుల్ని నింపేసింది. ఈసారి బడ్జెట్‌లో ఎన్నో ప్రజారంజక, ఆకర్షణీయ పథకాల్ని ప్రకటించారు. ఇవేవీ తక్షణం అమల్లోకి వచ్చేవికాదు. దేశంలోని ఐదు కోట్ల కుటుంబాలకు ఆరోగ్యబీమా కల్పించే మోడికేర్ పథకం ఈ రంగంలో ఇప్పటివరకు ప్రపంచంలో ఉన్న అన్నింటికంటే అతిపెద్దది. ఏకంగా 50కోట్ల మంది భారతీయులు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందుతారు. ఇది ఇప్పుడిప్పుడే అమల్లోకొచ్చే అవకాశాల్లేవు. సెప్టెంబర్ లేదా అక్టోబర్ తర్వాతే ఇది కార్యరూపం దాలుస్తుంది. అప్పటివరకు పథకం అమలు నిమిత్తం విధి విధానాల రూపకల్పనకు సమయం అవసరం. ఈసారి బడ్జెట్‌లో భారీ పథకాలన్నీ ఇలాంటివే. ఇందుకు కారణం ఇప్పుడు కేంద్రం నిధుల కొరతను

➪ 3వ పేజీలో...

ఉత్తరాది రాజకీయాల్లో సినీ వివాదాల ట్రిక్స్



- సినిమాలే ఆలంబనగా నేతల యత్నాలు
- ఎన్నికల్లో ప్రభావం చూపేందుకే వివాదాలు
- నిన్న పద్మావత్... తాజాగా మణికర్ణిక



(న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)

దక్షిణభారత రాజకీయాలపై దీర్ఘకాలంగా సినీరంగ ప్రభావముంది. ఇటీవల ఇది ఉత్తర భారత రాజకీయాల్లో కూడా ప్రవేశించింది. అయితే ఇందులో ఓ భేదముంది. దక్షిణ భారత రాజకీయాల్లోకి సినీరంగ ప్రముఖులు ప్రవేశించారు. కొందరు అధికారాన్ని చేపట్టారు. మరికొందరు ప్రజాప్రతినిధులుగా ఓ వెలుగు వెలిగారు. ఇంకొందరు రాజకీయాల్ని, ఎన్నికల్ని ప్రభావితం చేశారు. కాగా ఇప్పుడు ఉత్తర భారతదేశంలో సినిమాలే నేరుగా రాజకీయాలపై ప్రభావం చూపిస్తున్నాయి. ఇంకా ఖచ్చితంగా చెప్పాలంటే రాజకీయాల్ని ప్రభావితం చేసేందుకు కొందరు నాయకులు సినిమాల్ని ఆలంబనగా చేసుకుంటున్నారు. ఇటీవల పద్మావత్ చిత్రంపై వెల్లువెత్తిన ఉద్యమాలు ఉత్తర భారతదేశ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించాయి. రెండుమాసాల క్రితం జరిగిన గుజరాత్ ఎన్నికల్లో అధికార పక్షానికి చావుతప్పి కన్ను లొట్టబోయేలా చేశాయి. రాజపుత్‌లతో పాటు హిందువుల్ని కూడా అధికార పార్టీకి ఈ వివాదం దూరం చేసింది. నెలతిరక్కముందే రాజస్థాన్‌లో జరిగిన రెండు పార్లమెంట్, ఒక అసెంబ్లీ ఉపఎన్నికల్లో కూడా ఈ వివాదమే అధికార పార్టీని మట్టికరిపించింది. ఇక రానున్న సాధారణ

➪ 3వ పేజీలో...

ముద్దు కృష్ణమ ఇకలేరు



- అనారోగ్యంతో తుది శ్వాస విడిచిన నేత
- నేడు స్వగ్రామంలో అంత్యక్రియలు
- ఆయన లేని లోటు భర్తీ చేయలేము
- సీఎం చంద్రబాబు ఘన నివాళి

2

అంతర్జాతీయ విద్యా కేంద్రంగా అమరావతి

- అమృత విశ్వవిద్యాలయంకు ముఖ్యమంత్రి శంకుస్థాపన



అమరావతి, ఆంధ్రప్రభ: నవ్యాంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అంతర్జాతీయ విద్యాకేంద్రంగా భాసిల్లనుందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆకాంక్షించారు. రాజధాని ప్రాంతంలోని కురగల్లులో ప్రఖ్యాత విద్యాసంస్థ అమృత విశ్వవిద్యా పీఠం శంకుస్థాపన సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ ప్రపంచస్థాయి విద్యా సంస్థల ఏర్పాటు కారణంగా ఇక్కడ నుంచే విజ్ఞానం విశ్వవ్యాపితంగా చేరనుందన్నారు. అయితే ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా అమరావతిలో 9 నగరాల నిర్మాణం జరగబోతుందన్నారు. అమరావతి విద్యా సంస్థలకు కేంద్రం కానుందన్నారు. ఇప్పటికే రాజధానిలో ఎస్ఆర్ఎం, విట్ విద్యాసంస్థలు ప్రారంభించారన్నారు. మరికొన్ని విద్యాసంస్థలు కూడా రాజధానిలో ఏర్పాటు కాబోతున్నాయన్నారు. దుబాయ్‌కి చెందిన బీఆర్ శెట్టి ఇండో యూకే ఆధ్వర్యంలో భావి మెడికల్ కళాశాలను, ఆసుపత్రులు రానున్నాయన్నారు. రాజధాని ప్రాంతంలో 15 వైద్య, విద్య కళాశాలలు ఏర్పాటు కానున్న నేపథ్యంలో అమరావతి మెడికల్ హబ్‌గా రూపొందనుందన్నారు.


ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లో అగ్రగామిగా ఉన్న అమృత యూనివర్శిటీ రాజధానికి రావడం హర్షదాయకమని సీఎం చంద్రబాబు అన్నారు. యూనివర్శిటీ ఏర్పాటు వలన విద్యతోపాటు అనేక లాభాలున్నాయన్నారు. విలువలతో కూడిన విద్యనందించడంలో అమృత విశ్వవిద్యాలయానికి ప్రాముఖ్యత ఉందని సీఎం కొనియాడారు. పేదరికం ఎక్కడ ఉంటే అమ్మ అమృత ఆనందమయి అక్కడ ఉంటుందన్నారు. భారతదేశంతోపాటు ప్రపంచంలోని అనేక దేశాల్లో జరిగిన ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఆప్తులను ఆదుకున్న సంస్థ అమృత ట్రస్టు అని సీఎం ప్రశంసించారు. సేవా కార్యక్రమాలతోపాటు ప్రజల్లో శాంతి సౌభ్రాతత్వాలను, ఆధ్యాత్మిక చింతను కలిగిస్తుందన్నారు. హైదరాబాద్‌లో 20 ఏళ్ల క్రితం అమ్మ అమృత తమ ఇంటికి వచ్చిందని సీఎం గుర్తు చేసుకున్నారు. అమరావతిలో అమృత విశ్వవిద్యాలయం 200 ఎకరాల్లో ఏర్పాటు కానుందని, రెండు దశాబ్దాల్లో 2,500 కోట్ల పెట్టుబడిని అమరావతి క్యాంపస్‌లో పెట్టనున్నట్లు సీఎం తెలిపారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచే అడ్మిషన్లు తెరవబడతాయని, 2020 నాటికి విద్యార్థుల సంఖ్య 2 వేలకు చేరుకోనుందన్నారు. దేశంలో అమృత విశ్వవిద్యాపీఠం అమరావతిలో 7వ క్యాంపస్ అని సీఎం చెప్పారు. అమరావతి క్యాంపస్ పూర్తయితే ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, మెడిసిన్, హ్యూమానిటీస్, ఆర్ట్స్ అండ్ సైన్సెస్, బయోటెక్నాలజీ, నానోసైన్స్, ఫిలాసఫీ, ఆయుర్వేద కళాశాల, ఇంటర్నేషనల్ యోగ విశ్వ విద్యాలయం తదితర సాంకేతికలపై కోర్సులు అందించనున్నారన్నారు. అత్యాధునిక మౌలిక వసతులు కలిగి ఉండటంతోపాటు అంతర్జాతీయంగా అత్యంత ప్రసిద్ధి చెందిన యూనివర్శిటీలతో అమృత విశ్వవిద్యాపీఠం భాగస్వామ్యం కలిగి ఉందన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి 300 మంది విద్యార్థులతో ప్రారంభమయ్యే ఈ క్యాంపస్‌లో 2033 నాటికి 10 వేల మంది విద్యార్థులు విద్యనభ్యసించే అవకాశముందన్నారు. ఈ విద్యాసంస్థకు కేటాయించిన 200 ఎకరాల్లో 150 ఎకరాల్లో ఇంజనీరింగ్ తదితర విద్యా సంస్థలు ఏర్పాటు చేయనుండగా, మరో 50 ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయిలో 750 పడకల బోధన ఆసుపత్రి, 1500 పడకల మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మించనున్నట్లు సీఎం వివరించారు. ఈ క్యాంపస్‌లో నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని అందుకు ప్రభుత్వ సహాయ సహకారాలు సంపూర్తిగా ఉంటాయని సీఎం హామీ ఇచ్చారు.

రాష్ట్ర రాజధాని ప్రాంతాన్ని 34 వేల కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు సీఎం చంద్రబాబు వివరించారు. 15,900 కోట్లతో రైతుల ప్లాట్లను అభివృద్ధి చేస్తున్నామనీ, మరో 9,600 కోట్లతో పరిపాలన భవనాల నిర్మాణం, 1450 కోట్లతో కొండవీటి వాగు అభివృద్ధి చేస్తున్నామన్నారు. రాజధాని నిర్మాణం చాలా వ్యయప్రయాసలతో కూడినదన్నారు. కష్టాన్ని అవకాశంగా మలచుకొని ఎన్ని ఇబ్బందులు వచ్చినా రాజధాని అమరావతిని ప్రపంచలోనే అత్యుత్తమ నగరంగా నిర్మించనున్నట్లు ముఖ్యమంత్రి చెప్పారు. రాజధాని ప్రాంతంలో ఐదు నిమిషాల్లో ఆసుపత్రికి, పది నిమిషాల్లో నడిచి కార్యాలయాలకు, 15 నిమిషాల్లో వినోద కేంద్రాలకు చేరేటట్లు ప్రణాళిక రూపొందించామన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా 1600 కిలోమీటర్ల సైకిల్ పార్కును ఏర్పాటు చేస్తున్నామనీ, అమరావతికి ఇది గర్వకారణమన్నారు. కాలుష్య నివారణకు పచ్చదనం అభివృద్ధితో పాటు ఎలక్ట్రానిక్ వాహనాలను వినియో గించనున్నట్లు సీఎం చెప్పారు. కృష్ణా నదిపై ఐదు రిజర్వాయర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా కృష్ణానదికి అభిముఖంగా రెండు వైపులా 40 నుంచి 50 కిలోమీటర్ల మేర 30 లక్షల జనాభాతో రాజధాని విస్తరించనున్నట్లు సీఎం వివరించారు.

రాజధాని నిర్మాణానికి 33 వేల ఎకరాల భూములిచ్చిన రైతుల త్యాగాన్ని మరువలేమని సీఎం అన్నారు. సభలో అమృత విశ్వవిద్యపీఠం అధ్యక్షుడు స్వామి అమృతా స్వరూపానందపురి మాట్లాడుతూ విద్యార్థులను అంతర్గతంగా మాత్రమే కాకుండా బాహ్యపరంగా కూడా సమృద్ధి చేసేదే విద్య అని అమ్మ చెబుతుంటారన్నారు. సభలో మంత్రులు గంటా శ్రీనివాస రావు, నారాయణ, కామినేని శ్రీనివాస్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, జడ్పీ చైర్మన్ జానీమూన్, సీఆర్డీఏ ప్రిన్సిపుల్ సెక్రటరీ అజయ్‌జైన్, కలెక్టర్ కోన శశిధర్, సీఆర్డీఏ కమిషనర్ చెరుకూరి శ్రీధర్, అమృత విద్యాపీఠ ప్రతినిధులు డాక్టర్ ప్రేమ్‌నాయిర్, డాక్టర్ వెంకటరంగన్, సదాశివచైతన్య తదితరులు పాల్గొన్నారు. సీఎంకు విద్యాసంస్థ నిర్వాహకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. సభ అనంతరం 5 వేల మంది మహిళలకు చీరలు, ఆహారం పంపిణీ చేశారు.

నేడు దుబాయ్‌కి సీఎం బృందం

- యుఏఈ పర్యటన కొనసాగింపుగా పెట్టుబడుల ఆకర్షణ
- నేడు కార్పొరేట్ దిగ్గజాలతో భేటీ, రోడ్ షో



అమరావతి, ఆంధ్రప్రభ: విశాఖలో జరగనున్న భాగస్వామ్య సదస్సు నేపథ్యంలో ముఖ్యమంత్రి దుబాయ్ పర్యటన ప్రాధాన్యతను సంతరించుకుంది. నేడు దుబాయ్‌లో పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షించేక్రమంలో ముఖ్యమంత్రి ఒకరోజు పర్యటిస్తున్నారు. గత ఏడాది అక్టోబర్‌లో ముఖ్యమంత్రి యునైటెడ్ అరబ్ ఎమిరెట్స్ పర్యటనకు ఇది కొనసాగింపుగా సీఎం దుబాయ్ పర్యటన ఖరారు అయింది. కీలక రంగాల్లో పెట్టుబడుల ఆహ్వానానికి ఇది ముఖ్యమైన పర్యటనకు భావిస్తున్నారు. పలువురు పారిశ్రామిక వేత్తలను, ప్రముఖులను తన పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి స్వయంగా ఆహ్వానిస్తారు. గత సదస్సుల్లో జరిగిన ఒప్పందాల స్థితిగతులు, వాటిపై తాజాగా చర్చించాల్సిన అంశాలపై ఈ పర్యటన ద్వారా స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి. ఎమిరేట్స్, ఎయిర్‌లెన్స్ ఆంధ్రప్రదేశ్‌లో భారీ స్థాయిలో ఎమ్మార్వో కేంద్రం, ఏవియేషన్ అకాడమీ, స్కిల్ డెవలప్మెంట్ కేంద్రం ఏర్పాటు చేయడానికి వీలుగా రాష్ట్రప్రభుత్వంతో ఆ సంస్థ సీఈవో, చైర్మన్ అవగాహన ఒప్పందం ఈపర్యటనలో కుదుర్చుకోనున్నారు. దీంతో రాష్ట్రంలోని ప్రతిష్టాత్మక, వైమానిక వ్యవస్థకు శ్రీకారం చుట్టనున్నారు. కాగా దుబాయ్ దేశ ప్రధాన మంత్రి షేక్ మొహమ్మద్ బిన్ రషీద్ అల్మాక్తోమ్, దుబాయ్ ఎయిర్‌పోర్ట్ ఫ్రీ జోన్ అథారిటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మొహమ్మద్ అల్ జరూనితో కీలక భేటీ జరపనున్నారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఆంధ్రప్రదేశ్ మధ్య ద్వైపాక్షిక సహకారం మరింత పటిష్టం అయ్యే విషయమై చర్చిస్తారు. పెట్టుబడుల ఆకర్షణకు వారి సహకారం కోరనున్నారు. కాగా ఏపి ఈడిబి ఏర్పాటు చేస్తున్న రోడ్ షోలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. దుబాయ్ కిచెందిన 150 వరకు ప్రముఖ ఇన్వెస్టర్లు దీనిలో పాల్గొంటారు. వీటితో పాటు ప్రముఖ సంస్థలతో సమావేశాలు, ఒప్పందాలు జరగబోతున్నాయి. ఫీనిక్స్ గ్రూప్ తో పాటు దానుబ్ చైర్మన్ తో ముఖ్యమంత్రి భేటీ అవుతారు. మెగా వ్యవసాయ, పారిశ్రామిక, ప్రాసెసింగ్, పార్క్ ఏర్పాటుపై షరాఫ్ గ్రూప్ తో చర్చిస్తారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయనున్న దానుబ్ షోరూమ్ కు సంబంధించి అవగాహన ఒప్పందంపై సంస్థ చైర్మన్ తో భేటీ అవుతారు. తూర్పు గోదావరి జిల్లా సామర్లకోట వద్ద ప్రతిపాదిత మెగా సమీకృత రైస్ మిల్లు ప్రాజెక్ట్ పై ఈ సందర్భంగా ఫీనిక్స్ గ్రూప్ తో చర్చలు ఉంటాయి. ముఖ్యమంత్రి వెంట దుబాయ్ పర్యటనలో రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి యనమల రామకృష్ణుడు, ముఖ్యమంత్రి సలహాదారుడు పరకాల ప్రభాకర్, స్పెషల్ చీఫ్ సెక్రెటరీ సతీష్‌చంద్ర, ముఖ్యకార్యదర్శులు జి. సాయిప్రసాద్, అజయ్ జైన్, ఈడీబీ సీఈవో జాస్తి కృష్ణకిషోర్ తదితరులు పాల్గొంటారు.

చంద్రబాబుపై మంత్రి కేటీఆర్ ప్రశంస



హైదరాబాద్, ఆంధ్రప్రభ : చంద్రబాబు గొప్పోడు. ఆయన 14వసారి దావోస్ వెళ్ళారు.. నేను మొదటిసారి దావోస్ వెళ్ళా అంటూ రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖా మంత్రి కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. బుధవారం ఆయన మీడియా చిట్‌చాట్ సందర్భంగా చంద్రబాబుతో సెల్ఫీ అంశాన్ని ప్రస్తావించగా స్పందించారు. చంద్రబాబు దేశంలో అత్యంత సీనియర్ ముఖ్యమంత్రి అని, సమర్థుడని అన్నారు. వారితో తనకు పోలిక లేదన్నారు.

ముద్దుకృష్ణమ ఇకలేరు

- అనారోగ్యంతో తుదిశ్వాస విడిచిన నేత
- నేడు స్వగ్రామంలో అంత్యక్రియలు
- ఆయన లోటు భర్తీ చేయలేనిది
- సీఎం చంద్రబాబునాయుడు ఘన నివాళి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి, శాసనమండలి సభ్యుడు గాలి ముద్దు కృష్ణమ నాయుడు(71) కన్నుమూశారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి తుదిశ్వాస విడిచారు. ఆయన స్వస్థలం చిత్తూరు జిల్లా రామచంద్రాపురం మండలం వెంకటరామాపురంలో 1947లో జన్మించారు. ఆయన



అంత్యక్రియలు స్వగ్రామంలో గురువారం నిర్వహించనున్నారు.

గుంటూరు జిల్లా పెదనందిపాడు కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తూ 1983లో ఎన్టీ రామారావు పిలుపుమేరకు ఉద్యోగానికి రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీలో చేరారు. చిత్తూరు జిల్లా పుత్తూరు నుంచి ఐదు సార్లు, నగరి నుంచి ఒకసారి శాసనసభ్యుడిగా ఆయన ఎన్నికయ్యారు. ఎన్టీఆర్‌కు ఎంతో సన్నిహితుడిగా పేరుతెచ్చుకున్న ముద్దు కృష్ణమనాయుడు ఆయన మంత్రి వర్గంలో పాఠశాల విద్య, అటవీశాఖ, ఉన్నత విద్యాశాఖ మంత్రిగా మూడు పర్యాయాలు బాధ్యతలు నిర్వహించారు.

గత వారం రోజుల క్రితం తీవ్ర అస్వస్థతకు గురైన ముద్దు కృష్ణమ నగర శివారులోని ఒక కార్పొరేట్ ఆసుపత్రిలో చేర్చారు. ఆ సమ యంలో బీపీ నియంత్రణలో లేకపోవడంతో అది వివిధ అవయవాల పనితీరుపై ప్రతికూల ప్రభావం చూపించింది. ఆయనకు అత్యుత్తమ చికిత్స అందించేందుకు మూడు రోజులుగా ఐసీయూలో ఉంచి కృత్రిమ శ్వాస అందిస్తున్నారు. అయితే మల్టీఆర్గాన్ ఫెయిల్యూర్‌తో డెంగ్యూ అదుపుతప్పి పరిస్థితి విషమించింది. ఈ పరిస్థితి నుంచి నాయుడుని గట్టు ఎక్కించేందుకు డాక్టర్లు చేసిన ప్రయత్నం ఫలించకపోవడంతో అర్ధరాత్రి ఆయన తుది శ్వాస విడిచినట్లు ఆసుపత్రి వైద్యులు నిర్ధారణకు వచ్చి ప్రకటించారు.



ముద్దు కృష్ణమనాయుడు మరణవార్త తెలియగానే బంధువులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అభిమానులు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆసుపత్రికి తరలివచ్చారు. తమ మిత్రుడు, సహచరుడు, అభిమాన నాయకుడిని కడసారి సందర్శించుకున్న పలువురు నివాళులర్పించారు. అక్కడే ఉన్న ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చి సానుభూతి ప్రకటించారు.

గవర్నర్ దిగ్భ్రాంతి

అమరావతి, ఆంధ్రప్రభ: మాజీ మంత్రి, ఎమ్మెల్సీ గాలి ముద్దుకృష్ణమ నాయుడు ఆకస్మిక మృతిపట్ల రాష్ట్ర గవర్నర్ నరసింహన్ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయన మృతి వార్త తెలిసి తాను దిగ్భ్రాంతికిలోనయ్యానని పేర్కొంటూ ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు. ఆయన లేని లోటు తీరనిదని తన సంతాప సందేశంలో తెలియజేశారు.

స్పీకర్ డాక్టర్ కోడెల, మాజీ సీఎం కిరణ్‌కుమార్ రెడ్డి ఆవేదన

శివప్రసాదరావు, తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సీఎల్పీ నేత కే.జానారెడ్డి, మాజీ మంత్రులు మోత్కుపల్లి నర్సిం హులు, మండవ వెంకటేశ్వరరావు, బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, సముద్రాల వేణుగోపాల చారి, ఎల్.రమణ, మాజీ ఎంపీలు రావుల , నామా నాగేశ్వరరావు తదితరులు ముద్దు కృష్ణమ భౌతిక కాయాన్ని సందర్శించి ఆయనతో తమకు ఉన్న అనుబంధం, సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు. మోత్కుపల్లి తమ సాన్నిహిత్యాన్ని గుర్తుచేసుకుంటూ కన్నీటి పర్వతమయ్యారు. శివప్రసాదరావు, కిరణ్‌కుమార్ రెడ్డి, బొజ్జాల గోపాలకృష్ణారెడ్డి తదితరులు ముద్దు కృష్ణమ సేవలను కొనియాడుతూ గద్గద స్వరంతో ఆవేదనకు లోనయ్యారు. ముద్దు కృష్ణమ మృతిపట్ల టీడీపీ-టీఎస్ నాయకులు తమ సంతా పాన్ని తెలిపారు. బుధవారం ఎన్టీఆర్ భవన్‌లో ఆయన చిత్రప టానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

సీనియర్ నేతను కోల్పోయాం: మంత్రి లోకేష్

గాలి ముద్దు కృష్ణమ్మనాయుడు మృతితో తెలుగుదేశం నిఖార్స యిన నేతను కోల్పోయిందని పంచాయతీరాజ్, ఐటీ, గ్రామీణాభి వృద్ధి, గృహ నిర్మాణ శాఖల మంత్రి నారా లోకేష్ సంతాపం ప్రకటించారు. మంత్రిగా, ఎమ్మెల్సీగా, ఎమ్మెల్యేగా ముద్దు అందించిన సేవలు ఎనలేనివని, ప్రజల్లో ఆజరామరం నిలిచారంటూ దివంగత నేత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ముద్దు హఠాన్మరణం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని, ఉపముఖ్యమంత్రి(రెవెన్యూ) కేఈ.కృష్ణమూర్తి పేర్కొన్నారు. తమ మధ్య మంచి స్నేహం ఉండే దని, ఎన్టీఆర్ ఆత్మ గౌరవ నినాదాన్ని అందుకొని ఉన్న ఉద్యోగాన్ని తృణప్రాయంగా వదిలిపెట్టి క్రియాశీలక రాజకీయాల్లోకి వచ్చారని తెలిపారు. ముద్దుది ముక్కు సూటిగా మాట్లాడే స్వభావమని ఉప ముఖ్యమంత్రి చినరాజప్ప తన సంతాప సందే శంలో పేర్కొన్నారు. ఆరుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎమ్మెల్సీగా, మంత్రిగా రాష్ట్ర రాజకీయాలలో ముద్దు కృష్ణమ్మనాయుడు చెరగని ముద్ర వేశారని మంత్రి సుజయకృష్ణ రంగారావు తన సంతాపాన్ని తెలియజేశారు. మాజీ మంత్రి, ఎమ్మెల్సీ గాలి ముద్దు కృష్ణమ్మ మృతి టిడిపికి, చిత్తూరు జిల్లాకు తీరని లోటు అని మంత్రి సునీత అన్నారు. టిడిపిలో సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన మంచి నాయకుడిని కోల్పోవడం బాధగా ఉందని తెలిపారు.

అలాగే ముద్దుకృష్ణమ నాయుడు ఆకస్మిక మృతి పట్ల ప్రభుత్వ చీఫ్ విప్ పల్లె రఘునాథ్ రెడ్డి, ఎక్సైజ్ శాఖ మంత్రి కె.ఎస్.జవహర్, మంత్రి అమర్‌నాథ్ రెడ్డి, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకర్‌రావు, మంత్రి అచ్చెన్నాయుడు, సమాచార, పౌర సంబంధాల, గృహ నిర్మాణ శాఖ మంత్రి కాల్వ శ్రీనివాసులు, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనందబాబు, నరసరావు పేట ఎంపీ రాయపాటి సాంబశివరావు, రాష్ట్రరహదారులు, భవనాల శాఖ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు, కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రిపితాని సత్యనారాయణ, వ్యవసాయ శాఖమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, న్యాయ, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, మంత్రి కళా వెంకట్రావు, వైద్య, ఆరోగ్య శాఖమంత్రి కామినేని శ్రీనివాస్, టూరిజం మంత్రి భూమా అఖిల ప్రియ, దేవాదాయ శాఖమంత్రి మాణిక్యాలరావు, మాజీ మంత్రి రావెల కిషోర్‌బాబు, మాజీ మంత్రి పెద రత్తయ్య, కనకదుర్గ ఆలయ కమిటీ ట్రస్టు బోర్డు సభ్యుడు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, టీడీపీ ఎమ్మెల్సీ వివివి చౌదరి సంతాపం వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీకి ఎంతో సేవలందించిన ముద్దు కృష్ణమ మృతి తీవ్ర దిగ్భ్రాంతిని కలిగిం చిందన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

జగన్ దిగ్భ్రాంతి

సీనియర్‌రాజకీయ నాయకుడు ముద్దుకృష్ణమనాయుడు మృతిపట్ల వైసీపీ అధ్యక్షుడు, శాసనసభ ప్రతిపక్షనేత తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ముద్దుకృష్ణమనాయుడు తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో నిరాడంబరుడిగాపేరుతెచ్చుకున్నారని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నట్లు జగన్ తెలిపారు. ఆయన కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

రఘువీరా, కేవీపీ, సీఆర్ సంతాపం

మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నాయకుడు ముద్దు మృతికి ఏపీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు, మాజీ ఎంపీ సి రామచంద్రయ్య(సిఆర్) వేర్వేరు ప్రకటనల్లో సంతాపం తెలిపారు. అరుదైన రాజకీయ నాయకుల్లో ఆయన ఒకరని పేర్కొన్న నాయకులు ముద్దుకృష్ణమనాయుడు కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.



ఆప్తమిత్రుడిని కోల్పోయా

- ఆయన పనితీరు అందరికీ స్ఫూర్తిదాయకం
- వారి కుటుంబానికి అండగా ఉంటా: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు



తిరుపతి, ప్రభ న్యూస్ బ్యూరో: రాజకీయపరంగానే కాకుండా వ్యక్తిగతంగా కూడా గాలి ముద్దుకృష్ణమ నాయుడుతో తనకు ఎన్నో ఏళ్ల సాహచర్యం ఉంది. ఆయనలోని క్రమశిక్షణ, చిత్తశుద్ధి, నిరంతర శ్రమ అనే లక్షణాలు ఎవరికైనా స్ఫూర్తిదాయకాలే. విధి బలీయం కారణంగా దూరమైన ముద్దుకృష్ణమనాయుడు లేని లోటు ఎవరూ భర్తీ చేయలేరని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. ఆయన ఘనంగా నివాళులర్పించారు. అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మరణించిన గాలి ముద్దుకృష్ణమ నాయుడు పార్థివదేహాన్ని బుధవారం ఉదయం ఇక్కడకు సమీపంలోని ఆయన స్వగ్రామమైన వెంకటాపురంకు తీసుకువచ్చారు. ఆయనకు నివాళులర్పించడానికి చంద్రబాబు మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రత్యేక విమానంలో తిరుపతికి వచ్చారు. రేణిగుంట విమానాశ్రయం నుంచి నేరుగా వెంకటాపురం గ్రామానికి చేరుకున్న చంద్రబాబు ముద్దుకృష్ణమనాయుడు మృతదేహంపై పుష్పగుచ్ఛాన్ని ఉంచి శ్రద్ధాంజలి ఘటిం చారు. ఆపై దాదాపు అరగంటపాటు ముద్దుకృష్ణమ నాయుడు సతీమణి సరస్వతమ్మ, కుమారులు భాను, జగదీష్ తదితర కుటుంబ సభ్యులను ఓదార్చారు. వారికి ధైర్యం చెప్పి తాను వారి కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ముద్దుకృష్ణమనాయుడు కుమారుల భవిష్యత్తుకు సహకరిస్తానని సరస్వతమ్మకు చెప్పారు. అనంతరం చంద్రబాబు విలేకరులతో మాట్లాడుతూ ఇటీవలే తనను వ్యక్తిగతంగా కలిసిన ముద్దు కృష్ణమ నాయుడు దుబాయ్ పర్యటనకు వెళ్లే ముందు మళ్లీఒకసారి కలుస్తానని చెప్పి వెళ్లారని, కానీ ఇంతలో ఆయన ఈ విధంగా కన్నుమూస్తారని తాను అనుకోలేదన్నారు. ఈ మధ్యే అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చేరి కోలుకున్నారని, డాక్టర్లు కూడా డయాలసిస్ అవసరం లేదని చెప్పి ఇంటికి పంపించారని, మళ్లీ రెండురోజుల క్రితం చలిజ్వరంతో ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతూ విధి వశాత్తూ అందరికీ దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాలలో అధ్యాపకుడుగా పనిచేస్తూ, రాజకీయాలలోకి వచ్చిన ముద్దుకృష్ణమనాయుడులో క్రమశిక్షణ, చిత్తశుద్ధి, నిరంతరం ప్రజల్లో ఉండటం అనే లక్షణాలు స్ఫూర్తిదాయకంగా ఉండేవన్నారు. అభివృద్ధి గురించి ఎప్పుడూ పాటుపడే తత్వంతో పాటు ఎప్పుడైనా గంట సమయం దొరికితే ప్రజల సమస్యలను పరిష్కరించడంపై దృష్టిని సారించేవారన్నారు. జీవితంలో ఎంతోమంది చాలామంది రాజకీయ నాయకులను చూసినా కానీ ముద్దుకృష్ణమనాయుడు వంటి నాయకుడిని మళ్లీ చూడలేమన్నారు. తన సహచరుడుగా, ఆత్మీయుడుగా ఎన్నో ఏళ్లపాటు మెలిగిన ముద్దు మరణం రాష్ట్రానికే కాకుండా తనకు వ్యక్తిగతంగా కూడా తీవ్రమైన లోటుగా చంద్రబాబు పేర్కొన్నారు. ఆయన లేని లోటు ఎవరూ భర్తీ చేయలేరని అంటూ స్ఫూర్తిదాయకమైన జీవితాన్ని గడిపిన ఆయన ఆశయాలను సాధించడమే నిజమైన నివాళి అవుతుందన్నారు.

ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ముద్దుకృష్ణమనాయుడు ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నానన్నారు. ఆయనతో పాటు ముద్దుకృష్ణమనాయుడు మృత దేహాన్ని సందర్శించి నివాళులర్పించిన వారిలో రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, నారాయణ, దేవినేని ఉమామహేశ్వర రావు, తదితర పార్టీ నాయకులున్నారు.

అసెంబ్లీ సీట్ల పెంపు హుళక్కేనా...?

- ఆశావహుల ఆశలపై నీళ్లు చల్లిన మోడీ
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారిస్తున్న నేతలు
- బడ్జెట్ కేటాయింపులే ఇలా ఉంటే ఇక సీట్ల పెంపు సాధ్యమేనా అంటున్న సీనియర్లు
- అన్నిపార్టీల నేతల్లో గుబులు రేపుతున్న కేంద్ర బడ్జెట్ తీరు

అమరావతి, ఆంధ్రప్రభ : అవిభాజ్య ఆంధ్రప్రదేశ్‌కు విభజన చట్టంలో పొందుపర్చిన విధంగా బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడంతో అసెంబ్లీ సీట్ల పెంపుపై ఆశలు పెట్టుకున్న రాజకీయ నేతలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. పార్టీలతో సంబంధం లేకుండా రాజకీయ నాయకులందరి లోనూ ప్రస్తుతం ఈ ఆందోళన మొదలైంది. చట్టంలో పొందుపర్చిన అంశాలను ఇవ్వడంలోనే కేంద్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరు చూస్తే ఇక అసెంబ్లీ సీట్ల పెంపు లేదనే నిర్ణయానికి వారు వస్తున్నారు. ప్రస్తుతం ఏపీలో 175 అసెంబ్లీ, 25 పార్లమెంటు స్థానాలు ఉన్నాయి. నియోజకవర్గాల పెంపు జరిగితే ప్రస్తుతం ఉన్న 175 అసెంబ్లీ సీట్లు 225కు, 25 పార్లమెంటు స్థానాలు 30కు పెరిగే అవకాశం ఉంది. దీంతో గత సార్వత్రిక ఎన్నికల్లో టిక్కెట్టు ఆశించి భంగపడ్డవారంతా ఈ నియోజకవర్గాల పునర్విభజనపైనే భవిష్యత్ ఆశలు పెట్టుకున్నారు. ఈ పరిస్థితుల్లో ఇటీవల కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్ వీరి ఆశలపై నీళ్లు చల్లింది. నిన్నమొన్నటి వరకూ ఊరించిన సీట్ల పెంపు విషయం ప్రస్తుతం ఊసేలేకపోవడంతో వారి రాజకీయ భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకున్నాయి. గత నెల రోజులుగా రెండు తెలుగు రాష్ట్రాల్లోని రాజకీయ నిరుద్యోగులు ఉన్నవారంతా సీట్ల పెంపు బిల్లు ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లో ఆమోదానికి స్పీకర్ టేబుల్ ముందుకు వస్తోందని ఆశపడ్డారు. బిల్లు తయారైందని, ఈ బడ్జెట్ సమావేశాల్లో ఈ బిల్లుకు ఆమోదం లభిస్తుందని ప్రచారం కూడా జోరుగానే సాగింది. ఇరు రాష్ట్రాల ముఖ్య మంత్రులు కూడా ప్రధానిని కలిసిన పలు సందర్భాల్లో ఈ అంశంపై చర్చించారు. దీంతో ఇరు రాష్ట్రాల్లోని అనేకమంది నేతలు సీట్ల పెంపు అంశంపై కొండంత ఆశ పెంచుకున్నారు. ఈనేపథ్యంలో ముఖ్యంగా అధికార పార్టీల్లో ఈ అంశం తీవ్ర గందరగోళానికి గురిచేసే అంశంగా మారింది. ఈ పరిస్థితుల్లో ఆశావహులు ఏమి చేయాలో పాలుపోక సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్నారు.

మార్చి వరకు వేచిచూసే ధోరణిలో...

అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీల్లో సీట్లపెంపుపై ఇప్పటివరకూ సహనంతో వేచిఉన్న నేతలంతా మార్చి వరకూ వేచి చూడాలనే యోచనలో ఉన్నారు. మార్చి తరువాత కేంద్రం తీసుకునే నిర్ణయంపై తమ భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకోవాలని నిర్ణయానికి వచ్చారు. ముందస్తు ఎన్నికలు.. అందునా జమిలీ ఎన్నికలు ఉంటే అప్పుడు నిర్ణయాన్ని తాజా పరిస్థితుల నేపథ్యంలో తీసుకోవాలని యోచిస్తున్నారు. ఒక వేళ కేంద్రం ముందస్తుకు వెళ్లి, రాష్ట్ర ప్రభుత్వాలు వెళ్లకపోతే ఎంపీ ఎన్నికల ఫలితాల సరళిని ఆసరాచేసుకుని అధికారపార్టీవైపు వెళ్లేందుకు కొందరు నిర్ణయించుకునే అవకాశం ఉంది. రాష్ట్ర ప్రభుత్వాలు ముందస్తు ఎన్నికలు వెళ్లకపోయినట్లయితే వేచిచూసే ధోరణిలో ఉండి 2019 నాటికి ప్రస్తుత సిట్టింగ్‌ల పనితీరును అస్త్రంగా ఎంచుకుని అధిష్టానాలవద్ద వారి మైనస్‌లను ప్రస్తావించి సీట్లు పొందే యోచనలో మరికొంత మంది ఉన్నారు.

రాష్ట్రానికి రావల్సిన నిధులు, కేంద్ర సంస్థలు రావాల్సిన నేపథ్యంలో అవిరాకపోవడంతో రాష్ట్రప్రజలు అసంతృప్తితో ఉంటే రాజకీయ నేతలు మాత్రం తమ భవిష్యత్తుకు వ్యూహాలు రచిస్తున్నారు. ఈనేపథ్యంలో సీట్ల పెంపు అంశంపై కేంద్ర ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందోని అటు రాజకీయ నాయకులు, ఇటు ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

ఉత్తరాది రాజకీయాల్లో సినీ వివాదాల ట్రిక్స్



(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికల్ని ప్రభావితం చేసేందుకు ఉత్తరాది రాజకీయ నాయకులు నిర్మాణంలో ఉన్న మణికర్ణిక చిత్రాన్నెంచుకున్నారు. దీనిచుట్టూ వివాదాలల్లడం మొదలెట్టారు. పద్మావత్‌లో రాజపుత్ స్త్రీల్ని అవమానించేలా చిత్రీకరణ జరిగిందంటూ వివాదాన్ని రాజేస్తే మణికర్ణికలో బ్రాహ్మణ స్త్రీల పట్ల అపచారం జరిగిందంటూ వివాదానికి ఆజ్యం పోస్తున్నారు. మహ్మదీయ చక్రవర్తి, క్రూరుడైన అల్లావుద్దీన్ ఖిల్జీతో రాణిపద్మావతికి స్వప్నంలో శృంగార దృశ్యాల్తో కూడిన పాట చిత్రీకరించారంటూ లేని సంఘటనను ఊహించుకుని రాజపుత్రుల ప్రతినిధిగా కర్ణిసేన ఈ చిత్రాన్ని నిషేదించాలంటూ పెద్ద ఎత్తున ఉద్యమించింది. పద్మావత్ చిత్రీకరణ సమయంలోనే యూనిట్‌పై దాడులు చేసింది. రెండుసార్లు అవుట్‌డోర్ సెట్టింగ్‌లను ధ్వంసం చేసింది. నిర్మాత, దర్శకుడు సంజయ్‌లీలాబన్సాలీని హత్యచేసి తలతెస్తే పదికోట్లు ఇస్తామంటూ ప్రకటించింది. పద్మావతిగా నటించిన దీపిక పదుకునే ముక్కు కోస్తే ఐదుకోట్ల నజరానాను ఇస్తామంది. సెన్సార్ పూర్తయ్యాక కూడా విడుదలకు అడ్డంపడింది. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్ని దృష్టిలో పెట్టుకుని కేంద్రం కూడా ఈ చిత్రంపై ఆంక్షలు విధించింది. ఏదైనా ఈ ఉద్యమ ప్రభావం మాత్రం ఉత్తరాది రాజకీయాలపై తీవ్రంగానే పడింది. గుజరాత్‌లో ఆపసోపాలుపడి బిజెపి తిరిగి అధికారంలోకొచ్చింది. కాగా రాజస్థాన్ పరిణామాల్తో ఆ రాష్ట్రముఖ్యమంత్రి వసుంధరారాజేను పదవినుంచి దించేయాలని బిజెపి అధిష్టానం యోచిస్తోంది.

ఇప్పుడు మణికర్ణికపై కూడా ఇలాంటి వివాదాలే ముసురుకున్నాయి. ఝాన్సీలక్ష్మీభాయ్ అసలుపేరు మణికర్ణిక. ఈ చారిత్రక ఇతివృత్తాన్ని తెలుగు దర్శకుడు క్రిష్ అత్యద్భుత రీతిలో జాతీయస్థాయి చిత్రంగా తీర్చిదిద్దుతున్నారు. దీనికి విజయేంద్రప్రసాద్ కథాసంకలనం చేశారు. జాతీయ ఉత్తమనటి కంగనారనౌత్ ప్రధానపాత్రలో నటిస్తున్నారు. కాగా బ్రిటీష్‌జాతీయుడైన రాబర్ట్ ఎల్లీస్‌తో మణికర్ణిక ప్రేమాయణం నడిపిందంటూ చిత్రంలో చూపించనున్నారంటూ అఖిలభారత సర్వబ్రాహ్మణ మహాసభ వివాదం రాజేసింది. మణికర్ణిక తమ బ్రాహ్మణజాతికి చెందిన స్త్రీ అని, ఆమె పాత్రను అవమానకర రీతిలో చిత్రీకరించడాన్ని సహించలేక పోతున్నామంటూ మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేష్‌మిశ్రా రోడ్డెక్కి ఉద్యమిస్తున్నారు. ఆయనిప్పుడు రాజస్థాన్ రాష్ట్ర కాంగ్రెస్ కార్యదర్శిగా ఉన్నారు.

వచ్చే ఏడాది జనవరిలో ఈ చిత్రాన్ని విడుదల చేయాలని నిర్మాతలు ఆలోచిస్తున్నారు. దాదాపుగా అప్పుడే సార్వత్రిక ఎన్నికలు కూడా జరగనున్నాయి. ఈ నేపధ్యంలోనే కులపరమైన ఈ వివాదాన్ని రాజేశారన్న సందేహాలు వ్యక్తమౌతున్నాయి. క్రిష్ ఒక బాధ్యతాయుతమైన దర్శకుడు. తెలుగులో లంచాలకు వ్యతిరేకంగా వచ్చిన ఠాగూర్ చిత్రాన్ని గబ్బర్ ఈజ్ బ్యాక్ పేరిట హిందీలో పునర్‌నిర్మించారు. అలాగే తెలుగులో ఆయన తీసిన కంచెకు ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా జాతీయ అవార్డు లభించింది. క్రీస్తుపూర్వం రెండోశతాబ్ధం నాటి తెలుగు చక్రవర్తి గౌతమిపుత్ర శాతకర్ణి కథను చారిత్రక ఆధారాల్తో సహా ఆయన చిత్రంగా మలిచారు. అలాగే కథకుడు విజయేంద్రప్రసాద్‌కు బాధ్యతాయుతమైన చరిత్ర ఉంది. బాహుబలి రెండు భాగాలకు కథ అందించింది ఆయనే. హిందీలో ఘన విజయం సాధించిన భజరంగీ బాయిజాన్ చిత్రం కూడా ఆయన కథ ఆధారంగానే తీశారు. వైద్యుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ రూపొందించిన మెర్సల్ తమిళ చిత్రం ఘన విజయం సాధించింది. దీనిక్కూడా ఆయనే కథనందించారు.

ఇంతటి బాధ్యతాయుత వ్యక్తుల ఆధ్వర్యంలో మణికర్ణిక చిత్రం రూపు దిద్దుకుంటోంది. అయినప్పటికీ ఊహాజనిత ఆలోచనల్తో ఈ చిత్రానికి వ్యతిరేకంగా వివాదాలు మొదలయ్యాయి. బ్రాహ్మణసేన చేపట్టిన ఈ ఉద్యమానికి కర్ణిసేన కూడా మద్దతు ప్రకటించింది. ఈ చిత్రాన్ని దేశవ్యాప్తంగా విడుదల చేసేందుకు వీల్లేదంటూ ఈ రెండు సంఘాలు ఈ ఏడాది పొడవునా ఉద్యమాలకు సిద్దమౌతున్నాయి. ఉత్తర్‌ప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరాఖండ్ తదితర ప్రాంతాల్లోని బ్రాహ్మణుల ఓట్లనే లక్ష్యంగా చేసుకుని ఈ ఉద్యమం మొదలైందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. గతంలోనే ఉత్తరాదిన పలువురు నటులు రాజకీయాల్లోకొచ్చారు. అమితాబచ్చన్, ధర్మేంద్ర, దారాసింగ్, హేమమాలిని, జయాబచ్చన్, సునీల్‌దత్, వినోద్‌ఖన్నా, శతృఘ్నసిన్హా, రాజేష్‌ఖన్నా ఇలా ఎందరో రాజకీయాల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. కానీ వీరెవరూ రాజకీయాల్లో తమదైన ముద్రవేయలేక పోయారు. దీర్ఘకాలం రాజకీయాల్లో మనుగడ సాగించలేక పోయారు. కానీ పద్మావత్, మణికర్ణిక చిత్రాలు మాత్రం ఉత్తర రాజకీయాల్ని ఏదొక దిశగా ఖచ్చితంగా ప్రభావితం చేస్తున్నాయని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

ముస్లిం మైనార్టీలకు సబ్‌ప్లాన్ ద్వారా నిధులు

- ఇస్లామిక్ బ్యాంకుల ద్వారా వడ్డీలేని రుణాలు
- దుల్హన్ పథకం ద్వారా రూ. లక్ష ముస్లిం మహిళలకు పెళ్ళి కానుక
- ముస్లిం మైనార్టీ సమ్మేళన సదస్సులో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి

నెల్లూరు, ప్రభన్యూస్ బ్యూరో: రాష్ట్రంలోని ముస్లిం మైనారిటీలందరినీ ఆర్థికంగా ముందుకు నడిపించేందుకు వారి కోసం ప్రత్యేక సబ్‌ప్లాన్ ద్వారా నిధులు కేటాయిస్తామని వైకాపా అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. బుధ వారం ఆయన ఆత్మకూరు నియోజకవర్గం ఏఎస్‌పేట మండలం హసనాపురంలో జరిగిన ముస్లిం మైనారిటీ సమ్మేళన సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైకాపా అధికారంలోకి వస్తే గతంలో ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీలకోసం సబ్‌ప్లాన్ క్రింద ప్రత్యేక నిధులను కేటాయించిందని అదే తరహాలో ముస్లింల కోసం సబ్‌ప్లాన్ క్రింద నిధులు కేటాయించి వారిని అన్నివిధాల ఆదుకుంటామని జగన్ ముస్లిం సోదరులకు భరోసా ఇచ్చారు. అదేవిధంగా వారికోసం ఇస్లామిక్ బ్యాంక్‌లను ఏర్పాటు చేసి నిరుద్యోగులందరికీ వడ్డీలేని రుణాలు ఇస్తామన్నారు. అలాగే ఒక్కో నిరుద్యోగికి రూ.5లక్షలతో పాటు మరో లక్ష రూపాయలు సబ్సిడీ క్రింద కూడా రుణ సహాయం అందిస్తామన్నారు. రాష్ట్రంలో చాలా మంది ముస్లింలు పేదరికంతో తమ పిల్లలను చదివించలేకపోతున్నారని, మరికొంతమంది ఆడబిడ్డలకు పెళ్ళిళ్ళు కూడా చేయడానికి ఆర్థికంగా సతమతమవుతున్నారని, అటువంటి పేద ముస్లింలను దృష్టిలో ఉంచుకుని దుల్హన్ పథకం ద్వారా పెళ్ళి చేసుకునే ముస్లిం మహిళలకు పెళ్ళి కానుక క్రింద లక్ష రూపాయలు అందిస్తామన్నారు. అవి కూడా పెళ్ళిలోపే అందించే విధంగా ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. అలాగే మసీదులను నమ్ముకుని జీవనం సాగిస్తున్న ఇమామ్‌లకు ప్రతినెలా రూ.10వేలు వంతున, సహాయ ఇమామ్‌లకు రూ.5వేలు వంతున అందిస్తామన్నారు. ప్రత్యేకించి రాష్ట్రంలో మసీదులు, చర్చిలు, దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక నిధులను కేటాయించడంతో పాటు వాటికి సంబంధించిన భూములను పరిరక్షించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవడంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఘోరంగా విఫలమయ్యారని, ఇప్పటికే ఈ వ్యవహారంలో అనేకమంది ఆత్మహత్యలు చేసుకున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదన్నారు. కేవలం రూ.1100 కోట్ల రూపాయలు చెల్లిస్తే రాష్ట్రవ్యాప్తంగా వేలాది అగ్రిగోల్డ్ బాధితులకు ఉపశమనం కలుగుతుందని, ఇటువంటి సున్నితమైన సమస్యను కూడా చంద్రబాబు పరిష్కరించలేకపోతున్నారని జగన్ ఈసందర్భంగా బాబుపై నిప్పులు చెరిగారు. ఈ విషయంపై వైకాపా పోరాటం చేస్తుందని, బాధితులందరికీ అండగా ఉంటుందని, ఒకవేళ ఇప్పట్లో ప్రభుత్వ ఈ సమస్యను పరిష్కరించలేకపోతే వచ్చే ఎన్నికల్లో వైకాపా అధికారంలోకి రాగానే తక్షణమే అగ్రిగోల్డ్ బాధితులకు రూ.1100లు చెల్లించేలా నిర్ణయం తీసుకుంటామన్నారు. పై సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే మేకపాటి గౌతమ్ రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి, సూళ్ళూరుపేట ఎమ్మెల్యే నెలవల సంజీవయ్య, గుంటూరు ఎమ్మెల్యే ముస్తాఫ్, మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి, ఒంటేరు వేణుగోపాల్ రెడ్డి తదితర ముస్లిం నాయకులు పాల్గొన్నారు.



బెల్టు తీయాల్సిందే!

- మద్యం సరఫరా చేసే షాపులను మూసేయండి
- సమీక్షా సమావేశంలో సీఎస్ దినేష్‌కుమార్

అమరావతి, ఆంధ్రప్రభ: ప్రభుత్వ ఆదేశాలకు విరుద్ధంగా బెల్టు షాపులు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. బెల్టుషాపులకు మద్యం సరఫరా చేసే షాపులపై చర్యలు తీసుకొని యజమానులపై కేసు లు నమోదు చేయాలన్నారు. అవసరమైనుకుంటే షాపుల లైసెన్స్‌ల రద్దుకు వెనుకాడవద్దంటూ ఆయన సూచించారు. రాష్ట్రంలో బెల్టు షాపుల నిరోధంపై తీసుకున్న చర్యలపై ఎక్సైజు అధికారులతో బుధవారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో దినేష్‌కుమార్ సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో బెల్టు షాపులను నిలువరించేందుకు తీసుకుంటున్న చర్యలను రాష్ట్ర ఎక్సైజు శాఖ ముఖ్య కార్యదర్శి డి.సాంబశివరావు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. గతేడాది జూలై 18న రాష్ట్రమంత్రి మండలి తీర్మానం మేరకు ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 8,827 కేసులు నమోదు



చేశామన్నారు. ఆయా కేసుల్లో 9,192మందిని అరెస్టు చేయగా, 331 వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. బెల్టు షాపులకు మద్యం సరఫరా చేసిన 265 మద్యం షాపులను మూసేయించినట్లు సాంబశివరావు చెప్పారు. పరిష్కార వేదిక 1100 ద్వారా 7,649 ఫిర్యాదులు వచ్చాయని, వీటిలో 7,641 ఫిర్యాదులకు పరిష్కారం చూపామన్నారు. ఈ సందర్భంగా సీఎస్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో బెల్ట్‌షాప్ అనే మాట వినబడకూడదన్నారు. బెల్టు షాపుల నిర్వహణలో ఎక్సైజు సిబ్బంది పాత్ర ఉంటే విధుల నుంచి తొలగించాలని ఆదేశించారు. కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను ప్రతి మూడు నెలలకు ఒకసారి వేలం ద్వారా విక్రయించాలని సూచించారు. సమీక్షా సమావేశంలో డీజీపీ డాక్టర్ ఎం.మాల కొండయ్య, రాష్ట్ర ఎక్సైజు శాఖ ప్రత్యేక కమిషనర్ డాక్టర్ పి.లక్ష్మీనరసింహం, ఎక్సైజు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కె.వెంకటేశ్వరరావు, శాంతి భద్రతల విభాగం అదనపు డీజీ హరిష్ కుమార్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలి

రాష్ట్రంలో ఇసుక అక్రమ తవ్వకాలతో పాటు గ్రానైట్ అక్రమ రవాణాను అడ్డుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ ఆదేశించారు. ప్రజలకు ఉపాధి, పరిశ్రమలు ముడి సరుకు, ప్రభుత్వానికి ఆదాయం..ఇదీ గ్రానైట్ మైనింగ్ లక్ష్యం కావాలని స్పష్టం చేశారు. సచివాలయంలోని తన కార్యాలయంలో గనులు, భూగర్భ శాఖాధికారులతో బుధవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇసుక అక్రమ రావాణాను అడ్డుకోవడానికి తీసుకుంటున్న చర్యలేమిటని ప్రశ్నించారు. ఆయా జిల్లా కలెక్టర్ల అధ్యక్షతన ఏర్పాటయిన జిల్లా స్థాయి కమిటీలు సూచించిన ధరలకే ఇసుక విక్రయాలు జరుగుతున్నాయా.. లేదా..? అని సీఎస్ అడిగి తెలుసుకున్నారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్నవారిపై చర్యలు తీసుకోవడమే కాకుండా వాహనాలను కూడా సీజ్‌చేయాలన్నారు. ఇసుక అక్రమ రవాణాలో అధికారుల పాత్ర ఉంటే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర గనులు, భూగర్భ శాఖ కార్యదర్శి శ్రీధర్‌ను సీఎస్ ఆదేశించారు.

గ్రానైట్ మైనింగ్‌తో మేలు కలగాలి

గ్రానైట్ మైనింగ్‌తో అటు రాష్ట్రప్రభుత్వానికి ఆదాయం పెరగడంతోపాటు ప్రజలకు ఉపాధి లభించాలని, అదే సమయంలో స్థానిక యూనిట్లకు ముడి సరుకులు లభ్యం కావాలని ఇదే గ్రానైట్ మైనింగ్ లక్ష్యమని రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ స్పష్టం చేశారు. రాష్ట్ర అవసరాలకు భిన్నంగా గ్రానైట్ ఇతర రాష్ట్రాలకు తరలిపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలకు అనుగుణంగానే గ్రానైట్ మైనింగ్ జరగాలన్నారు. రెండేళ్ల నుండి గ్రానైట్ మైనింగ్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి ఏ మేరకు ఆదాయమొచ్చిందని, నెలల వారీగా ఆదాయపు వివరాలను అందజేయాలని అధికారులను సీఎస్ ఆదేశించారు. గ్రానైట్ అక్రమ మైనింగ్ అధికారుల పాత్ర ఉంటే, ఎట్టి పరిస్థితుల్లోనూ క్షమించేంది లేదని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర గనులు, భూగర్భ శాఖ కార్యదర్శి శ్రీధర్, జాయింట్ డైరెక్టర్లు నరసింహారెడ్డి, నాగరాజు, వెంకటేశ్వరరావు, పుల్లయ్య, చంద్రశేఖర్ పాల్గొన్నారు.


ఇంకెంత కాలం మభ్యపెడతారు?!

- కేంద్రం అక్కడో మాట... ఇక్కడో మాట
- చంద్రబాబుపై నమ్మకం పోతోంది...
- మోడీ న్యాయం చేస్తారని ఆశించా
- ప్లకార్డులు, స్లోగన్స్‌తో పనులు కావు
- 2014లో పోటీ చేయకపోవడం పొరపాటే
- శాంతియుత బంద్‌లకే మా మద్దతు
- విభజన సమస్యలపై ఉమ్మడి వేదిక అవసరం
- జనసేన అధినేత పవన్‌కల్యాణ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా సాధించేందుకు రాజకీయాలకు అతీతంగా ఐక్యకార్యచరణ సమితి(జేఏసీ)ని ఏర్పాటు చేయనున్నట్లు జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ప్రకటించారు. ఈ జేఏసీలో అన్ని రాజకీయపార్టీలు, విద్యావంతులు, మేధావులు భాగస్వామ్యం కావాలని ఆయన పిలుపునిచారు. ప్రత్యేకహోదా కోసం ఇప్పటికే ఆందోళన చేస్తున్న వారితో కలిసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని బుధవారం జరిగిన విలేకరుల సమావేంలో ఆయన చెప్పారు. లోక్‌సత్తా అధ్యక్షుడు జయప్రకాశ్ నారాయణ, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, చలసాని శ్రీనివాస్‌లాంటి వారితో సంప్రదించి జేఏసీ ఏర్పాటు చేస్తామని ఆయన చెప్పారు. కేంద్ర మాజీ మంత్రి చిరంజీవి క్రియాశీలక రాజకీయాల్లో లేనందున ఆయనకు దీంతో ఆయనకు సంబంధం లేదని ఒక ప్రశ్నకు సమాధానంగా పవన్ చెప్పారు. ప్రజల హక్కుల సాధనకోసమే జేఏసీ ఏర్పాటు చేస్తామని, ఇందులో రాజకీయ ప్రయోజనాలు ఉండవని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధనకు జనసేన గొంతు సరిపోవడం లేదని, ప్రాథమిక దశలో ఉన్న తమ పార్టీ జేఏసీలో అందరిని కలుపుకోని పోతుందని పవన్ స్పష్టం చేశారు. 2014 ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేసి ఉంటే పార్లమెంట్, శాసనసభలో తమ వాణిని వినిపించే అవకాశం ఉండేదని ఇప్పుడు తన గొంతు వినిపించే పరిస్థితి లేదన్న బాధ తనకు ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు కొన్ని పరిమితులు ఉన్నాయని, ప్లకార్డులు పట్టుకుని రోడ్లపైకి వస్తే సమస్యలు పరిష్కారం కావని ఆయన అన్నారు.

తెలంగాణ సాధన కోసం అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు కలిసి ఉద్యమించిన రీతిలోనే ఏపీలో కూడా పోరాటం చేయాలని పవన్ పిలుపునిచ్చారు. రెండు రాష్ట్రాల సమస్యలపై భావోద్రేకంలో వ్యాత్యాసం ఉన్నప్పటికీ సమస్య సాధనకు చిత్తశుద్ధితో తాను ఉద్యమించనున్నట్లు పవన్ స్పష్టం చేశారు. ప్రజాశ్రేయస్సు కోసం ఒక వేదికను ఏర్పాటు చేస్తానని, ఆ వేదిక పైకి అందరూ ఒకటిగా రావాలని ఆయన కోరారు. రాష్ట్రానికి న్యాయం జరగాలన్నదే తన ఆకాంక్ష అని ఆ లక్ష్యంతోనే జేఏసీ ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రత్యేక హోదా సాధనపై ప్రజలు కూడా రాజకీయపార్టీలను ప్రశ్నిస్తున్నారని, ఈ తరుణంలో ప్రజా ఆకాంక్ష మేరకు అందరం ఒకటి కావాలని పవన్ కోరారు. రోడ్లపైకి వచ్చి ప్రజలకు ఇబ్బందులు కలిగించడం కాదని రాజకీయ వేదిక ద్వారా సాధించుకోవాలన్నదే తన ఆకాంక్ష అన్నారు. చివరి అస్త్రంగానే రోడ్లపైకి వచ్చి ఉద్యమాన్ని ఉధృతం చేయాలని పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు.

రాష్ట్ర విభజనలో ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం అమలు చేయకుండా అన్యాయం చేస్తుందని ఆయన మండిపడ్డారు. యూపీఏ ఇచ్చిన హామీలను తామెందుకు అమలు చేయాలన్న రీతిలో ఎన్డీయే ప్రభుత్వం దాటవేస్తుందని ఆయన దుయబట్టారు. విభజన బిల్లు హామీలన్నీ అమలు చేస్తామని ఎన్నికల ప్రచారంలో భాజాపా ప్రధాన అభ్యర్థిగా నరేంద్ర మోడీ హామీ ఇచ్చారని, కానీ ఇప్పుడు ఆ అంశాన్ని పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. ప్రత్యేకహోదా, ప్రత్యేక ప్యాకేజీల పేరుతో కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు దోబూచులాడుతూ ప్రజలను మభ్యపెడుతున్నాయని ఆయన ధ్వజమెత్తారు. ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబుల పై ప్రజలకు విశ్వాసం పోతుందని ఆయన అన్నారు. విభజన సమస్యలు పరిష్కరించుకోవాలన్న ఆశతోనే గత ఎన్నికల్లో మోడీతో కలిసి ప్రచారంలో పాల్గొన్నానని పవన్ స్పష్టం చేశారు. హామీల అమలుపై ఏడాదిపాటూ వేచి చూసిన తర్వాతే ప్రధాని మోడీని కలిసి ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరానని ఆయన గుర్తు చేశారు. హోదా సాధ్యం కాదంటూ ప్యాకేజీ ఇస్తామంటే ముఖ్యమంత్రి చంద్రబాబు స్వాగతించారని, అవికూడా ఇంతవరకు ఆచరణకు నోచుకోలేదని ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్యాకేజీ క్రింద రాష్ట్రానికి ఇచ్చిన నిధుల వినియోగంపై లెక్కలు చెప్పడం లేదని కేంద్రం ఆరోపిస్తుంటే, తమకు ఇచ్చిన నిధుల గురించి చెప్పాల్సిన అవసరం లేదని రాష్ట్ర ప్రభుత్వం అనడంతో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయని పవన్ విచారణ వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వివాదం మధ్య ప్రజలు నష్ట పోతున్నారని ఇది ఇంకెంతకాలం కొనసాగాలని ఆయన ప్రశ్నించారు. కేంద్ర బడ్జెట్‌ను రూ.24లక్షల కోట్లతో ప్రకటించినప్పటికీ ఆంధ్రప్రదేశ్‌కు కేటాయింపుల ప్రస్తావన లేకపోవడం బాధకరమన్నారు. పార్లమెంట్‌లో బుధవారం ప్రధాని చేసిన ప్రసంగంలో దివంగత నేతలు పీవీ నరసింహరావు, ఎన్‌టీ.రామారావులను స్మరిస్తూ సెంటిమెంట్ వ్యాఖ్యలు చేసిన తర్వాతనే సమస్యకు పరిష్కారం చూపవని ఆయన అన్నారు. తాము ఎవరిపై పోరాటం చేస్తామన్నది ప్రధానం కాదని కేవలం సమస్య ప్రాధాన్యతకే పరిమితం అవుతామని ఒక ప్రశ్నకు సమాధానంగా పవన్ చెప్పారు. చట్టాలు చేస్తున్న ప్రజాప్రతినిధులు వాటిని పాటించనప్పుడు ప్రజలు స్పందిస్తుంటారని ఇప్పుడు రాష్ట్రంలో కూడా అదే జరుగుతుందని ఆయన అన్నారు. తమ పోరాటం కేవలం సమస్యపైనే అని, వ్యక్తులపై కాదని ఓ ప్రశ్నకు సమాధానంగా పవన్ స్పష్టం చేశారు.



వచ్చే ఎన్నికల్లో ఏ రాజకీయ పార్టీతో కలిసి పోటీ చేస్తారని ఓ విలేకరి ప్రశించగా, ఎన్నికలు, పొత్తుల గురించి మాట్లాడే సమయం కాదన్నారు. ఏ రాజకీయ పార్టీకి మద్దతు ఇస్తారని, ఏ పార్టీతో కలిసి పోటీ చేస్తారని మరో విలేకరి ప్రశ్నించగా తాను ఏరాజకీయ పార్టీకి మద్దతుగా లేనని, కేవలం ప్రజల కోసమేనని చెప్పారు. రాజకీయ పార్టీలతో కాకుండా తనకు ప్రజల మద్దతు ఉంటే చాలునని పవన్ అన్నారు. తాను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల్లో లేనని అలాంటప్పుడు మద్దతు ఇచ్చినట్లు ఎలా అవుతుందని ఆయన అన్నారు. రాజకీయ పార్టీ నిర్మాణంపై స్పందిస్తూ, ప్రస్తుతం తమకు బూత్‌కమిటీలు కూడా లేవని, క్షేత్రస్థాయి నుంచి ఏర్పాటు చేసుకోవాల్సి ఉందని అన్నారు. ఇతర పార్టీల నుంచి వలసలు వస్తే ఆహ్వానిస్తారా...అని ప్రశ్నించగా, వలసలు అనే పదం కన్నా చేరికలను స్వాగతిస్తామని స్పష్టం చేశారు. జనసేన పార్టీ కూడా తోక పార్టీ లాగా మిగిలి పోతుందా అని ఒక విలేకరి ప్రశ్నించగా, చైనాలో ఒక జాతి పాముకు తోకలో కూడా విషయం ఉంటుందంటూ పవన్ కల్యాణ్ తీవ్రంగా స్పందించారు.

11న పవన్‌తో ఉండవల్లి భేటీ



కాకినాడ, ఆంధ్రప్రభ ప్రతినిధి: రాష్ట్రానికి ప్రత్యేక హోదా కావాలంటూ ఉద్యమ నిర్మాణానికి జాయింట్ యాక్షన్ కమిటీని రూపొందించే క్రమాన్ని ప్రారంభించిన జనసేనాధిపతి పవన్‌కల్యాణ్‌తో ఈ నెల 11వ తేదీన మాజీఎంపి ఉండవల్లి అరుణ్‌కుమార్ భేటీ కానున్నారు. బుధవారం పవన్‌కల్యాణ్ అరుణ్‌కుమార్ కు ఫోన్ చేశారు. ఆయన సమయమిస్తే రాజమండ్రికొచ్చి కలిసి జెఎసిపై చర్చిస్తానంటూ ఉండవల్లితో చెప్పారు. దీనిపై స్పందించిన ఉండవల్లి తానే రెండుమూడ్రోజుల్లో హైద రాబాద్‌కొచ్చి కలుస్తానంటూ బదులిచ్చారు. ఇరువురికి సముచితంగా 11వ తేదీన భేటీ కావాలని నిర్ణయించారు. దీనికెలాంటి రాజకీయ ప్రాధాన్యతలేదని ఉండవల్లి మీడి యాకు స్పష్టం చేశారు. ప్రస్తుతం తానే రాజకీయ పార్టీలోనూ లేరన్నారు. ప్రత్యేక హోదా కోసం రాజకీయాలకతీతంగా మేథావుల్తో ఓ కమిటీ రూపొందించే ప్రయత్నాన్ని ఆయన స్వాగ తించారు. పవన్‌కల్యాణ్ జనాకర్షణ కలిగిన నాయకుడు. ఆయన చెబితే పదిమంది వింటారు. దాన్ని ఆచరణలో పెడతారు.

అలాంటి వ్యక్తి హోదా ఉద్యమానికి నాయకత్వం వహిస్తే అది ఖచ్చితంగా కేంద్రంపై తీవ్ర ప్రభావం చూపిస్తుందంటూ ఉండ వల్లి చెప్పారు. విభజన చట్టంలోని ఏ ఒక్క అంశాన్ని కూడా కేంద్రం ఆచరణలో పెట్టడంలేదంటూ ఆయన మండిపడ్డారు. ప్రత్యేకహోదాకు నీతిఆయోగ్ అంగీకరించడంలేదన్న వాదన కూడా సరికాదన్నారు. కేంద్రం ఒప్పుకుంటే మధ్యలో నీతిఆయోగ్ ఎవరంటూ ప్రశ్నించారు. నీతి ఆయోగ్ కూ డా కేంద్రం నియమించిన ఓ కమిటీయేనని మర్చిపోకూడదన్నారు. రాష్ట్రాన్ని మోడి ప్రభుత్వం ఏ మాత్రం పట్టించు కోవడంలేదంటూ విమర్శించారు. ఇచ్చిన హామీల్ని అమలు చేయించుకోవాల్సిన బాధ్యత మనపైనే ఉందన్నారు. ఇందుకోసం ఉద్యమమే సరైన మార్గంగా పేర్కొన్నారు.

పద్దులు భారీ! ... నిధులేవీ?

(మొదటిపేజీ తరువాయి)

తీవ్రంగా ఎదుర్కొంటోంది. అతిపెద్ద ఆర్థిక సంస్కరణ ద్వారా పన్నుల రాబడిని అనూహ్యంగా పెంచుకోవచ్చన్న మోడి వ్యూహం బెడిసికొట్టింది. పెద్దనోట్ల రద్దు, నగదురహిత ఆర్థిక సేవల పెంపుతో భారత ఆర్థిక రంగానికో కుదుపొస్తుందని కేంద్రం భావించింది. ప్రతి రూపాయి మారకాన్ని బ్యాంక్‌తో ముడిపెట్టడం ద్వారా క్రయవిక్రయాల్లో పారదర్శకత పెరుగుతుందని అభిలషించింది. ఇందుకు అనుగుణంగా పన్నుల వసూళ్ళలో వృద్ధి కనిపిస్తుందని భావించింది. ఈ చర్యలు చేపట్టి ఏడాది పూర్తయింది. ఇప్పుడు పరిస్థితిని పరిశీలిస్తే నగదు రహిత సేవలు విస్తరించడానికి బదులు బ్యాంకు రహిత ఆర్థిక సేవలు విస్తరించాయి. ఇందుకు కారణం బ్యాంకులతోపాటు ఆదాయపన్ను వంటి కేంద్ర ప్రభుత్వ శాఖలు అనుసరిస్తున్న తీరే. దేశవ్యాప్తంగా ఎటిఎంలన్నీ 'నో క్యాష్' బోర్డులతో దర్శనమిస్తున్నాయి. తమ సొమ్ము బ్యాంకులో నిల్వ ఉన్నా తీసుకునే వెసులుబాటు లేక గతేడాదిగా భారతీయుడు అనేక అవస్థలకు గురవుతూనే ఉన్నాడు. ఇక బ్యాంక్‌ల నుంచి నేరుగా నగదు ఉపసంహరణకు సవాలక్ష ఆంక్షలు విధించారు. ప్రతి ఉపసంహరణకు నిర్దిష్ట కారణాన్ని చూపాల్సిందేనని నిబంధన పెట్టారు. రూ.49 వేలుదాటితే ఉపసంహరించే వీల్లేకుండా పరిమితి విధించారు. పైగా సొంతసొమ్ము ఉపసంహరణదార్లపై కూడా ఆదాయ పన్ను శాఖ దాడులు చేసి ఆరాలు తీస్తోంది. మరోవైపు బ్యాంకుల్లోనున్న ప్రజల ధరావతుల్ని అవసరమైతే బ్యాంకులు షేర్ల రూపంలోకి మార్చుకునే అవకాశాన్ని కేంద్ర ప్రభుత్వం ఆయా బ్యాంకుల యాజమాన్యాలకు ఇచ్చింది. దీంతో బ్యాంకుల్లో తమ సొమ్ముకు ఇక భద్రతలేదని సగటు భారతీయుడికి అర్ధమైంది. బ్యాంకులు తమ అవసరాలు తీర్చలేవని అర్ధమైపోయింది. అక్కడి నుంచి బ్యాంకుల్లోని ఫిక్స్‌డ్ డిపాజిట్ల ఉపసంహరణ జోరందుకుంది. మరోవైపు నగదుపై ఆంక్షల కారణంగా అనేక వ్యాపారాలు క్షీణించాయి. రియల్‌ఎస్టేట్ రంగం పతనమైంది. దీంతో బ్యాంకు రహిత సేవలవైపే వ్యాపారులు మొగ్గు మొదలెట్టారు. అవినీతిపరులైన అధికారులు, పన్ను ఎగవేతదార్లు తమ అక్రమార్జనను బంగారం, భూముల రూపంలోకి మార్చేశారు. ఉన్న నగదు నిల్వల్ని వీలైనంతవరకు ఇళ్ళల్లోనే దాచిపెడుతున్నారు. తిరిగి పాతకాలం తరహాలో భూముల్లో పాతరేస్తున్నారు. కొందరు బినామీల పేరిట తరలించేస్తున్నారు. ఇటీవలె బాలీవుడ్ బాద్‌షా నివాసంపై దాడి చేసిన ఆదాయపన్ను శాఖాధికారులకు ఈ విషయం స్వయంగా తెలిసొచ్చింది.

ఇలా మారిన వైఖరితో ఆశించిన స్థాయిలో పన్నుల వృద్ధి చోటు చేసుకోలేదు. ఇది కేంద్ర ప్రభుత్వ ఆదాయంపై ప్రత్యక్షంగా ప్రభావం చూపిస్తోంది. ఇప్పటికిప్పుడు భారీగా వ్యయం చేసేందుకు తగినన్ని నిధులు కేంద్రానికి అందుబాటులో లేవు. అసలే ఎన్నికల ఏడాది కావడంతో ఈ విషయాన్ని బహిర్గతం చేసి ప్రజల నిరసనను ఎదుర్కోవడం ఇష్టంలేకే భారీ పద్దులతో బడ్జెట్ ప్రవేశపెట్టిన కేంద్రం అందుకు తగిన జాగ్రత్తలు కూడా తీసుకుందని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈసారి బడ్జెట్‌లోని పద్దులు, పథకాలన్నీ ప్రకటనలకే తప్ప ఆచరణలోకొచ్చే అవకాశం అంతంత మాత్రమేనని తేల్చేస్తున్నారు.

మళ్లీ ఆత్మగౌరవ ఉద్యమం తప్పదా?

(మొదటిపేజీ తరువాయి)

మళ్ళించేందుకు మోడీ ప్రయత్నించారు. అయితే ఎంతసేపు అప్పుడెప్పుడో కాంగ్రెస్ చేసిన తప్పుల్ని ఎత్తిచూపి విమర్శించడం తప్ప గత నాలుగేళ్లుగా ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం ఏం చేసిందన్నదానిపై మోడీగాని, ఆయన మంత్రివర్గ సహచరులు, పార్టీ సీనియర్‌లెవరు స్పందించడంలేదు. ఇంతవరకు నాలుగు బడ్జెట్‌లు చూశారు. ఐదో బడ్జెట్‌లో ఇక తమకిచ్చేదేం లేదంటూ ఆంధ్రప్రదేశ్ వాసులు గుర్తించారు. అందుకే పార్టీలకతీతంగా కేంద్రంపై ఉద్యమానికి సిద్ధమయ్యారు. ఇందులో భాగంగానే గురువారం వామపక్షాల ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి బంద్‌కు పిలుపునిచ్చారు. సరిగ్గా 1982సమయంలో కూడా ఇలాంటి పరిస్థితే నెలకొంది. ఆంధ్రుల ఆత్మగౌరవం దెబ్బతింది. కేంద్రం ముందు చేయిచాపినా కనికరించేదికాదు. పైగా ఇక్కడి నాయకుల్ని కాంగ్రెస్ అధిష్టానం బఫూన్లుగా పరిగణించింది. ఆ సమయంలోనే ఎన్‌టిఆర్ ఆత్మగౌరవ నినాదంతో రాజకీయ ప్రవేశం చేశారు. ఒక్కసారిగా తెలుగు ప్రజల ఆత్మగౌరవం దశదిశలకు వెల్లడైంది. ప్రపంచవ్యాప్తంగా తెలుగు ప్రజల శక్తి తెలిసొచ్చింది. తిరిగి అలాంటి ప్రయోగం జరగాల్సిన ఆవశ్యకతుందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. లేనిపక్షంలో ఢిల్లీలోని పాలకులు కాంగ్రెస్ అయినా బిజెపి అయినా ఆంధ్రప్రదేశ్ పట్ల సవతితల్లి ప్రేమనే చూపిస్తున్నాయి. తాత్కాలిక ఉపశమనం కోసం పరస్పర నిందారోపణలకు దిగుతూ వారు మాత్రం పబ్బం గడుపుకుంటున్నారని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

సమ్మె కాలాన్ని క్రమబద్ధీకరించి వేతనాలు చెల్లించాలి

- ప్రిన్సిపల్ సెక్రటరీని కోరిన మునిసిపల్ జేఏసీ

అమరావతి, ఆంధ్రప్రభ: మున్సిపల్ కార్మికులు గత డిసెంబర్ 18వ తేదీ నుంచి 22వ తేదీ వరకు చేసిన సమ్మెను క్రమబద్దీకరించాలని, జీతాల చెల్లింపునకు ఉత్తర్వులు జారీ చేయాలని ఏపీ మున్సిపల్ ఎంప్లాయిస్, వర్కర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ కోరింది. ఈ మేరకు జేఏసీ నాయకులు కె.ఉమామహేశ్వరరావు, రాష్ట్ర మున్సిపల్ కార్యదర్శికి బుధవారం ఒక వినతి పత్రం సమర్పించారు. మొత్తం 6 డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. మినిట్స్ కాపీ ఆధారంగా ఉత్తర్వులు జారీ చేయాలని, మలేరియా శాఖ, స్కూల్ స్వీపర్ల సమస్యలపై వెంటనే చర్చలు జరిపి వేతనాలు పెంచాలని, పర్మినెంట్ కార్మికుల సమస్యలపై ప్రత్యేక చర్చకు సంయుక్త సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్ర కేంద్రంలో రెండు నెలలకు ఒకసారి, జిల్లా కేంద్రంలో నెలకు ఒకసారి జాయింట్ మీటింగ్‌లను ఏర్పాటు చేయాలని అన్నారు. శ్రీకాకుళం నగరంలోని పర్మినెంట్ మున్సిపల్ కార్మికుల సమ్మెను రెగ్యూలరైజ్ చేస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని ఉమామహేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్
ఆంధ్రప్రభ
గురువారం 8 ఫిబ్రవరి 2018

వాగ్ధాటిలో కలిసిన వాగ్దానాలు!

వాగ్ధాటిలో, సమయస్ఫూర్తిలో సమకాలీన రాజకీయాల్లో తనకు సమఉజ్జీ ఎవరూ లేరని ప్రధానమంత్రి నరేంద్రమోడీ మరోసారి నిరూపించుకున్నారు. పార్లమెంటు ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చకు సమాధానం చెప్పే అవకాశాన్ని ఆయన ఒక దెబ్బకు రెండు పిట్టలు చందంగా ఉపయోగించుకున్నారు.

ఆయన ప్రసంగం తార్కికంగా బాగానే ఉన్నా, నైతికంగా సరికాదన్నది సుస్పష్టం. గడిచిన ఏడు దశాబ్దాల్లో ఎక్కువ కాలం అధికారంలో ఉన్న కాంగ్రెస్‌పై విరుచుకుని పడటం ఆయనకు కొత్త కాదు. ఆకాశవాణి మన్‌కీ బాత్, బహిరంగ సభల్లో, ఎన్నికల ప్రచార సభల్లో ఆయన ప్రసంగం అంతా పాత పాలకుల నిర్వాకాన్ని ఎండగట్టేందుకే కేంద్రీకరించడం ఆయనకు అలవాటు. అదే బాణీలో బుధవారంనాటి ఆయన ప్రసంగం కాంగ్రెస్ సభ్యుల నిరసనల మధ్య సాగింది. తాను అధి కారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన కార్య క్రమాలూ, వాటి పురోగతీ గురించి వివరించేందుకే ఎక్కువ సమయాన్ని కేటాయిస్తారనుకున్న వారికి నిరాశ మిగిలింది. కాంగ్రెస్ హయాంలో అవినీతి, అనువంశిక పాలన, ఎమర్జెన్సీ అరాచకాలు, రాజ్యాంగ సంస్థలకు స్వతంత్రత లేకపో వడం వంటి పాత ఆరోపణలనే ఆయన మళ్ళీ మరింత ఉచ్చస్వరంతో ఏకరవు పెట్టారు. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం ప్రకారం ఇచ్చిన హామీల అమలుకు, ముఖ్యంగా బడ్జెట్‌లో నికరమైన కేటాయింపుల కోసం తాము చేస్తున్న ఆందోళనపై మోడీ స్పందిస్తారేమోనని ఆశపడిన ఆ ప్రాంత ఎంపీలకు నిరాశ కలిగింది. దేశంలో కొత్త రాష్ట్రా ల ఏర్పాటుకు ఎన్‌డిఏ విధానం, మాజీ ప్రధాని వాజ్‌పేయి హయాంలో మూడు కొత్త రాష్ట్రా ల ఏర్పాటుకు అనుసరించిన విధానం వంటి పాత విషయాలను గుర్తు చేస్తూనే, ఏపీ విభజనబిల్లును ఆమోదం కోసం పూర్వపు ప్రభుత్వం సభ తలుపులు మూయించి అక్రమంగా, అడ్డగోలుగా వ్యవహరించిందంటూ మోడీ చేసిన ఆరోపణ కొత్త కాదు. ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు ఏపీ పర్యటనకు వచ్చినప్పు డల్లా ఈ ఆరోపణ తరచూ చేసే వారు. ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడూ అలాగే చేస్తున్నారు. రాష్ట్రా నికి పార్లమెంటులో జరిగిన అన్యాయాన్ని, పార్లమెంటులోనే తేల్చుకోవాలని ఆయన తమ పార్టీ ఎంపీలకు పిలుపు ఇచ్చారు కూడా. ఆ ప్రకారమే టీడీపీ ఎంపీలు, వైకాపా సభ్యులు గడిచిన రెండు రోజుల నుంచి తెస్తున్న ఒత్తిడిని పురస్కరించుకుని ప్రధానమంత్రి తెలుగు రాష్ట్రాలకు తీపి కబురు ఏమైనా చెబుతారేమోనని ఆయా పార్టీల ఎంపీలే కాకుండా, ప్రజలు కూడా ఆశించారు. అటువంటిది ఏమీ లేకపోవడం నిరాశ కాక మరేమిటి? సాధారణ బడ్జెట్‌లో బెంగళూరు మెట్రో రైలుకు 14 వందల కోట్లను ఆర్థిక మంత్రి జైట్లీ కేటాయించి తాను సమర్పించిన ఆఖరి పూర్తి స్థాయి బడ్జెట్ ఎన్నికల బడ్జెట్ అని రుజువు చేసుకున్నారు. అదే సందర్భంలోతమ రాష్ట్రా లకు ఎంతో కొంత మేలు చేస్తారేమోనని ఆశించిన తెలుగు ప్రజలకు నిరాశ మిగిల్చారు. కనీసం ప్రధానమంత్రి ఇచ్చే సమాధానంలోనైనా ఇలాంటి ప్రకటన ఉంటుందని ఆశించడం తప్పేమీ కాదు. అలా చేయనందుకు తెలుగు ప్రజలు తమపై అసంతృప్తి పెంచుకుంటారేమోనని మోడీ వ్యూహాత్మకంగా తన ప్రసంగం ఫోకస్‌ను విభజన రాజకీయాల వైపు తిప్పారు. ఈ విషయంలో కాంగ్రెస్‌పై ఆయన విమర్శలను ఎవరూ తోసిపుచ్చలేని మాట నిజమే కానీ, అప్పటి అన్యాయాన్ని సరిదిద్దడానికి తమ ప్రభుత్వం తీసుకున్న చర్యల గురించి ఆయన వివరించి ఉంటే బాగుండేది. ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన ఐఐటి వంటి ఉన్నత స్థాయి విద్యా సంస్థలకు సరైన భవనాలు లేవు. నిధులు లేవు. తెలంగాణలో ఇరిగేషన్, విద్యుత్ ప్రాజెక్టుల కోసం ఇస్తామన్న నిధుల ఊసే లేదు. ఆంధ్రప్రదేశ్‌కి ఇంతవరకూ ఇచ్చిన నిధులను సమీక్షించి కొత్తగా ఇవ్వాల్సిన వాటిపై సమీక్షించేందుకు సంబంధిత అధికారులను ఢిల్లీకి పిలిపించారు. తెలంగాణ నాయకులు ఒత్తిడి తెస్తే ,ఆ ప్రాంతం అధికా రులను పిలిపించి సమీక్షిస్తారు. ఇవన్నీ పూర్తయ్యేటప్పటికి గ్రిరున సంవత్సరం తిరిగి పోతుంది. ఇవన్నీ కాలయాపనకేనన్న సంగతి ప్రజలకు తెలుసు. ఉత్తరాది రాష్ట్రా లకూ, ఎన్నికలు జరగనున్న కర్నాటక తదితర రాష్ట్రా లకూ మరిన్ని ఎక్కువ నిధులివ్వడం ఏ ప్ర భుత్వం అధికారంలో ఉన్నా సహజంగా జరిగేదే కావచ్చు. అదే సందర్భంలో తమకు ఇచ్చిన హామీలను అమలు జేయ మని కోరుతున్నామే తప్ప, కొత్తగా నిధులు కేటాయించమని అడగడం లేదన్న తెలుగు ఎంపీల వాదన న్యాయమైనదే కదా! దీనిపై సూటిగా ప్రకటన చేయకుండా, పాత పద్ధతిలోనే ప్రసంగించి ఎన్టీఆర్‌ని పొగిడినంత మాత్రాన ఆంధ్రప్రదేశ్ పౌరులకూ, పీవీ, అంజయ్యలకూ ఎదురైన అవమానాలను గుర్తు చేసినంత మాత్రాన తెలంగాణవాసులకూ, నీలం సంజీవరెడ్డికి జరిగిన అవమానాలను గొలుసుకట్టుగా ప్రస్తావించడం వల్ల రాయలసీమ వాసులకూ కడుపు నిండదు. అప్పటి అన్యాయాలకు బాధ్యత కాంగ్రెస్‌దేనన్న సంగతి ప్రజలకు తెలుసు. అందుకే ఆ పార్టీని ఓడించి కక్ష తీర్చుకున్నారు. ఎమర్జెన్సీ సంఘటనలు, ఢిల్లీలో సిక్కుల ఊచకోత సంఘటనలను మోడీ తన ప్రసంగంలో ప్రస్తావించడం అసంగతమే. పాత విషయాలను తవ్వుకుంటూ పోతే గుజరాత్ అల్లర్ల వంటి సంఘటనలు కూడా చర్వితచరణంగా చెప్పినట్టవుతుంది.

మంచి మాట
అనేక సంఘర్షణలకు నష్టాలకు గురయ్యాక మనుషులు వినమ్రశీలురుగా, వివేకులుగా మారతారు.
● బెంజమిన్ ఫ్రాంక్లిన్

ఒక మోడీ.. రెండు పార్శ్వాలు

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బుధవారం ఉభయ సభల్లో చేసిన సుదీర్ఘ ప్రసంగాలు ఆయనలోని భిన్న పార్శ్వాలకు అద్దం పట్టాయి. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం మీద జరిగిన చర్చకు ముక్తాయింపుగా ప్రధానమంత్రి సమాధానమివ్వడం రాజ్యాంగ రివాజు. అందులో భాగంగానే ఆయన ముందుగా లోక్‌సభలో మాట్లాడారు. తొంభయ్ నిమిషాల పాటు ఆయన ప్రసంగిస్తే అదే తొంభయ్ నిమిషాల పాటు ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ అలనాడు ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని ఎలా దెబ్బతీసిందో వివరిస్తూ..అందుకే ఎన్టీరామారావు రాజకీయ రంగ ప్రవేశం చేశారని ప్రస్తావించడం ద్వారా సభలోని టీడీపీ ఎంపీలతో పాటు అమరావతిలో ఉండి శ్రద్ధగా ఆలకిస్తున్న చంద్రబాబుని కూడా సంతృప్తి పరిచే ప్రయత్నం చేసినట్టుగా అనిపించింది. రాష్ట్రపతి ప్రసంగంలో లేని అనేక అంశాలను కాంగ్రెస్‌కి జోడించి ప్రధాని మోడీ చేసిన ప్రసంగ విన్యాసం ఆయనలోని భావావేశానికి నిదర్శనంగా నిలిచింది తప్ప వేరే ఏరకంగానూ ఎన్డీయే ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నదని కాంగ్రెస్ నేతలు పదేపదే చేస్తున్న విమర్శలను ప్రస్తావిస్తూ..ఆ క్రెడిట్ మీరు తీసుకోండి..అభ్యంతరం లేదంటూ వారిని చల్లబరిచే ప్రయత్నం చేశారు. అంతేకాదు. అంతా ఏకపక్షంగా విమర్శల దాడికి బదులు కాంగ్రెస్ సభ్యులను ఒప్పించే ప్రయత్నంగా సావధానపు వివరణలు ఇవ్వడానికి ప్రయత్నించారు. కాంగ్రెస్ ముక్త భారత్ అన్న నినాదాన్ని బీజేపీ సృష్టించలేదని, స్వాతంత్ర్యం వచ్చాక ఇక కాంగ్రెస్ పార్టీ అవసరమే లేదని నట్టు అర్థమవుతున్నది. ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ నుంచి అటు సోనియాగాంధీ, ఇటు రాహుల్‌గాంధీ సభలో ఉన్నందున తన విమర్శల దాడి నేరుగా వారిని తాకాలన్న ఉద్దేశంతోనే ఆయన శూలాల్లాంటి ఆరోపణలు సంధించారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దానికితోడు లోక్‌సభలో తమతో కలిసిరాని ఇతర ప్రతిపక్షాలు కూడా నినాదాల హోరెత్తిస్తున్నందున దాని ప్రభావం కూడా మోడీ ప్రసంగంలో ప్రస్ఫుటించి ఉండవచ్చన్నది మరో అభిప్రాయం. అదే రాజ్యసభలో


లోక్‌సభలో ...

రాష్ట్రపతి ప్రసంగంలో లేని అనేక అంశాలను కాంగ్రెస్‌కి జోడించి ప్రధాని మోడీ చేసిన ప్రసంగ విన్యాసం ఆయనలోని భావావేశానికి నిదర్శనంగా నిలిచింది తప్ప వేరే ఏరకంగానూ సంతృప్తిపరచలేదన్నది విశ్లేషకుల మనోగతంగా ఉన్నది. వల్లభాయ్ పటేల్‌ని ప్రధానమంత్రిని చేసుంటే కాశ్మీర్ కాష్టం ఈరోజు ఇలా ఉండేది కాదన్న తమ పార్టీ సిద్ధాంతాన్ని మరోసారి చట్టసభ ద్వారా చెప్పుకుని..2019 ఎన్నికలకు ఇప్పుడే శంఖారావం పూరించారన్న వ్యాఖ్యలకు అవకాశం ఇచ్చారు. ప్రధాని ప్రసంగం రాజకీయ ప్రసంగంగా సాగిందన్న అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి.


రాజ్యసభలో ...

ఆయనకు అడుగడుగునా తీవ్రస్థాయిలో అడ్డుతగులుతూ నినాదాలతో హోరెత్తించింది. తొలుత తెలుగుదేశం, వైకాపా ఎంపీలు జత చేరినా, ఆ వెంటనే తెలుగుదేశం సభ్యులు తమ సీట్లలోకెళ్లి కూచుని ప్రధాని ప్రసంగాన్ని ఆలకించారు. వైకాపా ఎంపీలు మాత్రం బాయ్‌కాట్ చేసి బైటికెళ్లి ప్లకార్డులతో నిరసన తెలిపారు. తమ పార్టీమీద మోడీ దాడి తీవ్రమవుతున్న కొద్దీ కాంగ్రెస్ సభ్యుల్లో అసహనం పెరిగిపోసాగింది.

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రసంగిస్తారని లోక్‌సభ స్పీకర్ ప్రకటించగానే ప్రధాని ప్రసంగం ఈ గొడవలో ఎలా సాగుతుందా అన్న అనుమానాలు కలిగాయి. మోడీ మాత్రం తడుముకోకుండా మంద్రస్థాయిలో మొదలుపెట్టి కొద్ది నిమిషాల్లోనే ప్రతిపక్షాల గొంతుల కన్నా అధిక గొంతుతో విరుచుకుపడటం ప్రారంభించారు. ఆది నుంచి చివరిదాకా ఆయన కాంగ్రెస్ లక్ష్యంగా దాడి చేశారు. తెలుగుదేశం పార్టీ చేస్తున్న డిమాండ్లకు సమాధానం చెబుతారేమోనని అందరూ ఆబగా ఎదురుచూస్తే..ప్రధాని మోడీ తెలివిగా ఆంధ్రుల సెంటిమెంట్‌ని తనకనుకూలంగా మలుచుకున్నారు. కాంగ్రెస్ సంతృప్తిపరచలేదన్నది విశ్లేషకుల మనోగతంగా ఉన్నది. వల్లభాయ్ పటేల్‌ని ప్రధానమంత్రిని చేసుంటే కాశ్మీర్ కాష్టం ఈరోజు ఇలా ఉండేది కాదన్న తమ పార్టీ సిద్ధాంతాన్ని మరోసారి చట్టసభ ద్వారా చెప్పుకుని..2019 ఎన్నికలకు ఇప్పుడే శంఖారావం పూరించారన్న వ్యాఖ్యలకు అవకాశం ఇచ్చారు. ప్రధాని ప్రసంగం రాజకీయ ప్రసంగంగా సాగిందన్న అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి. ఆతర్వాత రాజ్యసభలో మాట్లాడిన ప్రధాని ఆ వీరావేశం లేకుండా..అతి తక్కువ హావభావాలతో..పొదుపైన ఆహార్యంతో మాట్లాడటం ద్వారా తనలోని మరో పార్శ్వాన్ని ప్రదర్శించే ప్రయత్నం చేశారు. తొలి ప్రసంగంలో సర్వసైన్యాధ్యక్షుడి మాదిరి చెలరేగిన ప్రధాని మోడీ రెండో ప్రసంగంలో మాత్రం తనలో సాత్విక మోడీ ఉన్నారని చెప్పుకునే ప్రయత్నం చేసినట్టుంది. దాంతోపాటు లోక్‌సభలో కాంగ్రెస్ మీద తాను చేసిన దాడి ప్రభావాన్ని చల్లబరిచే ప్రయత్నం చేశారు. కాంగ్రెస్ పార్టీ అస్సలు ఏమీ చేయలేదని తాను అనడం లేదని ఒక దశలో అన్నారు. అంతేకాదు. తమ పథకాల పేర్లు మార్చి తమ పథకాలుగా ఆనాడు మహాత్మా గాంధీయే అన్నారని గుర్తు చేసి తనలోని వివరణాత్మక శక్తిని చాటుకున్నారు. స్వాతంత్ర్యం తర్వాత గాంధీ కొత్త ఇండియాను కోరుకుంటే..కాంగ్రెస్ మాత్రం ఎమర్జెన్సీ సహిత భారత్‌ని, బోఫోర్స్ భారత్‌ని, హెలికాప్టర్ కుంభకోణాల భారత్‌ని కోరుకుంటున్నదని, తాము మాత్రం గాంధీ కోరుకున్న భారత్‌ని అభిలసిస్తున్నామని తనలోని భావనాపటిమను ప్రదర్శించి అధికార పక్షం చేత చప్పట్లు కొట్టించారు. అలాగే ట్రిపుల్ తలాక్, రాఫెల్ ఒప్పందం తదితర అంశాలను ప్రస్తావించినా..వాటిమీద వివరణాత్మక సమాచారంతో కాంగ్రెస్‌ని సమాధానపరిచే ప్రయత్నం చేశారు. లోక్‌సభలో చేసిన ప్రసంగం సందర్భంగా పదునైన వ్యంగ్యాస్త్రాలతో విమర్శల దాడికి పూనుకున్న ప్రధాని మోడీ రాజ్యసభలో మాత్రం నవ్వుల పువ్వులు పూయించే విధంగా చతురోక్తులు విసురుతూ సభను తేలిక పరుస్తూ ప్రసంగించారు. లోక్‌సభలో కనిపించిన ఆహార్యమే రాజ్యసభలోనూ కనిపించినా..అదనంగా భుజాన శాలువా వేసుకుని రావడం ద్వారా పెద్దల సభలో పెద్దరికం ప్రదర్శించి రాజకీయ పార్టీల ప్రభావం కన్నా పెద్దల సభ అన్న భావనే ఆయన చేత సౌమ్యంగా మాట్లాడించి ఉండవచ్చు అని అనుకోవడానికి ఎవ్వరికీ ఎలాంటి అభ్యంతరం ఉండకపోవచ్చు. మొత్తం మీద ప్రధాని మోడీ రాబోయే సార్వత్రిక ఎన్నికల కోసం తన ప్రసంగ పాటవానికి ఉభయ సభల్లో ప్రసంగాల ద్వారా పదును పెట్టుకున్నట్టయింది. తనలోని రెండు పార్శ్వాలను అన్యాపదేశంగా కాక..ఉద్దేశపూర్వకంగానే ప్రదర్శించుకున్నట్టయింది. అంతేకాదు. ఒకే దెబ్బకు రెండు పిట్టలన్నట్టు..తెలుగుదేశం ఎంపీలంతా మూకుమ్మడిగా తమ సీట్లలో కూచుని తన ప్రసంగాన్ని శ్రద్ధగా వినేలా చేయడం ద్వారా నరేంద్ర మోడీలోని రాజకీయ వ్యూహకర్తని..ఎన్టీరామారావు ప్రస్తావనను, తెలుగు నేతలకు కలిగిన అవమానాలను గుర్తుచేయడం ద్వారా తనలోని సమయానుకూల రాజకీయ నేతను భారతదేశ ప్రధానమంత్రి యావద్దేశానికి మరోమారు పరిచయం చేసినట్టయింది.!

❑ వయ్యస్సారెస్

మోడీకేర్.. కొత్త అధ్యాయం

కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ గత గురువారం పార్లమెంటులో ప్రవేశపెట్టిన సాధారణ బడ్జెట్‌లో అతి పెద్ద ఆరోగ్య పరిరక్షణ కార్యక్రమాన్ని వేల కోట్ల రూపాయిల ఖర్చుతో అమలు చేయనున్నట్టు ప్రకటించారు. అంతేకాదు. ఇలాంటి కార్యక్రమం ప్రపంచంలోనే ఎక్కడా లేదని అన్నారు. ఈ కార్యక్రమానికి మోడీ కేర్ అని నామకరణం చేశారు. అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ రెండవ సారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఒబామా కేర్ అనే ఆరోగ్య పరిరక్షణ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారు. ఇప్పుడు దానిని ప్రస్తుత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రద్దు చేయాలని అనుకుంటున్నారు. అది వారి దేశానికి సంబంధించిన విషయం. జైట్లీ ప్రకటననే తీసుకుంటే ఇది ప్రపంచంలోనే తొలి కార్యక్రమం అనడం అతిశయోక్తి అవుతుంది.


అంతర్జాతీయంగా యూరోపియన్ దేశాలు 1920వ దశకంలోనే ఇలాంటి కార్యక్రమాలను అమలు జేశాయి. యూరప్ దక్షిణ ప్రాంతంలోని దేశాలు 1960వ దశకంలోనే ఇలాంటి పథకాలను ప్రవేశపెట్టాయి. జర్మనీలో ప్రైవేటు ట్రస్టులు నిర్వహించే ఆరోగ్య పరిరక్షణ కార్యక్రమాలకు తోడ్పాటుగా ప్రభుత్వం నిధులు అందజేస్తోంది. అందువల్ల విదేశాల్లో ఇలాంటి కార్యక్రమాల్లో విజయవంతం అయినవీ ఉన్నాయి. అయితే, ప్రధానంగా అక్రమాలు, అవినీతికి తావు లేకుండా ఇలాంటి కార్యక్రమాలను దేశవ్యాప్తంగా, భారీ స్థాయిలో అమలు జేయడం నిజంగా ఒక సవాలే. ఆరోగ్య పరిరక్షణ కార్యక్రమానికి సంబంధించి అన్ని కోణాలను పరిశీలించడంలో తప్పులేదు. అంతమాత్రాన నిరాశాజనకంగా మాట్లాడినట్టు కాదు.

దేశవ్యాప్తంగా పది కోట్ల నిరుపేద కుటుంబాలకు వైద్య, ఆరోగ్య సౌకర్యాలను కల్పించేందుకు ఉద్దేశించిన మోడీ కేర్ కార్యక్రమం ఎంతో ఆదర్శప్రాయమైనదనడంలో సందేహం లేదు. అయితే, పథకాలు కాగితాల మీద చూస్తే ఎప్పుడూ ఆదర్శప్రాయంగానే కనిపిస్తాయి. క్షేత్రస్థాయిలో అమలు తుచ తప్పకుండా అమలు జేసేటప్పుడే సమస్యలు ఎదురవుతాయి. భారత దేశంలో ఆరోగ్య పరిరక్షణ కార్యక్రమం పూర్తిగా విఫలమైంది. ఆస్పత్రుల్లో మందులుంటే, డాక్టర్లు ఉండరు, డాక్టర్లుంటే మందులుండవు. ఆస్పత్రులలో పారిశుధ్యం సంగతి సరేసరి. దాంతో వైద్య సౌకర్యాల కోసం రోగులు కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్ళక తప్పడం లేదు. అక్కడ ఖర్చులు చూస్తే, ఎవరైనా కళ్ళు తిరిగి పడిపోవల్సిందే. భారతదేశంలో ఆరోగ్య పరిరక్షణకు అయ్యే ఖర్చు తలకు మించిన భారంగా తయారైందని ప్రపంచ బ్యాంకు 2014లోనే ప్రకటించింది. ప్రపంచ దేశాల్లో సగటు ఖర్చు కన్నా 18 శాతం ఎక్కువ. మన దేశంలో కూడా ఇలాంటి కార్యక్రమాలు గతంలో లేకపోలేదు. 2005లో ఆనాటి యూపీఏ ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ అనే కార్యక్రమాన్ని ప్రారంభించి వేల కోట్ల రూపాయిలు కేటాయించింది. ఈ నిధుల్లో మూడు వంతులు పైగా రాజకీయ నాయకుల జేబుల్లోకి వెళ్ళాయి. ఉత్తరప్రదేశ్‌లో మాయావతి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఈ కార్యక్రమం అమలులో వేల కోట్ల కుంభకోణం జరిగింది. దీనిపై దర్యాప్తు జరిపిన సీబీఐ మాయావతినీ, ఆమె మంత్రివర్గ సహచరుడు బాబూ సింగ్ కుష్వానీ ప్రశ్నించింది. కుష్వా ఎన్నికల ముందు బీఎస్‌పి నుంచి ఫ్లేటు ఫిరాయిస్తే, ఎన్నికల ముందు ఆయనకు కమలనాథులు కాషాయ కండువా కప్పారు. అంటే ఈ పథకంలో అవినీతికి తావుందనే విషయం బీజేపీ పెద్దలకు తెలియంది కాదు. లొసుగులు, లోపాలకూ, అక్రమాలకు తావు లేకుండా దీనిని అమలు జేస్తే మోడీ కేర్ దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. పేదలే కాకుండా, సామాన్యుల వైద్యం ఖర్చులు నానాటికీ పెరిగిపోతున్నాయి. ముఖ్యంగా, మధ్యతరగతి వర్గాలకు తిండి ఖర్చు కన్నా, వైద్యం ఖర్చు ఎక్కువ అవుతోంది. ఈ పథకం వల్ల మధ్యతరగతికి ఒరిగేది ఏమీ లేదు.

ఈ పథకం కింద నిరుపేద కుటుంబాలకు ఏడాదికి ఐదు లక్షల రూపాయిల మేరకు వైద్యం ఖర్చుల కింద అందజేస్తారు. స్విట్జర్లాండ్‌లో ప్రైవేటు సంస్థలు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. వైద్య విధానం జనానికి అందుబాటులో ఉండేట్టు చూడటమే ఈ కార్యక్రమం ముఖ్యోద్దేశ్యం. 2005లో యూపీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్యక్రమం కింద ఏటా కుటుంబానికి 30 వేల రూపాయిల మేర వైద్య ఖర్చులను అందజేసే వారు. ఇవి ఏమూలకు? కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్తే, వేలు కాదు, లక్షల్లో బిల్లులు అవుతున్నాయి. ప్రాణాలను నిలబెట్టుకోవాలంటే, ఎంత ఖర్చయినా వెనకాడకుండా ఆస్పత్రులకు వెళ్ళడం పేద, ధనిక తేడా లేకుండా అన్ని వర్గాల్లోనూ ఉంది. అందువల్ల బిల్లుల రీయింబర్స్‌మెంట్ అనేది ఒక ప్రహసనం. కార్పొరేట్ ఆస్పత్రులకు ఇలాంటి ఆరోగ్య బీమా పథకాలు కామధేనువులుగా ఉన్నాయన్నది లోకవిదితం. పూర్వపు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరోగ్య పథకం ఘోరంగా విఫలమైందని సౌమిత్రి ఘోష్, నవనీత దత్తాలతో కూడిన కమిటీ తేల్చి చెప్పింది. ఈ పథకం అప్పట్లో కుటుంబంలో 12.7 శాతం మందికి మాత్రమే వర్తిస్తుందనీ, దీనివల్ల ఏమి ఉపయోగమని కూడా పేర్కొంది. ఇలాంటి పథకాలను అమలు జేసేటప్పుడు క్షేత్ర స్థాయిలో నిరంతర పర్యవేణ ఉండాలి. రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజన పథకం విఫలమైంది. అదే మాదిరిగా ఈ కొత్త కార్యక్రమం విఫలం కారాదన్నదే అధిక సంఖ్యాకుల అభిప్రాయం. ఈ కొత్త కార్యక్రమం కింద కొత్తగా ఆస్పత్రులు తెరుస్తామనీ, డాక్టర్లను నియమిస్తామన్న మంత్రి జైట్లీ మాటలు నమ్మేట్టుగా లేవు. ఎందుకంటే, దేశంలో ప్రస్తుతం అనేక మెడికల్ కాలేజీలు ఉన్నాయి. వీటిల్లో అనుమతులు, తగిన వసతులు లేకుండా పనిచేస్తున్నవి ఎన్నో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఫాతిమా మెడికల్ కాలేజీ వ్యవహారం ఇటీవల తీవ్రమైన చర్చనీయాంశం అయింది. కొత్త మెడికల్ కాలేజీలకు విద్యార్థులనూ, వైద్యులనూ సమీకరించేందుకు ఎన్ని సంవత్సరాలు పడుతుందో వేరే చెప్పనవసరం లేదు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి ఢిల్లీలో ఆలిండియా మెడికల్ ఇనిస్టిట్యూట్ (ఎయిమ్స్) వరకూ వైద్య కళాశాలలు, ఆస్పత్రుల వరకూ ఉన్న వ్యవస్థను లొసుగులు లేకుండా ప్రభుత్వాలు మెరుగు పర్చగలిగితే కొత్త కార్యక్రమాలు అవసరం లేదు. ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటే ముందుగా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి. ఆరోగ్య బీమా పథకాలకు సంబంధించి ప్రతి రాష్ట్రంలోనూ ప్రస్తుతం అమలులో ఉన్నాయి. తమ ప్రియతమ నాయకులు, నాయకురాళ్ళ పేర్లతో వాటిని ప్రభుత్వాలు అమలు జేస్తున్నాయి. వీటి పనితీరుపై సరైన సమీక్షలేకపోవడంతో తరచూ ఆరోపణలు వస్తున్నాయి. ఎప్పటికప్పుడు కొత్త పథకా లనూ, కార్యక్రమాలనూ ప్రకటించడం జనాన్ని మభ్య పెట్టడమే. ఆరోగ్య బీమా పథకాలకూ, పబ్లిక్ ట్రస్టులకూ మధ్య పోటీ పెడితే అదో రకంగా మేలు చేసే అవకాశ ఉంది. లొసుగులు, లోపాలు లేకుండా నిరంతర పర్యవేక్షణతో అమలు జేస్తే ఆరోగ్య పరిరక్షణ పథకాలు మంచివే. మోడీ కేర్ కార్యక్రమం మెడికేర్ లో కొత్త అధ్యాయాన్ని సృష్టిస్తుందని ఆశిద్దాం.


❑ ఎ.పి.స్వామి

చరిత్రలో ఈ రోజు




1672: ఐజాక్ న్యూటన్ కాంతిశాస్త్రంలో తొలి అధ్యయనాన్ని రాయల్ సొసైటీ, లండన్‌కు సమర్పించారు. ఇదే ఏడాది జనవరిలోనే ఆయన రాయల్ సొసైటీ సభ్యునిగా ఎంపికయ్యారు. ఆయన రూపొందించిన టెలిస్కోప్‌కు గుర్తింపునిచ్చారు. అప్పటికే కొన్నేళ్ళుగా అంటే 1665నుంచే న్యూటన్ కాంతి శాస్త్రంలో పరిశోధన చేస్తున్నారు. కాంతి..రంగులు అనే అంశంపై తన సిద్ధాంతాన్ని 1672లో రూపొందించారు. 1704లో దీనిని విస్తృతంగా మార్చారు.

1883: ఫౌంటెన్ పెన్ ఆవిష్కరణకు మూలమైన ప్రయోగాలను లూయిస్ వాటర్‌మన్ ప్రారంభించారు.



1898: వర్సెస్టర్‌కు చెందిన జాన్ అమెస్ షెమన్ రూపొందించిన ఎన్వెలప్ ఫోల్డింగ్ అండ్ గమ్మింగ్ మిషన్‌కు పేటెంట్ లభించింది. షెమన్ చేసిన ఆవిష్కరణ ఎన్వెలప్ తయారీ ఖర్చును తగ్గించింది. వెయ్యి ఎన్వెలప్‌ల తయారీకి అప్పటి వరకూ 60సెంట్లు అయ్యేది. షెమన్ కృషి ఈ ఖర్చును 8సెంట్లకు తగ్గించింది.



1974: స్కైలాబ్ స్పేస్ స్టేషన్ నుంచి తమ పనిని ముగించుకుని మూడో వ్యోమగాముల బృందం భూమికి తిరిగొచ్చింది. స్కైలాబ్‌ను 1973 నవంబర్ 16న ప్రయోగించారు. అది మొత్తం 2వేల 476 సార్లు భూమి చుట్టూ తిరిగింది. మొత్తం 171రోజులు అంతరిక్షంలో ఉంది. వ్యోమగాముల బృందాలు 2వేల గంటల పాటు శాస్త్రీయ, వైద్య ప్రయోగాలను నిర్వహించాయి. స్కైలాబ్ 1979 జులై 11న భూ వాతావరణంలోకి ప్రవేశించి, అదృశ్యమైంది.



రైల్వే నిధులు ఓ నిరాశ!

నరేంద్రమోడీ నేతృత్వంలో ఎన్‌డిఏ ప్రభుత్వం ఏర్పడ్డాక అప్పటి కేంద్ర రైల్వే మంత్రి సురేశ్ ప్రభు కీలక ప్రాజెక్టులకు మాత్రం నిధులిచ్చారు. సాధారణ బడ్జెట్‌లో ఈసారి రైల్వే శాఖకు కేటాయింపులు సంతృప్తికరంగా లేవు. దక్షిణ మధ్య రైల్వేకి 5,752 కోట్లు కేటాయించారు. వీటిలో తెలంగాణకి 1,813 కోట్లు, ఏపీకి 3,670 కోట్లు కేటాయించారు. కొత్త మార్గాల నిర్మాణానికి 1,757 కోట్లు కేటాయించారు. ప్రయాణీకుల మౌలిక వసతులకు నిధుల పెరుగుదల 77 శాతం ఉంది. మార్గాల పునరుద్ధరణ పనులకు 2018-19 ఆర్థిక సంవత్సరంలో 800 కోట్లు ఇచ్చారు. వామపక్ష ఉగ్రవాదుల ప్రాబల్యం కలిగిన ప్రాంతాలలో ఐదు కొత్త మార్గాలను కేంద్రానికి ఏపీ ప్రతిపాదించింది. వీటిలో ఒక్కటీ మంజూరు కాలేదు. తెలంగాణలో కొత్త మార్గాలు లేవు. ఉన్నవాటికే ప్రాధాన్యం ఇచ్చారు. కాజీ పేట వర్క్ షాపునకు 200 కోట్లు ఇచ్చారు. కొత్త మార్గాల సర్వేకు ఆమోదం తెలిపారు. చర్లపల్లి టెర్మినల్‌కు ఐదు కోట్లు మాత్రమే చూపారు. కొత్త రైళ్ళ ప్రకటన లేకపోగా నిధులు విడుదలలోనూ అన్యాయమే ఎదురైంది. ఏలూరు స్టేషన్‌లో లిఫ్ట్ సౌకర్యం గత బడ్జెట్‌లో ప్రతిపాదించినా పనులు ప్రారంభం కాలేదు. ఏపికి ప్రత్యేక రైల్వే జోన్‌ను విభజన చట్టంలో పొందుపరిచారు. ఈ విషయంలో రాష్ట్రానికి మొండి చేయి చూపింది. ఈసారైనా ప్రధాని నరేంద్రమోడీ ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేయాలని కోరినా ఫలితం లేకపోయింది. రైల్వే లైన్లను పెంచాలన్న డిమాండ్ నెరవేరలేదు. ఎప్పటిమాదిరిగానే సగటు రైల్వే ప్రయాణీకుడు డిమాండ్ ఉన్న ప్రాంతాలకు రైళ్ళను నడపాలని కోరుతున్నారు. ప్రధానంగా తిరుపతి, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నగరాలకు రైళ్ళ సంఖ్యను పెంచాలంటున్నారు. రాత్రిపూట రైళ్ళతోపాటు, పగటిపూట అందరికీ సౌకర్యంగా ఉండే విధంగా రైళ్ళను వేయాలంటున్నారు. ప్రధాన రైల్వే స్టేషన్లలో సౌకర్యాలను మెరుగుపరచాల్సి ఉంది. కోటిపల్లి నుంచి నరసాపురానికి లైన్‌ను పొడిగించాల్సి ఉంది. దీనికి 2000 - 01 బడ్జెట్‌లో రూ.700 కోట్లు చూపారు. సర్వే , భూసేకరణ అన్నీ పూర్తయినా దాదాపుగా తొమ్మిదేళ్ళపాటు నిధులివ్వ లేదు. ఈ పనులు పెండింగ్‌లో పడ్డాయి. కేంద్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక అప్పటి రైల్వే మంత్రి సురేష్ ప్రభు 2017- 18 బడ్జెట్‌లో ఏకంగా రూ.450 కోట్లు కేటాయించారు. దీనికి సంబంధించిన క్షేత్రస్థాయి పనులు ప్రారంభించారు. ఇప్పటికే ఈ పనులకు సంబంధించిన వంతెనలకు టెండర్లు కూడా పిలిచారు. బడ్జెట్ 2018- 19లో కోటిపల్లి-నరసాపురానికి 200 కోట్లు కేటాయించారు. అంటే గత ఏడాది కన్నా 250 కోట్లు తక్కువన్న మాట. ఈసారి బడ్జెట్‌లో జిల్లా రైల్వే లైన్లపై ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో రైల్వే బడ్జెట్ ప్రవేశపెట్టిన ప్రతిసారి వినిపించే మాట నరసాపురం కోటిపల్లి రైల్వే లైన్. దీనిని 1925లో ప్రతిపాదించారు. అప్పటినుంచి అది కాగితాలకే పరిమితమైంది. తర్వాత క్రమంలో కాకినాడ నుంచి కోటిపల్లి వరకూ రైల్వేలైన్‌ను ప్రతిపాదించి సుమారు రూ.54 కోట్లతో పూర్తి చేశారు. 1965లో కొవ్వూరు భద్రాచలం రైల్వే లైన్‌ను ప్రతిపాదించారు. పశ్చిమ ఏజెన్సీలతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని పలు పల్లెలకు రైలుమార్గం ఏర్పడనుంది. 2010 - 11లో రూ.965 కోట్లు కేటాయించి దీనిని అప్పటి ఉమ్మడి రాష్ట్రం 50 శాతం భరించాలని ప్రతిపాదించింది. తర్వాత సంవత్సరాల్లో పెద్దగా ఈ లైన్‌కు కేటాయింపు లేదు.

2016- 17లో మాత్రం రూ.5 కోట్లు ఇచ్చారు. గత బడ్జెట్ 2017- 18లో రూ.122 కోట్లిచ్చారు. తిరిగి ఈ బడ్జెట్‌లో నిధుల కేటాయింపు మరిచిపోకుండా చేస్తే దీనిద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో పనులు పూర్తవుతాయనే ఆశతో ప్రజలు ఉన్నా ఫలితం లేకపోయింది. మచిలీపట్నం - గుడివాడ - భీమవరం - నరసాపురం - నిడదవోలు రైల్వే లైన్ పనులు ఏళ్ళతరబడి పెండింగ్‌లో ఉన్నాయి. అటువంటి పనులకు గడిచిన మూడు బడ్జెట్‌లలో కూడా ఆశాజనక కేటాయింపులు జరిగాయి. పనులు కూడా వేగవంతంగా పూర్తి చేయడం ద్వారా డబ్లింగ్ పనులు పూర్తయి లైన్ అందుబాటులోకి వస్తుందని అంతా ఆశిస్తున్నారు. ప్రారంభంలో పూర్తి చేయడం ద్వారా డబ్లింగ్ పనులు పూర్తయి లైన్ అందుబాటులోకి వస్తుందని భావిస్తున్నారు. ప్రారంభంలో పనులు నడిచిన విధంగా తర్వాత కాలంలో సాగకపోవడం పట్ల వచ్చిన నిధులను వినియోగించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

❑ కీర్తి నాగరాజు, 9652404611

ప్రసంగాలు వద్దు..... ఏం చేశారో చెప్పండి

- అడిగింది చెప్పకుండా ఆరోపణలా!
- ప్రధానికి రాహుల్ సూటి ప్రశ్న

న్యూఢిల్లీ: రాఫెల్ ఒప్పందం, రైతుల దుస్థితి,ఉద్యోగాల్లు డిమాండ్ల వం టి అంశాలపై తాము అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా, పార్లమెంటులో ఆరోపణలు చేయ డం ప్రధాని హోదాలో ఉన్న నాయకునికి తగదని నరేంద్రమోడీపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ విమర్శ గుప్పించారు.తమ పార్టీ ప్రస్తావించిన ఈ మూడు ప్రశ్నలు ప్రజలు అడు గుతున్నవేనని, వీటికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రధానమంత్రిపై ఉందని ఆయన అన్నారు. ప్రజలు అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా, ప్రజలే ప్రధాని ప్రశ్నలను సంధిస్తున్నారని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీపై మోడీ బహిరంగ సభల్లో ఎంత తీవ్రంగానైనా విమర్శించవచ్చని, కానీ, ఇందుకు పార్లమెంటును వేదిక చేసుకోవడం మాత్రం సమంజసం కాదని రాహుల్ స్పష్టం చేశారు. పార్లమెంటు ఉన్నది ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పడా నికనని,ప్రతిపక్షాలను విమర్శించడంకోసం కాదని మోడీ గ్రహించాలని రాహుల్ అన్నారు.

ప్రజా సమస్యలను పట్టించుకోని ప్రధాని : కాంగ్రెస్

న్యూఢిల్లీ: రాష్ట్రపతిప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రధానమంత్రి నరేంద్రమోడీ చేసిన ప్రసంగం నిరుత్సాహ పర్చిందనీ, ప్రజా సమస్యల గురించి ప్ర స్తావన లేకుండా,రాజకీయ ప్రసంగంలా, ఎన్నికల ప్రసంగంలా సాగిందని లోక్‌సభలో కాంగ్రెస్ నాయకుడు మల్లికార్జున్ ఖర్గే విమర్శించారు.

మాది లక్ష్యాలు ఛేదించే ప్రభుత్వం



- రాజ్యసభలో ప్రధాని మోడీ సమాధానం
- రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం
- కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తిడుతూ, దేశాన్ని కూడా విమర్శిస్తోంది
- స్వచ్ఛ భారత్ ప్రచార ఖర్చు ఎందుకంటున్న కాంగ్రెస్
- తమ కుటుంబ నేతల జన్మదిన ప్రకటనలకు వేలకోట్లు ఖర్చు చేస్తోందన్న ప్రధాని
- జమిలి ఎన్నికలతో ప్రజాధనం వృథా తగ్గుతుంది
- రేణుకాచౌదరిపై సెటైర్ వేసిన ప్రధాని
- వీగిన వైసీపీ ఎంపీ విజయసాయి సవరణలు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : తమది లక్ష్యాలను ఛేదించేప్రభుత్వమనిప్రధానమంత్రినరేంద్రమోడీ అన్నారు. తమది నేమ్ ఛేంజర్ ప్రభుత్వం కా దని, ఎయిమ్ ఛేజర్ ప్రభుత్వమని తెలిపారు. బుధవారం రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధ న్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రభుత్వం తర పునసమాధానమిచ్చారు. ట్రిపుల్ తలాక్ బిల్లును అడ్డుకుంటుంకాంగ్రెస్ పార్టీ ముస్లిం మహిళలకు అన్యాయం చేస్తోందన్నారు. రెండు వివాహాలు చేసుకున్న హిందూ వ్యక్తి జైలుకు పంపిచేచట్టం ఉండగా, ట్రిపుల్ తలాక్ చెప్పే ముస్లిం వ్యక్తిని జైలుకు పంపించేందుకు సమస్యగా మారిందని ప్రశ్నించారు. అధికారంలో ఉన్న సమయంలో కాంగ్రెస్ పార్టీ ట్రిపుల్ తలాక్ బిల్లు ఎందుకు తీసుకురాలేకపోయిందన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల్లో కాంగ్రెస్ పార్టీ మునిగితేలిందని విమర్శించారు. ఆధార్‌ను తామే తీసుకొచ్చామని కాంగ్రెస్ పార్టీ పదేపదే చెప్తోంది. కానీ, 1998లో రాజ్యసభలో జరిగిన చర్చలో ఎల్‌కే అద్వానీ ఈ విషయం గురించి చెప్పారని వివరించారు. ఆధార్ మూలాలు అద్వానీ ప్రసంగంలో ఉన్నా యన్నది గుర్తించాలని చెప్పారు.

కాంగ్రెస్ పార్టీ స్వచ్ఛ భారత్, మేకిన్ ఇండియా, సర్జికల్ స్ట్రైక్స్, యోగా డే ఇలా ప్రతి పథకాన్ని విమర్శించడమే పనిగా పెట్టుకుందన్నారు. దేశంలో జరిగే మంచి కూడా వారికి చెడులా కనిపి స్తోందన్నారు. ఓబీసీ కమిషన్ రాజ్యాంగ హోదా కల్పించే బిల్లుకు ఎందుకు అడ్డుకుం టోందని ప్రశ్నించారు. ఓబీసీల ఆకాంక్షలు కాంగ్రెస్‌కు పట్టవా అని అడిగారు. బీజేపీని, మోడీని విమర్శించడమే పనిగా పెట్టుకుని దేశాన్ని సైతం తిడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో రైల్వేబడ్జెట్ పేరుతో భారీ ఎత్తున రైళ్లు, లైన్లు ప్రకటించేదనీ పరిమితమయ్యారని అన్నారు. పత్రికల్లో హెడ్‌లైన్లు, సన్మానాలకు పరిమితమైనా ఆ తర్వాత వాటన్నింటిని అటకె క్కించారని విమర్శించారు. కానీ తమ ప్రభుత్వం రైల్వేలోనిపెండింగ్ పనులన్నింటినిత్వరితగతిన పూర్తిచేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది కనుక తాము చేయమనే ధోరణితో వ్యవహరించడం లేదని అన్నారు. దేశప్రగతి కోసమే తాము పెండింగ్ పనులు పూర్తిచేస్తున్నామన్నారు. ప్రగతి అనే కొత్త కార్యాచరణ ద్వారా దేశంలో ఆగిపోయిన భారీ ప్రాజెక్టులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నానని అన్నారు. కేంద్రప్రభుత్వ కార్యదర్శులు, రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులతో ఆన్‌లైన్‌లో మాట్లాడి ప్రతిబంధకాలు తొలగించి పనులు వేగవంతం చేశామని అన్నారు. దీని వల్ల అనేక పనులు పూర్త య్యాయని చెప్పారు. రైతుల ఆదాయాన్ని రెండింతలు చేసేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. వెదురు, తేనేటీగల పెంపకం లాంటి వ్యవసాయ అనుబంధ రంగాలను ప్రోత్స హించి వారికి మరింత ఆదాయాన్ని ఇచ్చే కార్య క్రమం చేస్తున్నామన్నారు. రైతులకు మద్దతు ధరను ఒకటిన్నర రెట్లు పెంచిన విషయాన్ని తెలిపారు. సైనికులకు వన్ ర్యాంక్ వన్ పెన్షన్‌పై కాంగ్రెస్ పార్టీ తప్పుదోవ పట్టిస్తోందని అన్నారు.

స్వచ్ఛ భారత్ ప్రచార ఖర్చు ఎందుకని కాంగ్రెస్ అడగడంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. మరుగుదొడ్ల ఉపయోగం, స్వచ్ఛత అనేది మనిషి ప్రవర్తనలో మార్పు ద్వారా వస్తుందని తెలిపారు. ఆ ప్రవర్తనను మార్చేందుకుపెద్దఎత్తునప్రచారంపై ఖర్చు చేస్తూ చైతన్యం తీసుకువస్తున్నామని చెప్పారు.కాంగ్రెస్ కుటుంబ పరివారం జన్మ దినాలపేరిట కోట్ల రూపాయల ప్రకటనలను పత్రికల్లో ప్రకటనల కోసం ఖర్చు చేసి ప్రజాధనాన్ని వృథా చేశా న్నారు. ఒక్క కుటుంబం కోసం దేశ ప్రయోజనాలను తాకట్టుపెట్టారని అన్నారు. బోఫోర్స్ కుంభకోణం గురించి ప్రస్తావించిన ప్రధాని మోడీ, కాంగ్రెస్ సీనియర్ నేత నాటి రాష్ట్రపతి ఆర్.వెంకట్రామన్ ఆత్మకథలో పలు పేరాలను ఉటంకించారు. కాంగ్రెస్ పార్టీ చందాలు ఆయుధాల డీలర్ల నుంచి వచ్చేవని పుస్తకంలో రాసిన విషయాన్ని తెలిపారు.

దేశంలో ఒకేసారి లోక్‌సభ, అసెంబ్లీ ఎన్ని కలు జరపాల్సిన అవసరముందని ప్రధాని మోడీ అన్నారు. దీనిపై దేశంలో విస్త తమైన చర్చ జ గాలని అభిప్రాయపడ్డారు. ఎన్నికల కోసం దేశంలో వేలకోట్ల రూపాయల ప్రజాధనం ఖర్చు పుతోందని అన్నారు. కోట్లాదిమంది ఉద్యోగులు ఈ ఎన్నికల కోసం సమయాన్ని వెచ్చించాల్సి వస్తోందని తెలిపారు. పేదరికంలో ఉన్న ఈ దేశంలో భారీ స్థాయిలో ప్రజాధనం ఎన్నికలపై ఖర్చుచేయడం సరైందికాదన్నారు. ప్రస్తుతం లోక్‌సభతో పాటు ఏపీ, తెలంగాణ, ఒడిశా, అరుణాచల్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు జరుగు తున్నాయని గుర్తుచేశారు.

ప్రధాని ప్రసంగానికి అడ్డుతగిలిన ఎంపీ రేణుకా చౌదరి

ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాజ్యసభలో ప్రసంగిస్తుండగా కాంగ్రెస్ పార్టీ ఎంపీ రేణుకా చౌదరి పదేపదే అడ్డుపడ్డారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని ఉద్దేశించి ప్రధాని మోడీ మాట్లాడుతూ, కాంగ్రెస్‌పై విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సభ్యురాలు రేణుకా చౌదరి పలు కామెంట్లు చేస్తూ, వ్యంగ్యంగా నవ్వుతూ మోడీ ప్రసంగానికి అడ్డుతగిలారు. ప్రధాని ప్రసంగానికి అడ్డు తగలవద్దంటూ రాజ్యసభ ఛైర్మన్ వెంక య్యనాయుడు రేణుకను మందలించారు క నాదా. అయితే, ఈ సమయంలో ప్రధాని మోదీ.. రేణుకా చౌదరిపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. మోదీ ప్రసంగిస్తుండగా రేణుక గట్టిగా నవ్వుతూ ఉండటంతో.. 'సభాపతిగారు.. రేణుకాజీని ఏమీ అనొద్దని మిమ్మల్ని కోరుతున్నా.. రామాయణం సీరియల్ తర్వాత ఇంతటి నవ్వులను వినే సౌ భాగ్యం ఇప్పుడే దక్కింది' అంటూ మోదీ అన్నా రు. దాంతో బీజేపీ సభ్యులంతా పెద్దపెట్టున నవ్వా రు. అయితే మహిళలను అవమా నిస్తున్నా రంటూ రేణుకాచౌదరి మాట్లాడే ప్రయత్నం చేయగా, రాజ్యసభచైర్మన్ ఆమెను వారించారు.

సవరణలు ప్రతిపాదించిన విజయసాయిరెడ్డి

రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ఓటింగ్ సమయంలో వైఎస్ఆర్‌సీపీ ఎంపీ విజయసాయి రెడ్డి పలు సవరణలు ప్రతి పాదించారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని, రైల్వేజోన్ కడపల్లో స్టీల్‌ప్లాంట్, దుగరాజపట్నం పోర్టు, పోలవరం, మహిళా రిజర్వేషన్లపై వంటి తర అంశాలను చేర్చాలని సవరణలు ప్రతిపాది చారు. సవరణలు వెనక్కి తీసుకునేందుకు అం గీకరించకపోవడంతో ఓటింగ్ నిర్వహిం చారు. దీంతో ఓటింగ్‌లో సవరణలు వీగిపోయాయి.

హామీలొద్దు.. నిధులివ్వండి

(మొదటిపేజీ తరువాయి)

అమలు చేయని సర్కారు కేవలం హామీలు, సర్దిచెప్పే ప్ర కటనలతో సరిపెడితే ఇక కుదరదని, ఇన్నాళ్లుగా ఎందుకు చే యలేకపోయారో వివరణ ఇవ్వాల్సిందేనని జయదేవ్ నిల దీశారు. ఉదయం నుంచే వ్యూహాత్మకంగా తెలుగుదేశం పార్టీ ఎంపీలు తమ ఆందోళనను తీవ్రతరం చేశారు. సోమవారం నుంచి మొదలుపెట్టిన నిరసనపర్వాన్ని మంగళవారం కేంద్ర మంత్రులు అరుణ్ జైట్లీ, పీయూష్ గోయల్ ప్రకటనలు చేసే వరకు తీసుకొచ్చారు. ఆ ఇద్దరు మంత్రులిచ్చిన ప్రకటనలతో ఏమాత్రం సంతృప్తి చెందని నేతలు, బుధవారం ఆందోళనను మరింత తీవ్రతరం చేశారు. రోజంతా సాగిన నిరస నలు, ఆందోళనల తీరును గమనిస్తే..

సుజనా నివాసంలో వ్యూహరచన.. పార్లమెంటులో ముప్పేట దాడి

ఉదయం 9 గంటల సమయంలో తెలుగుదేశం పార్ల మెంటరీ పార్టీ నేత, కేంద్ర మంత్రి వై.ఎస్. చౌదరి (సుజనా) నివాసంలో ఎంపీలంతా సమావేశమయ్యారు. సమా వేశం లోనే బుధవారం అమలు చేయాల్సిన వ్యూహాల గురించి చ ర్చించారు. పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు టెలీకాన్ఫరెన్స్ ద్వారా ఎంపీలకు దిశా నిర్దేశం చేశారు. సీఎం ఆదేశాల మేరకు ఆందోళన కొనసా గించాలని నిర్ణయించుకున్న తెలుగుదేశం ఎంపీలు, నేరుగా పార్లమెంటులోని మహాత్మా గాంధీ విగ్రహం వద్దకు చేరుకు న్నారు. గత 2 రోజులుగా తెలుపు, లేదా నలుపు రంగు పేపర్లపై నినాదాలను ముద్రించిన ప్లకార్డులు పట్టుకున్న ఎంపీలు, బుధవారం తమ పార్టీ రంగైన పసుపు రంగు ప్లకార్డులు చేత బట్టారు. వాటిపై నినాదాలతో పాటు తెలుగుదేశం పార్టీ అని ఆంగ్లంలో ముద్రించారు. పార్టీ కండువాలు ధరించి మరీ మూడో రోజు నిరసన ప్రదర్శన ప్రారంభించారు. గాంధీ విగ్రహం వద్ద నినాదాలతో హెూరెత్తించారు. సభ ప్రారంభ మయ్యే సమయానికి లోపలికి వెళ్లిన ఎంపీలు, లోక్‌సభలో ప్లకార్డులు పట్టుకుని వెల్‌లోకి దూసుకెళ్లారు. స్పీకర్ పోడి యంకు ఇరువైపులా నిలబడి నినాదాలు కొనసాగించారు. ప్రశ్నోత్తరాల సమయం నుంచి మొదలు పెట్టి, ప్రధాని ప్రసం గం ప్రారంభించే వరకు నిరసన కొనసాగించారు. సభలోని మిగతా సభ్యులకు అర్థమయ్యేలా ఎంపీ రామ్మోహన్‌నాయు డు హిందీలో నినాదాలు చేయగా, మిగతా సభ్యులు వంత పాడారు. ''రైల్వే జోన్ క్యా హువా'' (రైల్వే జోన్ ఏమైంది?) వంటి నినాదాలతో సభ్యుల ప్రసంగాల్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. చేతిలోని ప్లకార్డులు కెమేరాలో కనిపించేలా స్పీకర్‌తో సహా, ప్రసంగించే సభ్యులకు అడ్డుగా పట్టుకున్నారు. దీంతో స్పీకర్ సుమిత్రా మహాజన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ''క్రమ శిక్షణ గురించి పిల్లలకు చెబుతాం, కానీ మీరంతా పిల్లలు కాదు, మీ పిల్లలకు క్రమశిక్షణ చెప్పాల్సిన వాళ్లు. మీరే ఇలా ఉంటే ఎలా?'' అంటూ ఆమె అసహనం ప్రదర్శించారు. ఆమె అసహనాన్ని లెక్కచేయకుండా ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) ప్లకార్డును మరింతపైకెత్తి పట్టుకుని నినాదాలు చేశారు. దీంతో నినాదాల హెూరులోనే స్పీకర్ ప్రశ్నోత్తరాల సమయాన్ని కొన సాగించారు.

ప్రధాని ప్రసంగంపై పెదవి విరుపు భోజన విరామం తర్వాత నిరసన కొనసాగింపు

లోక్‌సభలో సుదీర్ఘంగా సాగిన ప్రధాని మోడీ ప్రసం గంలో ఆంధ్రప్రదేశ్ విభజన నాటి పరిస్థితుల గురించి ప్రస్తా వించడం మినహాయిస్తే, కేంద్రం రాష్ట్రానికి ఏం చేస్తుందన్న విషయంలో ఎలాంటి ప్రస్తావన లేకపోవడంపై తెలుగుదేశం ఎంపీలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన కేవలం భావోద్వేగాలను రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు మినహా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి ఏం చేస్తామన్నది చెప్పలేదని పెదవి విరి చారు. ప్రధాని ప్రసంగంలోనూ విస్పష్టమైన హామీ రాకపో వడంతో భోజన విరామం తర్వాత మధ్యాహ్నం గం. 3కు సభ మళ్లీ మొదలవగానే ఆందోళన పునః ప్రారంభించారు.

బడ్జెట్‌పై చర్చలో జయదేవ్ వీరంగం

సాయంత్రం బడ్జెట్‌పై చర్చ మొదలయ్యాక, తెలుగుదేశం పార్టీ తరపున ఎంపీ గల్లా జయదేవ్ మాట్లాడే అవకాశం అందిపుచ్చుకున్నారు. పరిమిత సమయంలోనే తాను చెప్పదలుచుకున్న విషయాన్ని సూటిగా, స్పష్టంగా చెప్పే శారు. బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి జరిపిన కేటా యింపులను, జరిగిన అన్యాయాన్ని ఉదాహరణలతో సహా ఎండగట్టారు. అందులో ముఖ్యంగా విభజన చట్టంలో పొం దుపరిచిన హామీలు, అంశాలను ఉదహరిస్తూ ఇప్పటికీ అప రిష్కృ తంగా ఉన్న 19 అంశాలను ప్రస్తావిస్తూ, అందులో 5 ప్రధానాంశాలపై మాట్లాడారు.

ఈ అంశాలన్నీ తాము కొత్తగా కోరుతున్నవేమీ కాదని, ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోనే పొందుపరిచినవని గల్లా జయదేవ్ పేర్కొన్నారు. వీటిని అమలు చేయడానికి బడ్జెట్‌లో జరిపిన కేటాయింపులేవని ప్రశ్నించారు. వీట న్నింటినీ ఎలా అమలు చేస్తారని నిలదీశారు. ''ఇందులో ప్రత్యేక హెూదాకు బదులుగా ప్రత్యేక ఆర్థిక సహాయం (ప్యాకేజి) ఇస్తామని 2016 సెప్టెంబర్‌లో ప్రకటించారు. ఇంత వరకు ఏమాత్రం అమలు కాలేదు. ఇది పూర్తిగా రాష్ట్రాన్ని, రాష్ట్ర ప్రజలను మోసగించడమే అవుతుంది. ఇది కచ్చితంగా రాష్ట్రప్రజలకు అన్యాయం చేయడమే'' అని ఆవేశంగా మాట్లా డారు. ఈ పరిస్థితిని ఊహించే తాము ప్యాకేజికి చట్టబద్ధత కావాలని డిమాండ్ చేసినట్టు గుర్తుచేశారు. నిర్ణీత కాల పరిమితిలోగా ఈ ప్యాకేజిని అమలు చేసేలా చట్టం తీసు క రావాలని అందుకే కోరామని చెప్పారు. కానీ అవేవీ జర గలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇక రాజధానికి సంబంధించి తాము రైతుల నుంచి సేకరించిన భూమిని అభివృద్ధి చేసి క్రయవిక్రయాలు మొదల య్యే వరకు క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరగా, కేవలం రెండేళ్లు మాత్రమే వర్తించేలా మినహాయింపునిచ్చారని పేర్కొన్నారు. మరోవైపు వెనుకబడ్డ 7 జిల్లాలకు (ఉత్తరాంధ్ర, రాయలసీమ) కేబీకే, బుందేల్ ఖండ్ తరహా ప్యాకేజి ని అమలు చేయాలని విభజన చట్టంలో ఉంటే కేవలం జిల్లాకు రూ. 50 కోట్ల చొప్పున మూడేళ్లు ఇచ్చా రని, ఈసారి బడ్జెట్‌లో అది కూడా లేదని గల్లా జయదేవ్ తీవ్ర అసంత ృప్తి వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టుకు 2014-15 అంచనాల ప్రకారం రూ. 54,000 కోట్లు ఖర్చవుతుందని అం చనా వేయగా, అందులో రూ. 32,000 కోట్లు భూసేకరణ, పరిహారం, పునరావాసం కోసమే ఖర్చవుతుందని పేర్కొ న్నారు. ఈ ప్రాజెక్టుకు కేంద్ర బడ్జెట్ నుంచి చేసిన కేటాయింపులేవని ఆయన నిలదీశారు.

రైల్వే బడ్జెట్‌ను కూడా కలిపేసుకున్న బడ్జెట్‌లో రైల్వే జోన్ ప్రస్తావనే లేదని జయదేవ్ అన్నారు. అలాగే

ఇప్పటికీ పరిష్కారానికి నోచుకోని, అమలు కాని ఆ 19 హామీలు, అంశాలు...

- ప్రత్యేక హెూదా
- రిసోర్స్ గ్యాప్ (రెవెన్యూ లోటు)
- పోలవరం ప్రాజెక్ట్
- రైల్వే జోన్
- రాజధాని (అమరావతి) నిర్మాణానికి ఆర్థిక సహాయం
- గ్రీన్ ఫీల్డ్ క్రూడ్ రిఫైనరీ ఏర్పాటు
- పెట్రో కెమికల్ కాంప్లెక్స్
- జాతీయ విద్యా, పరిశోధనా సంస్థల ఏర్పాటు
- దుగరాజపట్నం పోర్ట్ నిర్మాణం
- అసెంబ్లీ సీట్ల పెంపు
- పన్ను రాయితీలు
- కడపలో స్టీల్ ప్లాంట్
- విశాఖపట్నం-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్
- విశాఖపట్నం, విజయవాడ మెట్రో రైల్
- అమరావతికి ర్యాపిడ్ రైల్ అండ్ రోడ్ కనెక్టివిటీ
- వెనుకబడ్డ జిల్లాలకు ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజి
- విద్యుత్ పంపిణీ కంపెనీల బకాయిల చెల్లింపులు
- షెడ్యూల్ 9 మరియు షెడ్యూల్ 10 సంస్థల ఏర్పాటు
- గ్రేహౌండ్స్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు



విజయవాడ, విశాఖపట్నం మెట్రో రైలు ప్రస్తావన కూడా లేనే లేదని తీవ్ర అసంత ృప్తి వెళ్లగక్కారు. అదే పొరుగు రాష్ట్రం కర్ణాటకలోని బెంగళూరుకు, మహారాష్ట్రలోని ముంబై నగరానికి మెట్రో, సబర్బన్ రైల్వే ప్రాజెక్టుల కోసం భారీగా వేల కోట్ల రూపాయలు కేటాయించారని గుర్తుచేశారు. ''కర్ణా టకలో ఎన్నికలు ఉన్నందుకే ఈ కేటాయింపులు చేశారు, ఏపీలో ఎన్నికలు లేవు కాబట్టి ఒక్క పైసా ఇవ్వలేదు. ఇది రాజ కీయం కాదా?

> ప్రశ్నోత్తరాల సమయం తర్వాత ప్రధాని ప్రసంగించేందుకు సిద్ధపడ్డారు. అయితే ప్రధాని ప్రసంగానికి అడ్డురావద్దని కేంద్ర హెూంమంత్రి రాజ్‌నాథ్ సింగ్, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి అనంత్ కుమార్ తెలుగుదేశం, వైకాపా నేతలను ఉదయం నుంచి పదే పదే కోరుతూ వచ్చారు. వారి కోరికను మన్నించారో లేక ప్రధాని ప్రసంగంలోనైనా స్పష్టత
>
> ## వెనక్కి తగ్గిన ఎంపీలు
>
> వస్తుందని భావించారో, మొత్తానికి తెలుగుదేశం ఎంపీలు ప్రధాని నరేంద్ర మోడీ ప్రసంగం ప్రారంభించే సమయానికి తమ తమ సీట్లలోకి వెళ్లి కూర్చున్నారు. దాదాపు 2 గంటలపాటు సాగిన సుదీర్ఘ ప్రసంగాన్ని ఆసాంతం విన్నారు. కాంగ్రెస్‌పై విరుచుకుపడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావాన్ని, ఎన్టీ రామారావు పేరును మోడీ ప్రస్తావించిన సందరాఇ ల్లో తెదేపా ఎంపీల్లో కొందరు బల్లలు చరిచారు.

డ్నోలా స మర్థించు కుం టారు?'' అని గట్టిగా నిలదీశారు. రైల్వో జోన్ గురించి మళ్లీ ప్రస్తావిస్తూ జోన్ ఏర్పాటు చేయడానికి ఎన్నేళ్లు పడుతుందని ప్రశ్నిం చారు. మంగళవారం రైల్వే మంత్రి పీయూష్ గోయల్ ప్రకట నను గుర్తుచేస్తూ, నాలుగేళ్లుగా సంప్రదింపులు చేస్తున్నాం అనడంలో అర్థం ఉందా అని నిలదీశారు.

విభజన చట్టంలోని సెక్షన్ 93 ప్రకారం రాజధానిలో ప్రధాన భవనాలు రాజ్ భవన్, హైకోర్టు, సచివాలయం, అసెంబ్లీ వంటి వాటి కోసం కేంద్ర ప్రభుత్వమే నిధులివ్వాలి. అలాగే రాజధాని ప్రాంతంలో మౌలిక వసతుల కల్పన కోసం కూడా కేంద్రమే ఖర్చులు భరించాలి. కానీ ఇప్పటి వరకు ఎన్ని నిధులిచ్చారు? మొత్తం మూడేళ్లలో రూ. 1,500 కోట్లు రాజ ధానికి, మరో రూ. 1,000 కోట్లు విజయ వాడగుంటూరు అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ వ్యవస్థ ఏర్పాటుకు ఇచ్చి చేతులు దులు పుకున్నారు. అసలు రాజధాని ప్రధాన భవంతులు, మౌలిక వసతుల కోసం రూ. 42,935 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశామని, ప్రతి ఏడాది కనీసం రూ. 10,000 కోట్లు ఇస్తే తప్ప రాజధాని నిర్మాణం సాధ్యం కాదని గల్లా జయదేవ్ అన్నారు. విభజన కారణంగా తలెత్తిన రెవెన్యూ లోటుపై చర్చించేందుకు తమ రాష్ట్ర అధికారులు ఢిల్లీ వచ్చారని, దీనిపై ఇప్పుడేం చెబుతారో చూడాలని వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి ప్రక టించిన వివిధ విద్యాసంస్థలు, పరిశోధనా సంస్థల నిర్మాణం కోసం కేంద్ర బడ్జెట్ కేటాయింపులు చూస్తుంటే ఇంకో 10 నుం చి 30 ఏళ్లు గడిచినా అవిపూర్తికావని గల్లా జయదేవ్ అన్నారు. అరాకొరా నిధుల కేటాయింపుతో ఎప్పటికి పూర్తయ్యేను అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తన నియోజకవర్గం పరిధిలోకి వచ్చే మంగళగిరి ఎయిమ్స్ కోసం రూ. 1,618 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేయగా, ఒక్క పైసా కేటాయించలేదని, అదే ఎన్నికలు జరిగే ఇతర రాష్ట్రాలకు కేటాయింపులు చేశారని కేంద్రాన్ని మరోసారి ఇరకాటంలో పడేశారు. విశాఖలోని డ్రెడ్జింగ్ కార్పొరేషన్, పోర్ట్ ట్రస్ట్, స్టీల్ ప్లాంట్ తదితర సంస్థలకు చేసిన కేటాయింపులు కూడా చాలా తక్కువ అని అన్నారు. అసలు మొత్తం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి జరిపిన కేటాయింపులు రూ. 1,418 కోట్లు మాత్రమేనని, ఇది తమ బాహుబలి సినిమా కలెక్షన్లకంటే కూడా తక్కువేనని చెప్పడంలో అతి శయోక్తి ఏమీ లేదని కేంద్రానికి చురకలు వేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని విభజించిన కాంగ్రెస్ పార్టీకి సున్నా సీట్లు ఇచ్చిన ఆంధ్రప్రదేశ్ ప్రజలు, విభజన చట్టంలో ఉన్న హామీలనే అమలు చేయని బీజేపీకి ఏమిస్తారో ఊహించండి అంటూ ఘాటుగా వ్యాఖ్యా నించారు. నాలుగేళ్లుగా కలిసున్నా ప్రయోజనం ఏమీ లేనప్పుడు ఈ సంబంధం మాకెందుకు అని చురకలేశారు. ఈ సమయంలో కొందరు కాంగ్రెస్ ఎంపీలు అయితే ఎన్డీయే నుంచి బయటికొచ్చేయండి అంటూ నినాదాలు చేశారు. ఆ నినాదాలను పెద్దగా పట్టిం చుకోకుండా గల్లా జయదేవ్ తన ప్రసంగాన్ని ముగిస్తూ, బీజేపీ మిత్రధర్మాన్ని పాటించాలని హితవు పలికారు. ఇక సమయం పెద్దగా లేదని, నౌ ఆర్ నెవర్ (ఇప్పుడు కాదంటే ఎప్పటికీ కాదు) అంటూ హామీలను అమలు చేయడానికి అవసరమైన నిధులు బడ్జెట్ సవరణల్లో కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు తమకు కావాల్సింది ప్రకటన కాదని, ఇంత కాలం ఎందుకు చేయలేదో వివరణ ఇవ్వాలని గల్లా జయదేవ్ వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలేమీ మూర్ఖులు కాదని అంటూ తన ప్రసంగాన్ని ముగించారు.

Andhraprabha business 2018
బిజినెస్
BUSINESS

మార్కెట్ తీరు మారలేదు

● సెన్సెక్స్ 113 పాయింట్లు నష్టం ● 7వరోజు నష్టాల్లోనే



ముంబై: స్టాక్ మార్కెట్లు వరుసగా ఏడు రోజు బుధవారం కూడా నష్టాల్లో ముగిశాయి. ఆర్‌బీఐ వడ్డీరేట్లను యధాతథంగా కొనసాగించడంతో పాటు వృద్ధిరేటును తగ్గించడం మార్కెట్లను సంతృప్తిపరచలేదు. బీఎస్ఈ 113 పాయింట్లు క్షీణించి 34,082.71 వద్ద నిఫ్టీ 21.55 పాయింట్లు నష్టపోయి 10,476.70 వద్ద ముగిసింది. గ్లోబల్ మార్కెట్ల విషయానికి వస్తే డౌజోన్స్ క్రమంగా పుంజు కోవడంతో ట్రేడర్లకు కాస్తా ఉపశమనం కలిగింది. వరుసగా గత ఏడు ట్రేడింగ్ సెషన్‌లలో బీఎస్ఈ 2,200 పాయింట్ల వరకు నష్టపోయింది. విదేశీ పోర్టుపోలియో ఇన్వెస్టర్లు మంగళవారం నికరంగా రూ.2326.10 కోట్ల షేర్లు విక్రయిస్తే.. దేశీయ సంస్థాగత మదుపరులు రూ.1699.74 కోట్ల షేర్లు విక్ర యించారని స్టాక్ మార్కెట్ గణాంకాలు తెలియజేస్తున్నాయి. బీఎస్ఈలో అత్యధికంగా బ్యాంకింగ్ రంగానికి చెందిన షేర్లు నష్టపోయాయి. వాటిలో పీఎన్‌బీ, ఎస్‌బ్యాంకు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, యా క్సిస్‌బ్యాంకు, ఇండస్‌ఇండ్ బ్యాంకు, బ్యాంకు ఆఫ్ బరోడా షేర్లు 2.18 శాతం వరకు నష్టపోగా.. ఐసీఐ సీఐ బ్యాంకు, ఎస్‌బీఐ, ఫెడరల్ బ్యాంకులు లాభాలను మూటగట్టుకున్నాయి. నష్టపోయిన షేర్ల విష యానికి వస్తే ఎల్అండ్‌టి, టీసీఎస్, భారతి ఎయిర్‌టెల్, విప్రో, హిందుస్తాన్ యూనీలీవర్, ఎంఅం డ్ఎం, మారుతి సుజుకి, టాటాస్టీల్, సన్‌ఫార్మా, ఎన్‌టీపీసీ, హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్‌లున్నాయి. ఆసియా మార్కెట్లు నష్టాలతో ముగియగా.. ఐరోపా మార్కెట్లు మాత్రం లాభాలను చవిచూశాయి.

ఆంబే వ్యాలీ ఆస్తుల కొనుగోలుకు
మహీంద్రా, పిరామల్‌ల ఆసక్తి

న్యూఢిల్లీ : సహారా గ్రూపునకు చెందిన 34వేల కోట్ల ఆంబే వ్యాలీ ఆస్తులను కొనుగోలు చేయడానికి రెండు కంపెనీలు మహీంద్రా లైఫ్‌స్పేస్ డెవలపర్, పిరామల్ గ్రూపులు కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నాయి. బొంబాయి హైకోర్టు లిక్విడేటర్ ఈ విషయాన్ని సుప్రీంకోర్టుకు తెలియజేశారు. ప్రస్తుతం ఈ రెండు కంపెనీలు దీనిపై అధ్యయనం చేస్తున్నాయని తెలిపారు. ఈ ఆస్తిని వివిధ భాగాలుగా విడగొట్టి వేలం వేయడానికి అనుమతి ఇవ్వాలని కోర్టును లిక్విడేటర్ అనుమతి కోరారు. చీఫ్ జస్టిస్ దీపక్‌మిశ్రా, రంజన్ గోగాయ్, ఏకే సిక్రీ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ప్రత్యేక బెంచ్ ఆంబీవ్యాలీ ఆస్తులను వివిధ భాగాలు విభజించి విక్రయించుకోడానికి అనుమతులు మంజూరు చేసింది. బొంబాయి హైకోర్టు జడ్జి నేతృత్వంలో ఇద్దరు రీసీవర్స్‌తో సంప్రదింపులు జరిపి వేలం ప్రక్రియను అమలు చేయాలని కోరింది. సెబి తరపున సీనియర్ అడ్వకేట్ అరవింద్ దాతర్ తన వాదన వినిపించారు. సహారా గ్రూపు ఇన్వెస్టర్లకు రూ.11,569.8 కోట్లు బకాయిపడిందని పేర్కొనగా.. సహారా చీఫ్ తరపున వాదిస్తున్న వికాస్ దీన్ని తోసిపుచ్చారు. ఇప్పటికే ఇన్వెస్టర్లకు చెల్లింపులు చేశామని అవన్నీ రికార్డు చేశామని దీనికి రూ.50 కోట్ల వరకు ఖర్చు పెట్టామన్నారు. ఇక అసలు విషయానికి వస్తేసహారా గ్రూపు దానికి సంబంధించిన రెండు రియల్టీ కంపెనీలు మార్కెట్ నియంత్రణా సంస్థ సెబి అనుమతి లేకుండా చిన్న చితకా ఇన్వెస్టర్లను పెద్దమొత్తంలో పెట్టుబడులు సేకరించింది. దీనికి వ్యతిరేకంగా సెబి సుప్రీంకోర్టును ఆశ్రయించడం.. కోర్టు ఇన్వెస్టర్లకు ఇవ్వాల్సిన మొత్తం రూ.24వేల కోట్లు తిరిగి ఇచ్చేయాలని కోర్టు ఆగస్టు 31, 2012న ఆర్డర్ జారీ చేసింది. అప్పటి నుంచి సహారాచీఫ్ ఇన్వెస్టర్లకు డబ్బు వాపసు చేయకపోవడంతో ఎట్టకేలకు సుప్రీంకోర్టు ఆంబేవ్యాలీ ఆస్తులను విక్రయించి ఇన్వెస్టర్లకు వారి పెట్టుబడులను ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది.

ఇప్పటికింతే!

● వడ్డీరేట్లు యధాతథం
● ద్రవ్యోల్బణం పెరిగినా వడ్డీరేట్ల పెంపు కష్టమే
● ఉర్జిత్ పటేల్

కేంద్ర బడ్జెట్ తర్వాత మొట్టమొదటి రిజర్వుబ్యాంకు మానిటరీ పాలసీ కమిటి సమావేశం మంగళ, బుధవారాల్లో జరిగింది. అందరూ ఊహించినట్లు వడ్డీరేట్లను యధాతథంగా కొనసాగించాలని నిర్ణయించింది. దీనికి ప్రధాన కారణం.. పెరిగిపోతున్న రిటైల్ ద్రవ్యోల్బణం, ద్రవ్యలోటు లక్ష్యం కంటే మరింత పెరిగే అవకాశం. అంతర్జాతీయ మార్కెట్లో క్రమంగా ముడిచమురు ధరలు పెరగడం, ప్రభుత్వం ఉద్యోగులకు ఏడవ వేతన సంఘం సిఫారసుల వల్ల రిటైల్ ద్రవ్యోల్బణం మరింత పైకి పోవచ్చునని ఆర్‌బీఐ అభిప్రాయపడింది. కాబట్టి ప్రస్తుతానికి వడ్డీరేట్లు యధావిధంగా కొనసాగుతాయి.

ఆర్‌బీఐ 6వ ద్వైమాసిక పరపతి సమీక్ష కీలకాంశాలు

- కీలక వడ్డీరేట్లు రెపో రేటులో ఎలాంటి మార్పులేదు 6 శాతమే
- రివర్స్‌రేపో రేటు యధాతథంగా 5.75 శాతం. మార్జినల్ స్టాం డింగ్ ఫెసిలిటి (ఎంఎస్ఎఫ్) రేటు బ్యాంకు రేటు 6.25 శాతం
- మానటరీ పాలసీ విధానంలో ఎలాంటి మార్పులేదు
- జనవరిలో పెట్రోల్, డిజెల్ ధరలు భారీగా పెరిగాయి. గ్లోబల్ మార్కెట్లో ధరలు పెరగడంతో దాని ప్రభావం దేశీయ మార్కెట్లపై పడింది.
- మార్చి చివరి నాటికి రిటైల్ ద్రవ్యోల్బణం 5.1 శాతానికి..
- వచ్చే ఆర్థిక సంవత్సరం ద్రవ్యోల్బణం మొదటి సగభాగం5.1శాతం నుంచి 5.6 శాతం మధ్యలో..
- వచ్చే ఆర్థిక సంవత్సరం రెండవ సగభాగంలో రిటైల్ ద్రవ్యోల్బణం 4.5 నుంచి 4.6 శాతానికి
- గరిష్ఠ వాల్యూయాడెడ్(జీవీఏ) వృద్ధిరేటు ఈ ఆర్థిక స ంవత్సరం 6.6 శాతం
- వచ్చే ఆర్థిక సంవత్సరం జీవీఏ అంచనా 7.2 శాతం
- త్వరలోనే పెట్టుబడులు పెరిగే అవకాశం
- బ్యాంకులకు మూలధనం వచ్చిన వెంటనే రుణాల డిమాండ్ పెరుగుతుంది: ఆర్‌బీఐ
- గ్లోబల్ మార్కెట్లో డిమాండ్ పెరగడంతో ఎగుమతులు పుంజుకుంటాయి.
- బడ్జెట్‌లో గ్రామీణ మౌలికరంగంపై దృష్టి పెట్టడం ఆహ్వా నించదగ్గ అంశం
- మానిటరీ కమిటిలో ఐదుగురు సభ్యులు వడ్డీరేట్లు యధావిధిగా కొనసాగించాలని మొగ్గుచూపితే.. ఒక సభ్యుడు 0.25 శాతం వడ్డీ పెంచాలని పట్టుబట్టారు.
- తదుపరిమానిటరీ పాలసీ కమిటి సమావేశం ఏప్రిల్ 4,5 తేదీల్లో..



ముంబై: రెండు రోజుల పాటు జరిగిన రిజర్వుబ్యాంకు మానిటరీ పాలసీ సమావేశం బుధవారంతో ముగిసింది. ఈ సమావేశంలో ఆర్‌బీఐ వడ్డీరేట్లను యధాతథంగా కొనసాగించడానికి నిర్ణయించింది. దీనికి పలు కారణాలు ప్ర స్తావించింది. వాటిలో ప్రధానంగా చెప్పుకోవాలంటే ద్రవ్యలోటు అదుపు తప్పుతోంది. గ్లోబల్ మార్కెట్లో ముడిచమురు ధరలు పెరుగుతున్నాయి.. అమెరికా ట్రెజరీ బాండ్ల పై ఈల్డింగ్ పెరిగిపోవడంతో ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం ఉందని చెప్పింది. కేంద్రప్రభుత్వం ఉద్యోగులకు ఏడవ వేతన సంఘం సిఫారసులు అమలు చేస్తున్ననేపథ్యంలో ద్రవ్యోల్బణం పెరుగుతుందని చెప్పి ఈ సారికి వడ్డీరేట్ల పెంపు జోలికి పోమని స్పష్టం చేసింది.. యధావిధిగా ఆరు శాతానికి కొనసాగించడానికి నిర్ణయించింది. ఆర్‌బీఐ రెపోరేటు యధావిధిగా ఆరు శాతానికి, రివర్స్ రెపోరేటు 5.75 శాతానికి కొనసాగిస్తుంది. ఈ ఆర్థిక సంవత్సరం జీడీపీ వృద్ధిరేటు 6.6 శాతానికి సవరించింది. గతంలో 6.7 శాతం సాధిస్తుందని అంచనా వేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరం 2018-19లో మాత్రం జీడీపీ 7.2 శాతం సాధించే అవకాశాలున్నయని అంచనా వేసింది. ఇప్పుడిప్పుడే పెద్దనోట్ల రద్దు, జీఎస్టి సమస్యల నుంచి గట్టెక్కుతున్నాయని పేర్కొంది. మానిటరీ పాలసీ కమిటిలో ఐదుగురు సభ్యుల్లో ఆర్‌బీఐ గవర్నర్‌తో కలిపి వడ్డీరేట్లు యాధావిధిగా కొనసాగించాలని వోటు వేస్తే.. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మైఖేల్ పాత్ర ఒక్కరే వడ్డీరేట్లు పెంచాలని వోటు వేశారు. అయితే ఆర్‌బీఐ ద్రవ్యపరపతి సమీక్షలో అన్నీ అంశాలను జాగ్రత్తగా పరిశీలించి నిర్ణయం తీసుకుంది. వృద్ధిరేటు ఇప్పుడిప్పుడే పుంజుకుంటోందని.. ప్రస్తుతం పరిస్థితుల్లో వడ్డీరేట్ల పెంపుజోలికి కూడా పోమని కూడా స్పష్టం చేసింది. అందరూ ఊహించినట్లు ఆర్‌బీఐ వచ్చే ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యోల్బణం రేటు పెరుగుతుందని అంచనా వేసింది. ఈ ఆర్థిక సంవత్సరం రెండవ సగ భాగంలో ద్రవ్యోల్బణం 4.3 శాతం నుంచి 4.7 శాతానికి ఎగబాకవచ్చునని పేర్కొంది. వచ్చే ఆర్థిక సంవత్సరం 2018-19 మొదటి సగభాగంలో ద్రవ్యోల్బణం 5.1 శాతం నుంచి 5.6 శాతానికి ఎగబాకవచ్చునని అంచనా వేసింది . దీనికి ఆర్‌బీఐ చెబుతున్న కారణాలు అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు పెరగడంతో పాటు చమురేతర ముడిసరకుల ధరలు పెరగవచ్చునని తెలి పింది.అయితే వచ్చే ఆర్థిక సంవత్సరం రెండవ సగభాగంలో ద్రవ్యోల్బణం క్రమంగా తగ్గి 4.5 నుంచి 4.6 శాతం మధ్యలో ఉండొచ్చునని అంచనా వేసింది. దీనికి ప్రధానకారణం ఆహార ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడంతో పాటు.. రుతుపవనాలు కూడా సాధారణం కంటే మెరుగ్గా ఉండే అవకాశాలుంటాయని సరఫరా కూడా మెరుగుపడుతుందని వివరించింది. ద్రవ్యోల్బం మాత్రం పెరుగుతుందని పక్కాగా అంచనా వేసినా.. ఒక వేళ వచ్చే ఆర్థికసంవత్సరం మొదటి సగభాగంలో ద్రవ్యోల్బణం 5.6 శాతానికి ఎగబాకినా.. రెండవ సగ భాగం నుంచి ద్రవ్యోల్బణం తగ్గ ముఖం పట్టినా.. కీలకవడ్డీరేట్లు పెంచే అవకాశాల్లేవు. అంత ర్జాతీయ పరిణామాలతో పాటు దేశీయ పరిణామాల్లో ఎలాంటి కీలకమాప్పులు చేర్పులు జరి గినా.. ఆర్‌బీఐ మాత్రం వడ్డీరేట్లు పెంచడానికి మాత్రం మొగ్గు చూపడం లేదు. దీంతో బాండ్ డీలర్లకు ఉపశమనం కలిగింది. ఆర్‌బీఐ డిప్యూటి గవర్నర్ విరాల్ ఆచార్య కూడా బాండ్ ఈల్డింగ్ తగ్గించడా నికి ఎలాంటి జోక్యం చేసుకోదని.. మార్కెట్లో సరిపడేంత ద్రవ్యం అందుబాటులో ఉందని కాబట్టి బాండ్ మార్కెట్ స్థిరపడు తుందన్నారు. ప్రస్తుతం పరి స్థితులు చూస్తుంటే ఆర్‌బీఐ వడ్డీ రేట్ల పెంపుజోలికి పోయే పరిస్థితి కనిపించడం లేదు. మరింత కాల యాపన చేసేట్లు ఉంది. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే ద్రవ్యో ల్బణం పెరగడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. దీనికి ఉదాహరణ చెప్పుకోవాలంటే ముడిచమురు ధరలతో పాటు కమాడిటీ ధరలు పెరిగాయి. ప్రభుత్వం కొన్ని పంటలతో కనీస మద్దతు ప్రకటించింది. కస్టమ్స్ సంకం పెంచింది. దీంతో పాటు 2017-18, 2018-19 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్య లోటును మరింత పెరిగే అవకాశాలున్నాయని ప్రభుత్వం సెలవిచ్చింది. ఇవన్నీ కలిసి వడ్డీరేట్లు పెంచడానికి దారి తీయాల్సిన పరిస్థితులున్నా.. రిజ ర్వుబ్యాంకు మాత్రం సమీప భవిష్యత్తులో మాత్రం వడ్డీరేట్ల పెం పుజోలికిపోదు. మరింత సమయం తీసుకుని వడ్డీరేట్లు పెంచితే పెం చుతుంది. ప్రస్తుతం ఆర్‌బీఐ పరిస్థితి చూస్తుంటే కనీసం రెండు ద్రవ్యపరపతి సమీక్షల వరకు వడ్డీరేట్ల పెంపుజోలికి పోయే అవకాశాల్లేవు. వడ్డీరేట్లు పెరగాలంటే ద్రవ్యోల్బణం భారీగా పెరిగితే తప్ప వడ్డీరేట్లు పెంచడానికి అవకాశాల్లేవని ఆర్థికవేత్తలు భావిస్తున్నారు.

మార్చి నాటికి ద్రవ్యోల్బణం 5.4 శాతం

మార్చి చివరి నాటికి రిటైల్ ద్రవ్యోల్బణం 5.1 శాతానికి ఎగబాకవచ్చునని ఆర్‌బీఐ అభిప్రాయపడింది. దీనికి ప్రధాన కారణం ద్రవ్యలోటు పెరగడంతో పాటు ముడిచమురు ధరలు పెరగడం, ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు పెంచడమే కారణమని తెలిపింది. వచ్చే ఆర్థిక సంవత్సరం మొదటి సగభాగంలో ద్రవ్యోల్బణం 5.1 నుంచి 5.6 శాతం మధ్య ఉండవచ్చునని అంచనా వేసింది. ప్రభుత్వం వచ్చే ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధరేటు 7 నుంచి 7.5 శాతం మధ్యలో ఉండొచ్చునని పేర్కొంది. కాగా డిసెంబర్ రిటైల్ ద్రవ్యోల్బణం ఆర్‌బీఐ అంచనా కంటే ఎక్కువగా 5.21 శాతం దాటిపోయింది. నవంబర్‌లో 4.88 శాతం కాగా 2015 డిసెంబర్‌లో 3.41 శాతంగా నమోదైంది.

ఆటో పండుగ షురూ!



గ్రేటర్ నోయిడా : ఢిల్లీలో జరుగుతున్న ఆటో ఎక్స్‌పో 2018లో దేశీయ ఆటో కంపెనీలతో పాటు విదేశీ ఆటో కంపెనీలు తమ ప్రొడక్టులను ప్రదర్శనకు ఉంచుతున్నాయి. ఈ ఆటో ఎక్స్‌పో అధికారికంగా గురువారం మధ్యాహ్నం ఆవిష్కరిస్తారు. కాగా ప్రజల కోసం ఈ నెల 9-14 వరకు ఈ ప్రదర్శనకు అనుమతిస్తారు. వీటిలో బుధవారం నాడు కొన్ని కంపెనీలు తమ తమ ప్రొడక్టును మీడియా కోసం ప్రదర్శనకు ఉంచారు.

టీవీ ఎస్ మోటార్

టీవీఎస్ మోటార్ కంపెనీ ఎలక్ట్రిక్ స్కూటర్ కాన్సెప్ట్ 'క్రెయాన్' 220 సీసీ సింగిల్ సిలిండర్ ఇంజిన్ బైక్ జెప్పిలిన్‌ను ప్రదర్శనకు ఉంచింది. దీంతో పాటు ఎథినాల్‌తో నడిచే మోటార్‌సైకిల్ అపాచీ ఆర్‌టీఆర్ 200 ఎఫ్ఐ ఎథినాల్‌ను ఇక్కడ ప్రదర్శనకు ఉంచింది. ఈ బైక్‌ల ద్వారా కర్బన ఉద్గారాలను తగ్గించవచ్చునని టీసీఎస్ కంపెనీ ప్రెసిడెంట్, సీఈవో కెఎన్ రాధాకృష్ణణ్ ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. టీవీఎస్ క్రియాన్ 5.1 సెకన్లలో 0-60 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. లిథియమ్ బ్యాటరీ 80శాతం చార్జింగ్ 60 నిమిషాల్లో పూర్తవుతుందని వివరించారు.



హెచ్ఎంఎస్ఐ నుంచి 160సీసీ బైక్ ఎక్స్ బ్లేడ్

హీరోమోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా బుధవారం నాడు 160 సీసీ బైక్ ఎక్స్ బ్లేడ్‌ను వచ్చే నెల మార్కెట్లో విడుదల చేయబోతోంది. ఆటోఎక్స్‌లో మొత్తం పది మోడల్స్‌ను ప్రదర్శనకు ఉంచింది. వీటితో పాటు కొత్త వెర్షన్ స్కూటర్ యాక్టివాను ప్రదర్శనకు ఉంచబోతోందని కంపెనీ ప్రెసిడెంట్ సీఈవో తాకిరో హచిగో ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ తెలిపారు. కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సేల్స్ మార్కెటింగ్ వైఎస్ గులేరియా మాట్లాడుతూ 150 సీసీ 180 సీసీ బైక్ సెగ్మెంట్‌కు మంచి డిమాండ్ ఉందని ఆయన అన్నారు. ఎక్స్ బ్లేడ్ బైక్‌తో మార్కెట్లో మరింత పట్టుబిగిస్తామన్నారు.

రోమోటో కార్ప్ నుంచి 200 సీసీ

అడ్వెంచర్ మోటార్ సైకిల్, రెండుస్కూటర్లు

ద్విచక్ర వాహనాల తయారీకంపెనీల్లో అతి పెద్ద కంపెనీ హీరోమోటో బుధవారం నాడు 200 సీసీ అడ్వెంచర్ మోటార్‌సైకిల్, ఎక్స్‌పల్స్; రెండు 125 సీసీ స్కూటర్లను ఈ ఏడాది చివర్లో మార్కెట్లో విడుదల చేయబోతోందని కంపెనీ చైర్మన్, ఎండీ, సీఈవో పవన్ ముంజాల్ ఇక్కడ జరుగుతున్న ఆటోఎక్స్‌పో అన్నారు.

మారుతి నుంచి కాన్సెప్ట్ ఫ్యూచర్ ఎస్ కార్లు

దేశంలోని అతి పెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకి బుధవారం నాడు ఇక్కడ కాన్సెప్ట్ కాంపాక్ట్‌కారు తో పాటు ఎస్‌యూవీ లాంటి కార్లను ఇక్కడి ఆటో ఎక్స్‌పోలో గ్లోబల్ ఆవిష్కరణ చేసింది. ఈ కాన్సెప్ట్ ఫ్యూచర్‌ఎస్ వినూత్నమైన స్టయిల్‌తో ఎఎస్‌వీని తలపిస్తుందని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. భారత్ మార్కెట్ కోసం యుటిలిటి వాహనాలను పెద్దమొత్తంలో విడుదల చేస్తామని కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ సీఈవో కెనిచి ఆయుకావా చెప్పారు.

హోండా కొత్త అమెజ్, సివిక్

జపాన్‌కు చెందిన ఆటో దిగ్గజం కంపెనీ హోండా బుధవారం మొత్తం మూడు ప్రొడక్టులను ప్రదర్శనకు ఉంచింది. వాటిలో కొత్త అమేజ్, ఒకటి వచ్చే ఆర్థిక సంవత్సరం రోడ్లపైకి వస్తుంది. దీంతో పాటు కొత్త సీఆర్-వీ, సివిక్ సెడాన్‌లో పాటు మరో మూడు ప్రొడక్టులనువచ్చే మూడు సంవత్సరాల్లో మార్కెట్లో విడుదల చేయడం జరుగుతుంది. వచ్చే మూడు సంవ త్సరాల్లో భారత్ మార్కెట్ కోసం మొత్తం ఆరు మోడల్స్‌ను విడుదల చేస్తామని చెప్పిన మాటకు కట్టుబడి 2018-19 ఆర్థిక సంవత్సరానికి మూడు మోడల్స్‌ను విడుదల చేస్తామని కంపెనీ ప్రెసిడెంట్, రెప్రెంజెటెటివ్ డైరెక్టర్ లాకాహీరో హచిగో చెప్పారు.

కియా మోటార్స్ ఆవిష్కరణ

దక్షిణ కొరియాకు చెందిన కియా మోటార్స్ బుధవారం నాడు వివిధ మోడల్స్‌ను ఆటోఎక్స్ 2018లో ప్రదర్శనకు ఉంచింది. వాటిలో కాంపాక్ట్ ఎలక్ట్రిక్ వాహనాలున్నాయి. ఇవి 2019-2021 మధ్య దేశీయ మార్కెట్లో విడుదల చేస్తాయి. ఎస్‌పీ కాన్సెప్ట్ ఎస్‌యూవీని భారత్ మార్కెట్ కోసం డిజిఐన్ చేసినట్లు కియా మోటార్స్ కార్పొరేషన్ ప్రెసిడెంట్ సీఈవో హన్ కూ పార్కు ఆటోఎక్స్‌లో మీడియాతో మాట్లాడుతూ తెలిపారు. ఎస్‌పీ కాన్సెప్ట్ ఎస్‌యూవీ ఆంధ్రప్రదేశ్‌లో ప్లాంట్‌లో ఉత్పత్తి చేస్తున్నట్లు దీని కోసం 100 కోట్ల డాలర్లు పెట్టు బడులు పెట్టామని.. ఏడా దికి మూ డు లక్షల యూ నిట్ల ఉత్పత్తి జరుగు తుం దన్నారు. 2019-21 వరకు భారతీయ మార్కెట్ల కోసం హెచ్‌బ్యాక్ నుంచి ఎస్ యూవీల వరకు వాహనాలను మార్కెట్లో విడుదల చేస్తామన్నారు.



రెనో నుంచి 2 ఈవీకార్లు

ఫ్రెంచి ఆటో దిగ్గజం రెనో ఇండియా ఎలక్ట్రిక్ కాన్సెప్ట్ కార్లు ట్రెజోర్, జోఈ ఈ-స్పోర్ట్‌ను ఇక్కడ ఆటో ఎక్స్‌పోలో ప్రదర్శనకు ఉంచింది. ప్రభుత్వం నుంచి ఎలక్ట్రిక్ కార్ల విధానంపై స్పష్టం వస్తే మార్కెట్లో విడుదల చేస్తామని కంపెనీ ఇండియా సీఈవో, ఎండీ సుమిత్ సహానే చెప్పారు. ఫార్ములా వన్ కారు ఆర్ఎస్ 17తో పాటు రెనోస్పోర్ట్ ఫార్మా వన్ టీమ్‌ను ప్రదర్శనకు ఉంచింది. వీటితో పాటు వివిధరకాల కార్లు క్విడ్ సూపర్ హీరో ఎడిషన్‌ను కూడా ప్రదర్శనకు ఉంచింది.

మెర్సిడెజ్ బెంజ్ మేబాచ్ ఎస్650 ధర రూ.2.73 కోట్లు

జర్మనీకి చెందిన లగర్జీ కార్ల తయారీ కంపెనీ మెర్సిడెజ్ బెంజ్ మేబాచ్ ఎస్ 650ను బుధవారం నాడు మార్కెట్లో విడుదల చేసింది దీని ప్రారంభ ధర రూ.2.73కోట్లు. దీంతో పాటు ఆటోషోలో 2018 భవిష్యత్తులో విడుదల చేసే ఎలక్ట్రిక్ వాహనం కాన్సెప్ట్ ఈక్యూను ప్రదర్శనకు ఉంచింది. ఇక మేబ్యాచ్ రెండు వెర్షన్‌లలో వస్తోంది ఒకటి ఎస్650 ధర రూ.2.73 కోట్లు, రెండో మేబాచ్ ఎస్ 650 ధర రూ. 1.94 కోట్లు. కాగా భారత్ లగ్జరీ మార్కెట్లో మెర్సిడెజ్ బెంజ్ నెంబర్ వన్ స్థానంలో ఉందని కంపెనీ ఎండీ, సీఈవో రోలాండ్ ఫోల్గార్ చెప్పారు. రాబోయే ప్రొడక్టులను ఆటోఎక్స్‌లో ప్రదర్శించడానికి ఇది చక్కటి వేదిక అని ఆయన అన్నారు.

ఫియాజీ నుంచి ఏప్రిల్లా

ఇటాలియన్ ఆటో తయారీ కంపెనీ ఫియాజీ బుధవారం నాడు 125 సీసీ బైక్ ఏప్రిల్లా ఎస్ఆర్ 125సీసీ బైక్‌ను ఇక్కడ ఆటో ఎక్స్‌పోలో ప్రదర్శనకు ఉంచింది. దీని ధర ఎక్స్‌షోరూం పూనే రూ.65, 310గా నిర్ణయిం చింది. ఇక్కడ వెస్పా స్కూ టర్ తో పాటు వెస్పా జీటీ ఎస్, ట్యూనో 150తో పాటు ఈ- స్కూటర్ ఎలక్ట్రికాను ఆటో ఎక్స్‌పో ప్రదర్శనలో ఉం చింది.

2020 నాటికి పది లక్షల బైక్‌ల విక్రయం లక్ష్యం

సుజుకి మోటార్ సైకిల్ ఇండియా 2020 నాటికి మిలియన్ బైక్‌లు లేదా పది లక్షల యూనిట్లను విక్రయిస్తామని ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా ద్విచక్ర వాహనాల అమ్మకాల్లో సుజుకి దూసుకుపోతోందని.. భారత్ మార్కెట్లో మరిన్ని మోడల్స్‌ను విడుదల చేస్తామని పెద్దమొత్తంలో పెట్టుబడులు కూడా పెడుతామనారు.

హ్యుందాయ్ కొత్త ఎలైట్ ఐ20 ధర రూ.5. 34 లక్షలు

దక్షిణ కొరియాకు చెందిన ఆటోతయారీ కంపెనీ హ్యుందాయ్ కొత్త వెర్షన్ ప్రీమియం వెర్ష న్ కాంపాక్ట్ హెచ్‌బ్యాక్ ఎలైట్ ఐ20ని బుధవారం నాడు ఆవిష్కరించింది. దీని ధర రూ.5.34 లక్షల నుంచి రూ.9.15 లక్షల వరక (ఎక్స్‌షో రూం ఢిల్లీ). దీంతో పాటు గ్లోబల్ ఎలక్ట్రిక్ వాహనం లోనిక్ ను కూడా ఆవిష్క రించింది. కొత్త ఎలైట్ 2018 దేశంలోని ఆర్అండ్‌డిలో దీనిపై పెద్దెత్తున ప్రయో గాలతో పాటు డిజైన్ చేసి ఇంటిరి యర్‌తో పాటు కొత్త లుక్స్‌తో మార్కెట్లో విడుదల చేశామని కంపెనీ ఎండీ సీఈవో వైకె కూ చెప్పారు. పెట్రోల్ వెర్షన్ ధర రూ. 5.34లక్షల నుంచిరూ.7.9 లక్షల వర కు డిజెల్ ధర రూ. 6.73 లక్షల నుంచి రూ. 9.15 లక్షల వరకు ఉంటుంది. ఈ కారుకు భద్ర తా ప్రమా ణాలు ఎక్కువగా పాటిం చారు. డ్యూయెల్ ఎయిర్ బ్యాగ్‌ను అందు బాటులో ఉంచి నట్లు వివరించారు.







పృథ్వీ-2 క్షిపణి సక్సెస్

• పెరిగిన అణ్వాయుధ ప్రయోగ సామర్థ్యం

బాలాసోర్: స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసిన అణు ఆయుధ సామర్థ్యం ఉన్న పృథ్వీ-2 మిస్సైల్‌ను బుధవారం ఉదయం 11.35 నిమిషాలకు ఒడిశాలోని అబ్దుల్ కలాం ద్వీపం నుండి విజయవంతంగా ప్రయోగించారు. 350 కిలోమీటర్ల రేంజ్ ఉన్నదిగా రక్షణ శాఖ అధికారులు వివరించారు. లాంచ్ కాంప్లెక్స్-3 నుండి మొబైల్ లాంచర్‌ను ఈ క్షిపణి లేపుకెళ్లింది. జనవరి 18న అగ్ని-5ను, ఒడిశాలోని అబ్దుల్ కలాం ద్వీపం నుండి మంగళవారం అగ్ని-1 మిస్సైల్‌ను ప్రయోగించారు, విజయవంతమైనట్లు రక్షణ శాఖ అధికారులు ప్రకటించారు. 500 నుండి 1,000 కిలోల బరువున్న ఆయుధ సామాగ్రిని తరలించే సామర్థ్యం ఉంది. పృథ్వీ-2ను ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ మూడో కాంప్లెక్స్ నుండి ప్రయోగించారు. ఇది ద్రవ రూపం ఇంధనంతో నడిచేది అధికారులు ప్రకటించారు. పోరాట సన్నద్ధతను పటిష్టం చేయడానికి సైన్యంలోని వ్యూహాత్మక దళాల విభాగం ఈ పరీక్షను నిర్వహించింది. ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మిస్సైల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద డీఆర్‌డీఓ తయారు చేసి మొదటి క్షిపణిగా పేరు సంపాదించుకుంది. దీన్ని 2003లో సైన్యం వ్యూహాత్మక దళాల విభాగంలో చేర్చారు.

మాల్దీవులకు భారత్ సైన్యం!

• చైనా మాటలు లెక్కచేయని ఇండియా

న్యూఢిల్లీ: మాల్దీవుల్లో నెలకొన్న రాజకీయ సంక్షోభానికి తెర దించేందుకు భారత్ అటువైపుగా అడుగులు వేస్తున్నట్టు తెలుస్తున్నది. భారత్ తన బలగాలను మాల్దీవులకు పంపేందుకు సిద్ధం అవుతున్నట్టు సమాచారం. ప్రస్తుత మాల్దీవుల అధ్యక్షుడు అబ్దుల్లా యమీన్‌కు భారత్ వెన్నుదన్నుగా నిలుస్తున్నది. యమీన్ పదవీ కాలం నవంబర్‌లోనే ముగిసింది. ఈ సందర్భంగా కొద్ది రోజుల క్రితం త్వరలో ఎన్నికలు నిర్వహించాలని యోచిస్తున్నట్టు, ప్రజలు ఎవరికి ఓటు వేసి గెలిపిస్తారో చూడాలని విలేకరుల సమావేశంలో ప్రకటించారు. మాల్దీవుల రాజకీయ సంక్షోభంతో అంతర్జాతీయంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఫలితంగా ఎమర్జెన్సీ విధించారు. 15 రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. దేశంలో పెట్టుబడులు పెట్టాలని చైనాతో పాటు సౌదీ అరేబియా దేశాలను మాల్దీవులు అధ్యక్షుడు యమీన్ కోరుతున్నారు. మాల్దీవుల సంక్షోభంలో జోక్యం చేసుకోవద్దని, మిలటరీని పంపించొద్దని భారత్‌కు చైనా సూచించింది. ఇలా చేయడంతో అక్కడి రాజకీయ సంక్షోభం ముదురుతుందే తప్ప పరిష్కారం కాదని చైనా సూచించింది. సుప్రీం కోర్టు జడ్జీలతో పాటు మాజీ అధ్యక్షుడిని జైల్లో వేసి అరాచకంగా వ్యవహరిస్తున్న అధ్యక్షుడు యామీన్‌ను చెక్ పెట్టడానికి మీ ఆర్మీని పంపడంటూ దేశ ప్రతిపక్షనేత మహ్మద్ నషీద్ కోరిన విషయం తెలిసిందే. చైనా ఇచ్చిన సూచన నేపథ్యంలో భారత్ వెనక్కి తగ్గే పరిస్థితిలో లేదని, మాల్దీవులకు సైన్యాన్ని పంపే ఆలోచనలో ఉన్నట్టు సమాచారం. మాల్దీవుల్లో యామీన్ అభివృద్ధి చెందుతున్న పార్టీగా ఉంది. ఇస్లామిక్ యూనిటీ స్థాపనకు ప్రయత్నిస్తున్నాడు. దీనికి తోడు క్రైస్తవులకు వ్యతిరేకంగా ఆయన వ్యవహారశైలి ఉంటోంది. మాల్దీవులకు చెందిన మహ్మద్ నషీద్ డెమోక్రటిక్ పార్టీ పశ్చిమ దేశాల వైపు అడుగులు వేస్తున్నది. ఇస్లామిక్ విలువలు, సాంప్రదాయాలు గౌరవించడంతో పాటు అక్కడ ప్రశాంత వాతావరణం కల్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడు.

ప్రధాని భార్యకు తప్పిన ముప్పు

• యశోదాబెన్‌కు స్వల్ప గాయాలు.. ఒకరు మృతి

రాజస్థాన్ : ప్రధాని నరేంద్ర మోడీ భార్య యశోదాబెన్‌కు తృటిలో ప్రమాదం తప్పింది. బుధవారం కోటా -చిత్తోర్ ఘర్ రహదారిపై ఆమె ప్రయాణిస్తున్న ఇన్నోవా కారు లారీని ఢీకొట్టింది. ఆ సమయంలో కారులో ఏడుగురు ఉన్నారు. ఈ ఘటనలో ఆమెకు గాయాలయ్యాయి. కారు పూర్తిగా ధ్వంసమైంది. యశోదాబెన్‌కు ఆరోగ్యంగా బాగానే ఉందని, తలకు గాయాలయ్యాయని, భయపడాల్సిన అవసరం లేదని ప్రథమ చికిత్స నిర్వహించిన అనంతరం మెరుగైన వైద్య సేవల కోసం చిత్తోర్‌ఘర్‌కు అందించినట్టు సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ సురేష్ ఖాటిక్ తెలిపారు. ఈ ఘటన చిత్తోర్‌ఘర్ నుండి 55 కి.మీ దూరంలో చోటు చేసుకుంది. కారులో ప్రయాణిస్తున్న వారందరూ యశోదాబెన్‌కు బంధువులే. ఈ ఘటనలో ఆమెకు బంధువు బసంత్ భాయ్ అక్కడే మృతి చెందాడు. విమల్ మోడీ, గన్‌మెన్‌తో పాటు ఐదేళ్ల చిన్నారి కూడా ఆమె వెంట కారులో ఉన్నారు. 45 ఏళ్ల గన్‌మెన్ యతేంద్రతో పాటు విమల మోడీని చికిత్స నిమిత్తం ఉదయ్‌పూర్‌లోని ఆస్పత్రికి తరలించారు. యశోదాబెన్ స్కూల్ టీచర్‌గా పని చేసి ఉద్యోగ విరమణ పొందారు. ఈ ఘటన విషయమై కాంగ్రెస్ నాయకుడు అశోక్ గెహ్లాట్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. యశోదా బెన్ కుటుంబసభ్యులతో కలిసి కోటాలోని జరిగిన ఓ వివాహ వేడుకలో పాల్గొని కారులో రాజస్థాన్ నుండి గుజరాత్ వస్తున్న సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది.

ఆహార తయారీ రంగంలో అద్భుత అవకాశాలు

• పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆహ్వానం

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఆహార తయారీ రంగంలో పెట్టుబడుల కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భాగస్వామ్య సదస్సులు నిర్వహిస్తోందని రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ కార్యదర్శి గిరిజాశంకర్ తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్ గురజాడ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన సమావేశంలో రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ సంఘం సీఈవో వై.ఎస్ ప్రసాద్‌తో పాటు పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు. ఏపీలో అవకాశాలను సంబంధించి పెట్టుబడిదారులకు ఆహ్వానం పలుకుతున్నట్లు చెప్పారు. ఇందుకు సంబంధించి రేపు పూణేలో, 9వ తేదీన హైదరాబాద్‌లో, ఈనెల 24 నుంచి 26 వరకు విశాఖపట్నంలో సదస్సులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. దీనికి సంబంధించి ఇప్పటికే ఒప్పందాలు జరిగాయని, పెట్టుబడిదారులకు ప్రభుత్వం అన్నిరకాల సౌకర్యాలు కల్పిస్తుందని గిరిజా శంకర్ తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల వల్ల రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని చెప్పుకొచ్చారు. ఇప్పటికే ఏపీలో 226 యూనిట్లు పని చేస్తున్నాయని, 40 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాయని వివరించారు. ఏపీని ఆహార ఉత్పత్తి కేంద్రంగా మార్చేందుకు ఇప్పటికే 20152020 కాలానికి ఆంధ్రప్రదేశ్ సర్కార్ ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీని విడుదల చేసిందని ఆయన, 15 ఫుడ్ పార్కులను ఏర్పాటు చేస్తోందని వెల్లడించారు.

పకడ్బందీగా విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు

పీపీఏలపై కేసుల విచారణలో జాగరూకతతో వ్యవహరించండి



అమరావతి, ఆంధ్రప్రభ : విద్యుత్ శాఖ పరిధిలోని ఏపీ ట్రాన్స్‌కో, ఏపీ విద్యుత్ పంపిణీ సంస్థల పరిధిలో విద్యుత్ కొనుగోలు ఒప్పందాల నియమ నిబంధనలను పకడ్బందీగా అమలుచేసేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ మంత్రి కిమిడి కళా వెంకట్రావు అధికారులను ఆదేశించారు. బుధవారం వెలగపూడిలోని తన ఛాంబర్‌లో ఏపీ విద్యుత్ సంస్థల్లో కోర్టు పురోగతి, విద్యుత్ కొనుగోలు ఒప్పందాలపై విండ్, సోలార్ విద్యుత్ తదితర అంశాలపై విద్యుత్ శాఖ అధికారులతో మంత్రి సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు(పీపీఏ)లు సంబంధించిన అప్పిలేట్ ట్రిబ్యునల్ ఢిల్లీ, ఏపీఈఆర్సీ, హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో విచారణలో ఉన్న కేసుల పరిష్కారానికి పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. కోర్టు కేసుల పరిష్కారం అయితే విద్యుత్ సంస్థలకు ఆదాయం వచ్చే కేసుల పట్ల ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. సుప్రీం కోర్టు కేసులకు సంబంధించి ప్రతి వాయిదాకు క్రమం తప్పకుండా అధికారులు హాజరు కావాలని, ఏఓఆర్, సీనియర్ కౌన్సిల్‌తో సమన్వయం చేసుకొని ట్రాన్స్‌కో తరుపున వాదనలు బలంగా వినిపించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. భవిష్యత్తులో ఇబ్బందులు ఉత్పన్నం కాకుండా నియమావళి సమయంలో ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసే సమయాన్ని పొందుపరచాలని, నిర్ణీత సమయంలో సంబంధిత కంపెనీ పనులు పూర్తి చేయకుండా కాల వ్యవధి పొడిగిస్తే ఆ సమయంలో విద్యుత్ టారీఫ్‌ను విద్యుత్ కొనుగోలు ధర కంటే మార్కెట్‌లో విద్యుత్ ధర తక్కువ ఉంటే ఆ రేటు మాత్రమే చెల్లించేలా నిబంధనలు చేర్చాలని మంత్రి ఆదేశించారు. ఈ నిబంధనను టెండర్ దరఖాస్తుల్లో, పీపీఏ నిబంధనల్లోనూ ఖచ్చితంగా పొందుపరచాలన్నారు. దీనివల్ల విద్యుత్ సంస్థలకు లాభదాయకంగా ఉంటుందన్నారు. భవిష్యత్తులో విద్యుత్ కొనుగోలులో ధరలు తగ్గించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. భవిష్యత్తులో సాంప్రదాయేతర ఇంధన వనరులైన విండ్, సోలార్ విద్యుత్ ఉత్పత్తి పెరిగే అవకాశం ఉందని, దీని వల్ల విద్యుత్ కొనుగోలు వ్యయం కూడా తగ్గే అవకాశం ఉంటుందని, విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు చేసుకునే సమయంలో ఈ అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలన్నారు. విద్యుత్ రంగంలో దేశానికే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్ని విధాలా మార్గదర్శకంగా ఉందని మంత్రి కిమిడి కళా వెంకట్రావు ప్రశంసించారు. ఈ సమీక్ష సమావేశంలో ఇంధన శాఖ సలహాదారు కె.రంగనాథం, ఏపీ ట్రాన్స్‌కో జేఎండీ దినేష్ పరుచూరి, ఏపీ ట్రాన్స్‌కో న్యాయ సలహాదారు శివరావు, సి.ఈ ఐపీసి రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

గడువు మారితే చర్యలు తప్పవు!

• కాంట్రాక్టర్లకు మంత్రి నారాయణ హెచ్చరిక • నత్తనడక తీరుపై ఆగ్రహం • 29 కిలో మీటర్ల మేర రాజధాని రహదారుల పరిశీలన



అమరావతి, ఆంధ్రప్రభ : అమరావతి రాజధానిలో నిర్మిస్తున్న రోడ్ల నిర్మాణ పనులను పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ బుధవారం పరిశీలించారు. అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) సీఎండి లక్ష్మీపార్థసారథి, అధికారులు, మీడియా ప్రతినిధులతో కలసి మంత్రి నారాయణ దాదాపుగా 29 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణ పనులను పరిశీలించిన సందర్భంగా కొన్ని చోట్ల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్న తీరు చూసి కాంట్రాక్టర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇచ్చిన గడువు లోగా రోడ్ల నిర్మాణ పనులు పూర్తవనిచో సహించేది లేదని ఆయన కాంట్రాక్టర్లను హెచ్చరించారు. ప్యాకేజీ 13లో గల ఎన్,8, ఎన్--10, రహదార్లను మంత్రి పరిశీలించారు. మందడం గ్రామం నుంచి వెలగపూడి, మల్కాపురం, మోదుగుల్లంకపాలెం, ఐనవోలు తదితర గ్రామాల్లో 29 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణ పనుల తీరుని ప్రత్యక్షంగా ఆయన పరిశీలించి ఏడీసీ అధికారులకు కొన్ని సూచనలు చేశారు. రోడ్ల నిర్మాణాల్లోనే వంతెనల నిర్మాణాల్లో కూడా వేగం పెంచాలని ఆయన అధికారులకు సూచించారు. రోడ్ల నిర్మాణాలను పరిశీలించిన అనంతరం వెలగపూడి ఎన్సీసి క్యాంప్ కార్యాలయంలో మంత్రి విలేఖరులతో మాట్లాడారు. రైతుల భూములకు ప్రభుత్వం భద్రత కల్పిస్తుందని మంత్రి చెబుతు మందడం ప్లాట్ల కుంభకోణానికి సంబంధించి అడిగిన ప్రశ్నలకు సమాధానం చెబుతు ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరుగుతోందని, విచారణ అనంతరం అధికారుల పాత్ర రుజువైతే మాత్రం కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. రాజధానిలో మొత్తం 217 చదరపు కిలోమీటర్ల మేర 34 రోడ్లను నిర్మిస్తున్నామని అందులో 24 రోడ్ల నిర్మాణాలను జూలై లోగా పూర్తి చేస్తామన్నారు. పదిరోడ్లకు టెండర్లు పిలవాల్సి ఉందన్నారు. రోడ్ల నిర్మాణంలో వీలైనంత వరకు మలుపులు లేకుండా నిటారుగా ఉండేలా నిర్మాణాల్లో జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఇందువల్ల ప్రయాణంలో అలసట తగ్గే అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రాజధానిని అనుకున్న సమయంలో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామన్న ధీమాని మంత్రి వ్యక్తం చేశారు. అమరావతి నగరమంతా అన్ని గ్రామాలను కలిపేలా రోడ్లు నిర్మిస్తామని రైతులకు ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటుందన్నారు. రైతుల ప్లాట్లలో కూడా రోడ్ల నిర్మాణాలు ప్రారంభించనున్నామని మంత్రి చెప్పారు. వారానికి మూడు సార్లు ఏడిసి అధికారులు రోడ్ల నిర్మాణ పనులను పరిశీలించాలని ఆదేశించామని తాను వారంలో ఒక రోజు రోడ్ల నిర్మాణ పనుల పురోగతిని స్వయంగా పరిశీలిస్తానని నారాయణ తెలిపారు.

ఈ ఏడాది డిసెంబర్ నాటికి ఐఏఎస్, ఐపిఎస్ కేంద్ర సర్వీసుల అధికారులు, ఉద్యోగులతో పాటు ఎన్జీఓలకు మొత్తం 3480 క్వార్టర్లను అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. అసెంబ్లీ, హైకోర్టు తదితర భవనాలకు సంబంధించి నార్మన్ పోస్టర్ తుది డిజైన్లు వచ్చే నెలలో ప్రభుత్వానికి అందనున్నాయని అవి అందిన తర్వాత టెండర్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని ఒక ప్రశ్నకు సమాధానంగా మంత్రి చెప్పారు. దేశంలోనే ప్రసిద్ధి గాంచిన ఎస్సారామ్, విట్ వంటి సంస్థలతో పాటు అమృత విశ్వవిద్యాలయానికి కూడా శంఖుస్థాపన జరిగిందని మరో 30 ప్రసిద్ధ సంస్థలకు స్థలాలు ఇచ్చామని తెలిపారు. ఏడిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రత్నకుమార్, భూ వ్యవహారాల సంచాలకులు రామయ్య, చీఫ్ ఇంజనీర్ మోజెస్‌కుమార్, ఎస్ఇ సూర్యనారాయణ తదితరులు కూడా మంత్రి పర్యనలో పాల్గొన్నారు.

కాలుష్య కారక పరిశ్రమలను ఉపేక్షించేది లేదు

• మంత్రి శిద్దా రాఘవరావు



అమరావతి, ఆంధ్రప్రభ బ్యూరో : రాష్ట్రంలో కాలుష్య కారక పరిశ్రమలను ఉపేక్షించే ప్రసక్తే లేదని రాష్ట్ర పర్యావరణం, అడవులు, శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి శిద్దారాఘవరావు అన్నారు. వెలగపూడి సచివాలయంలో తన కార్యాలయంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ బిఎస్ఎస్.ప్రసాద్‌తో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కాలుష్య కారక పరిశ్రమల మీద తీసుకున్న చర్యలు గురించి పీసీబీ చైర్మన్‌ను అడిగి తెలుసుకున్నారు. డిసెంబర్ 19, 20177న జరిగిన పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సమావేశంలో ఇచ్చిన ఆదేశాలు మేరకు డిసెంబరు 2017 నుంచి ఫిబ్రవరి 5, 2018వ తేదీ వరకు మూడు మాసాల్లో రాష్ట్రవ్యాప్తంగా 3 జోన్లలో 866 పరిశ్రమలను తనిఖీ చేయడం జరిగిందని, పీసీ బీ నిబంధనలు పాటటించని 405 పరిశ్రమలకు నోటీసులు జారీ చేయడం, 301 పరిశ్రమలకు మార్గదర్శకాలు జారీ చేయడం, 29 పరిశ్రమల మూసివేతకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని, పీసీబీ నిబంధనల ఆచరణార్థం 23 పరిశ్రమల మీద బ్యాంకు గ్యారంటీ విధించి తీసుకోవడం జరిగిందని పీసీబీ చైర్మన్ మంత్రికి తెలిపారు. విపరీతమైన కాలుష్యాన్ని వెదజల్లుతున్న గుంటూరు జిల్లా పేరేచర్ల గ్రామ పరిసర ప్రాంతాల్లో ఉన్న 59 స్టోన్ క్రషింగ్‌యూనిట్లను పిసిబి చైర్మన్ మంత్రికి వివరించారు. పీసీబీ నిబంధనలు పాటించని స్టోన్ క్రషర్స్ యూనిట్ల లైసెన్సులు రద్దుచేయాల్సిందిగా మంత్రి ఆదేశించారు. అన్ని ఆసుపత్రుల లో సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు ఏర్పాటు చేయాల్సిందిగా, ఆసుపత్రి వ్యర్థాలను బయో మెడికల్ వేస్ట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లో బూడిద చేసే విధంగా తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు.

ఫిలిప్పీన్స్‌లో సోమిరెడ్డి బృందం

వరి సాగులో ఆధునిక పద్ధతులపై అధ్యయనం



అమరావతి, ఆంధ్రప్రభ : వరిసాగులో ఆధునిక పద్ధతులపై అధ్యయనం చేసేందుకు విదేశాల్లో పర్యటిస్తున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డితో కూడిన అధికార బృందం బుధవారం ఫిలిప్పీన్స్ దేశంలో విస్తృత పర్యటణ నిర్వహించింది. పర్యటనలో భాగంగా ఫిలిప్పీన్స్ దేశ రాజధాని నగరమైన మనీలాలో ప్రసిద్ధిగాంచిన అంతర్జాతీయ వరి సంస్థ ప్రతినిధులను కలవడంతోపాటు వరి సాగు చేస్తున్న క్షేత్రాలను మంత్రి బృందం పరిశీలించింది. అనంతరం మంత్రి సోమిరెడ్డి ఐఆర్ఆర్ఐ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మాథ్యూ మోరెల్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జాక్విలైన్‌లతో ప్రత్యేక చర్చలు నిర్వహించారు. ఈ సందర్భంగా దక్షిణ భారత ప్రాంతీయ కార్యాలయాన్ని ఏపీలో ఏర్పాటు చేసేందుకు ఐఆర్ఆర్ఐ సంస్థ ప్రతినిధులు అంగీకరించడం జరిగింది. ఈ రీజినల్ సెంటర్‌ను ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేయడంతోపాటు వారితో కలిసి పనిచేసేందుకు ఒప్పందం చేసుకోవడం జరిగింది. మనీలాకు చెందిన ఇంటర్నేషనల్ రైస్ రీసెర్చ్ ఇన్స్‌స్టిట్యూట్ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంతో గతంలో చెసుకున్న ఒప్పందం మేరకు సాటిలైట్ ఆధారిత వరి పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటుకు అవసరమైన ప్రయోగశాలను రూ.33 లక్షలతో ఏర్పాటు చేసేందుకు ఐఆర్ఆర్ఐ అధికారులు సంసిద్ధత వ్యక్తం చేశారు. అలాగే వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, ఎకనామిక్స్, స్టాటిస్టిక్ విభాగం అధికారులకు, వ్యవసాయ అధికారులకు ఐఆర్ఆర్ఐ ఆధ్వర్యంలో ఈ ఏడాది మార్చిలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ చర్చల్లో మనీలాలోని భారత రాయభార కార్యదర్శి ఎన్.రామకృష్ణన్, నఫ్లీ షియా, ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వ విద్యాలయం వైఎస్ ఛాన్సలర్ దామోదర్ నాయుడు, రీసెర్చ్ డైరెక్టర్ ఎన్.వి. నాయుడు, సాయిల్ సైంటిస్ట్ ప్రసూనరాణి, అంతర్జాతీయ వరి పరిశోధనా సంస్థ శాస్త్రవేత్త జానయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ రంగాన్ని కాపాడండి

వైకాపా నేత మల్లాది విష్ణు వినతి పత్రం




అమరావతి, ఆంధ్రప్రభ : 2019-19 ఆర్థిక సంవత్సరానికి డిస్కంల రెవెన్యూ లోటు రూ. 8 వేల కోట్లకు చేరిందని, రాబోయే రోజుల్లో విద్యుత్ రంగం ప్రమాదపుటంచులకు వెళ్తుందని వైయస్సార్ కాంగ్రెస్ నేత మల్లాది విష్ణు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాభిప్రాయ సేకరణలో భాంగా బుధవారం విజయవాడలో ఏపీఆర్సీ నిర్వహించిన సమావేశంలో ఆయన ఏపీఈఆర్సీ ఛైర్మన్ జస్టిస్ బి భవానీప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ సంవత్సరంలో కూడా విద్యుత్ రంగం భారీ నష్టాల్లోకి వెళ్తుందని నిపుణులు చెబుతున్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. ఈ ఆర్థికపరమైన నష్టాలను ప్రజల మీదకు నెట్టేందుకు భారీ టారీఫ్‌లను అమలు చేయడం తప్ప మరో మార్గం లేదన్నారు. ఈ ఏడాదితోపాటు గత రెండేళ్ల నుండి వచ్చిన నష్టాలను ప్రజలపై మోపడం సరికాదన్నారు. ప్రస్తుతం విద్యుత్ రంగంలో నెలకొన్న సమస్యల నేపథ్యంలో విద్యుత్‌కంపెనీలు చీకట్లోకి నెట్టబడుతున్నాయన్నారు. రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో కేంద్రీకృతమైఉన్న అనేక గ్యాస్ ఆధారిత విద్యుత్‌ప్లాంట్లు ప్రస్తుతం గ్యాస్ కొరతతో నిరుపయోగంగా పడిఉన్నాయని చెప్పారు. ఖాళీగా పడి ఉన్న ఈ ప్లాంట్లు ప్రస్తుత పరిస్థితుల్లో భారమైనవిగానే పరిగణించాల్సి ఉంటుందన్నారు. ఇది రాష్ట్ర ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలమూలంగానే జరిగిందని చెప్పారు. ఈ పరిస్థితుల్లో కమిషన్ రాష్ట్ర విద్యుత్ రంగ ఆర్థిక పరిస్థితిపై సమగ్రమైన అధ్యయనం చేసి ప్రజలకు అను గుణంగా ఉండే నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర విభజ న జరిగి మూడున్నరేళ్లు కావస్తున్నా ఏపీఈఆర్సీ హైదరాబాద్ కేంద్రంగా నడవడం వల్ల వినియోగదారులు ఫిర్యాదులు చేయడం కష్టంగా మారిందన్నారు. అన్ని ప్రభుత్వ శాఖలు అమరావతి కేంద్రంగా తమ కార్యకలాపాలను నిర్వ హిస్తున్న నేపద్యంలో ఏపీఈఆర్సీ కూడా తమ కార్యకలా పాలను అమరావతి కేంద్రంగా ప్రారంభించి వినియోగ దారులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఏపీ డీజీపీకి అభ్యంతరాలును చెప్పండి

• పదోన్నతి పొందిన సీఐలకు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : చట్టంలో లేని రాయితీలను కోర్టులు అనుమతించలేవని హైకోర్టు స్పష్టం చేసింది. సీఐలుగా స్థాయిని పెంచిన తేదీనే ప్రాతిపదికగా తీసుకొని సీనియారిటీని లెక్కించాలని అభ్యర్థిస్తూ ఏడు రోజుల్లోగా ఏపీ డీజీపీకి వినతిపత్రం సమర్పించాలని హైకోర్టు రాయలసీమ ప్రాంతానికి చెందిన 26 మంది పోలీసు సర్కిల్ ఇన్ స్పెక్టర్లకు హైకోర్టు సూచించింది. అలాగే ఆ సీఐల విన్నపాన్ని ఏకీకృత సీనియారిటీ జాబితాను ఖరారు చేయకముందే పరిశీలించాలని కూడా హైకోర్టు డీజీపీని ఆదేశించింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ కె.విజయలక్ష్మితో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. ఈ సీఐలు 1993 నుంచి రాయలసీమ జిల్లాల్లోని 26 అర్బన్ పోలీసు ఠాణాల్లో ఎస్ఐలుగా విధులు నిర్వర్తిస్తున్నారు. అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వం ఆ 26 ఠాణాల స్థాయిని పెంచాలని నిర్ణయించింది. అలాగే ఠాణాల్లో ఎస్‌హెచ్‌వోలుగా విధులు నిర్వర్తిస్తున్న ఎస్ఐలను కూడా సీఐలుగా స్థాయిని పెంచింది. దీంతో సీఐల సీనియారిటీ జాబితాను రూపొందించడంలో పలు మార్పులు చేర్పులు చోటుచేసుకున్నాయి. సీఐల పదోన్నతుల ప్రాథమిక జాబితాను తేది.8-11-2017న డీజీపీ సిద్ధం చేశారు. కానీ తదనంతరం ఆ జాబితాను ఉపసంహరించుకున్నారు. ఆ తర్వాత మళ్లీ తేది.28-12-2017న ఏకీకృత సీనియారిటీ జాబితాను విడుదల చేశారు. దీనిపై అభ్యంతరాలను కూడా ఆహ్వానించారు. అయితే ఆ 26 మంది సీఐల పేర్లు పదోన్నతుల జాబితా లేవు. పదోన్నతుల జాబితాలో పేర్లు లేని 26 మంది సీఐల తరపున సీనియర్ న్యాయవాది సీవి.మోహన్ రెడ్డి వాదనలు వినిపిస్తూ.. పదోన్నతుల జాబితా వ్యవహారంలో పిటిషనర్లకు వ్యతిరేకంగా వ్యవహరించిన డీజీపీకి కాకుండా రాష్ట్ర ప్రభుత్వానికి వినతి పత్రం సమర్పించేలా ఆదేశాలు జారీ చేయాలని అభ్యర్థించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. డీజీపీ సంబంధిత అధికారి స్పష్టం చేసింది. అందువల్ల డీజీపీ కే ఏడు రోజుల్లోగా వినతి పత్రం సమర్పించాలని ఆదేశించింది. అలాగే ఏకీకృత పదోన్నతుల జాబితాను సిద్ధం చేసే సమయంలో ఆ సీఐల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని ధర్మాసనం డీజీపీని ఆదేశించింది. సీఐ పదవి డీఎస్పీలుగా పదోన్నతి పొందేందుకు కనీస అర్హతగా భావిస్తారు.

కర్నూలు చెన్నపట్నం కోటలో...



కర్నూలు జిల్లా తుగ్గలి మండలంలోని చెన్నంపల్లి కోటలో ఏ ఖనిజాలున్నాయో చెప్పాలని హైకోర్టు ఏపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు ఏపీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ కె.విజయలక్ష్మి తో కూడిన ధర్మాసనం మంగళవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ మూడు వారాలకు వాయిదా వేసింది. ఈ సందర్భంగా ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ ..ఆ కోటలో తవ్వకాలు జరుగుతున్నాయన్నారు. అయితే ఈ తవ్వకాలు భారత భూగర్భ, పరిశోధన శాఖ అనుమతితోనే ఈ తవ్వకాలు జరుగుతున్నాయని తెలిపారు. దీనిపై స్పందించిన ధర్మాసనం ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఏపీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం లోని చెన్నంపల్లి కోట సమీపంలో గుప్త నిధుల కోసం జరుగుతున్న తవ్వకాలను నిలువరించేలా , చారిత్రాత్మక కట్టడమైన కోటను కాపాడేలా ఏపీ ప్రభుత్వాన్ని ఆదేశించాలని అభ్యర్థిస్తూ రాసిన లేఖను హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యంగా పరిగణించింది. కర్నూలు తుగ్గలి మండల పరిధిలోని కోట వద్ద గుప్త నిధుల కోసం జరుగుతున్న తవ్వకాలను నిలువరించి, కోటను కాపాడాలని కోరుతూ కర్నూలు(దూపాడు)కు చెందిన డాక్టర్ బ్రహ్మారెడ్డి ఉమ్మడి హైకోర్టుకు లేఖ రాశారు. ఓ ప్రముఖ దినపత్రికలో ప్రచురించిన వార్తా కథనం ఆధారంగా రాసిన ఆ లేఖను హైకోర్టు ప్రజాహిత వ్యాజ్యంగా పరిగణించింది. ఆ పత్రిక కథనం ప్రకారం ఏపీ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకే తవ్వకాలు జరుపుతున్నట్లు అధికారులు చెబుతున్నారని డాక్టర్ బ్రహ్మారెడ్డి రాసిన లేఖలో పేర్కొన్నారు. ఆ లేఖను ప్రజాహిత వ్యాజ్యంగా పరిగణించాలని హైకోర్టు పిల్ కమిటీ సిఫారసు చేసింది. దీంతో హైకోర్టు రిజిస్ట్రీ ప్రజాహిత వ్యాజ్యంగా పరిగణించిన విషయం తెలిసిందే.

పీఎఫ్, ఈఎస్ఐ సౌకార్యాన్నివ్వండి

అమరావతి, ఆంధ్రప్రభ: ఎస్ఎస్ఎలోని ఉద్యోగులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని ఏపీ సర్వశిక్షా అభియాన్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కోరింది. గత సంవత్సరం ఆగస్టు నెల నుంచి ఉద్యోగుల వేతనాల్లో రికవరీ చేసినా ఉద్యోగుల వాటా ఈపీఎఫ్ 12 శాతం, ఈఎస్ఐ 1.75 శాతం సంబంధించిన మొత్తాన్ని ఉద్యోగుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాలలోకి జమ చేయాలని రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేయడం సరైనది కాదని, ఉద్యోగుల సమాఖ్య గౌరవాధ్యక్షుడు ఏవి.నాగేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షుడు ఎం.బాలకాశి, రాష్ట్ర కార్యదర్శి బి.కాంతారావు పేర్కొన్నారు. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ఎస్ఎస్ఎ జెఎసి డిమాండ్ చేస్తున్నదని తెలిపారు. గత ఆరు నెలలుగా ఉద్యోగుల వేతనాల నుంచి పీఎఫ్, ఈఎస్ఐ కంట్రిబ్యూషన్‌ను మినహాయించారని, పీఎఫ్‌కు జమ చేయకుండా చట్ట వ్యతిరేకంగా వ్యవహరించడం సరైంది కాదన్నారు.

పవన్ పర్యటనను అడ్డుకుంటాం

• 15న పవన్ దిష్టిబొమ్మలు దగ్ధం • 21న మన్యం బంద్, ఛలో శ్రీకాకుళం ర్యాలీ • గిరిజన ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు కె.వివేక్ వినాయక్



విశాఖపట్నం, ప్రభన్యూస్ బ్యూరో: మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు అనుకూల ప్రకటనలు చేయడంతో పాటు మ్యానిఫెస్టోలో టీడీపీ పొందుపరిచినందున వారికి తక్షణమే రిజర్వేషన్లు కల్పించాలని కోరుతున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్ తన వ్యాఖ్యలను ఈనెల 10 లోపు ఉపసంహరించుకోకపోతే శ్రీకాకుళం పర్యటనను అడ్డుకుంటామని గిరిజన ఐక్యవేదికజాతీయ అధ్యక్షుడు వివేక్ వినాయక్‌హెచ్చరించారు. ఎంవిపికాలనీలో గల గిరిజన భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 70 ఏళ్ల ఆదివాసీల మనుగడకు తిరిగి పోరాడాల్సిన పరిస్థితులు ప్రభుత్వాలు కల్పిస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలకు తాము వ్యతిరేకం కాదని అయితే రాజకీయాలు చేసి బిసిలు, గిరిజనుల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం ఎవరూ చేయవద్దని ఆయన కోరారు. మత్స్యకారుల కోసం తెలుగుదేశం మాట్లాడటం లేదని మధ్యలో పవన్ కల్యాణ్ మత్స్యకార విషయంలో దూరి మ్యానిఫెస్టో పేరిట వారికి రిజర్వేషన్లు కల్పించాలని ఇప్పుడు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ విషయంపై పవన్ తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని లేని పక్షంలో పవన్ శ్రీకాకుళం పర్యటనను అడ్డుకుంటామన్నారు. ఈనెల 19, 21 మన్యం బంద్‌కు పిలుపునిచ్చామన్నారు. 11న రాష్ట్ర గిరిజన ఐక్యవేదిక కార్యవర్గం ప్రత్యేకంగా సమావేశమై తదుపరి భవిష్యత్ కార్యచరణ రూపొందిస్తామన్నారు. ఈనెల 12న శ్రీకాకుళం సీతమ్మపేట కొండ మీద గిరిదీక్ష పేరుతో ప్రత్యేక కార్యక్రమం చేస్తామన్నారు. ఈనిరసన అన్ని జిల్లాల్లో 20 వరకు కొనసాగుతుందన్నారు. 21న మన్యం బంద్‌తో పాటు ఐదే రోజు చలో శ్రీకాకుళం పేరుతో ఆదివాసీల గోడు వినిపించే విధంగా మహాసభలు నిర్వహిస్తున్నామన్నారు. పవన్ కల్యాణ్ మత్స్యకారులకు ఇచ్చిన మద్దతును వెనక్కి తీసుకోకపోతే 15న అన్ని జిల్లా ప్రధాన కార్యాలయాలలో పవన్ దిష్టిబొమ్మలను దగ్ధం చేస్తామన్నారు. 19న జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద నిరసన దీక్షలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం నేత రామలింగం, ప్రధాన కార్యదర్శి సింహాచలం నాయుడు, గిరిజన ఐక్య వేదిక నేతలు ఓ.రామ్మూర్తి, ఆర్.ఎస్.దొర, సత్యారావు, కొక్కుల రామారావు తదితరులు పాల్గొన్నారు.

దూర ప్రాంతాలకు 58 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రయాణికుల రద్దీ పెరగడంతో దక్షిణ మధ్య రైల్వే వివిధ దూర ప్రాంతాలకు 58 వీక్లీ ప్రత్యేక రైళ్లను నడిపించబోతుంది. చెన్నై - అహ్మదాబాద్ మధ్య 26, ముంబాయి - చెన్నై మధ్య 24, సాంత్రగచ్చి - చెన్నై మధ్యన 8 వీక్లీ రైళ్లను ప్రత్యేకంగా నడిపించబోతున్నామని ఒక ప్రకటనలో పేర్కొంది. ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో ఈ రైళ్లు వివిధ ప్రాంతాల నుండి బయలుదేరుతాయని వివరించింది. మార్గమధ్యలోని అన్ని ప్రధానమైన స్టేషన్లలో ప్రత్యేక రైళ్లను నిలుపుదల చేయడం జరుగుతుంది.

హైదరాబాద్ - కాకినాడ మధ్యన ఈ నెల 9, 11 తేదీల్లో ప్రత్యేక రైళ్లను నడిపించబోతున్నారు. హైదరాబాద్ నుండి 9వ తేదీన ప్రత్యేక రైలు కాకినాడకు బయలుదేరనుంది. తిరుగు ప్రయాణంలో కాకినాడలో 11న బయలుదేరి మరుసటి రోజు హైదరాబాద్‌కు చేరుకుంటుంది.

హైదరాబాద్ డివిజన్‌లో కొనసాగుతున్న ఆకస్మిక తనిఖీలు

దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలోని హైదరాబాద్ డివిజన్‌లో ఆకస్మిక తనిఖీలు కొనసాగుతున్నాయి. బుకింగ్ కార్యాలయాలు, రిజర్వేషన్ కార్యాలయాలు, పార్శిల్ ఆఫీసుల్లో అక్రమాలను నివారించే విధంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. రైళ్లలో కూడా ప్రత్యేక తనిఖీ బృందాలు తనిఖీలు నిర్వహిస్తు ప్రయాణికుల సౌకర్యాలను పరిశీలించడం జరుగుతుంది. ఇప్పటి వరకు 142 అకస్మిక తనిఖీలు నిర్వహించారు. అవినీతి రహిత ప్రయాణికుల సేవలకు తనిఖీల్లో అధిక ప్రాధాన్యతను ఇస్తున్నారు. ప్రయాణికులు ఫిర్యాదులు చేయడానికి 155210 నెంబర్‌ను వినియోగించుకోవాలని తనిఖీ అధికారులు కోరుతున్నారు.

ఎల్ఇడీలతో వెలిగిపోతున్న ద.మ.రైల్వే

దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని అన్ని స్టేషన్‌లో 100 శాతం ఎల్ఇడి బల్బులను ఏర్పాటు చేశారు. ఈ విధంగా పూర్తి స్థాయిలో ఎల్ఇడి బల్బులను ఏర్పాటు చేయడం భారత రైల్వేలలో దక్షిణ మధ్య రైల్వే అగ్రగామిగా ఉంది. ఇంధన పొదుపులో దక్షిణ మధ్య రైల్వే రికార్డు సమయంలో ప్రగతిని సాధించింది. జోన్ పరిధిలోని అన్ని కార్యాలయాలు, స్టేషన్లలో పూర్తి స్థాయిలో ఎల్ఇడి లైట్లను అమర్చిన అధికారులు, సిబ్బందిని జనరల్ మేనేజర్ వినోద్ కుమార్ యాదవ్ అభినందించారు.

జోన్ పరిధిలోని 733 రైల్వే స్టేషన్లలో ఎల్ఇడి బల్బులను అమర్చడం జరిగింది. ఎల్ఇడి బల్బులను అమర్చడానికి 75,681 పాత బల్బులను తొలగించారు. సికింద్రాబాద్ డివిజన్‌లో 162 స్టేషన్లు, హైదరాబాద్‌లో 100, విజయవాడలో 158, గుంతకల్‌లో 157, గుంటూరులో 76, నాందేడ్ డివిజన్ పరిధిలోని 80 స్టేషన్లు ఎల్ఇడి బల్బులతో వెలిగిపోతున్నాయి. ఎల్ఇడి బల్బులను అమర్చడంతో 32 లక్షల యూనిట్ల విద్యుత్‌ను ఆదా చేయడం జరుగుతుంది. ఏటా రూ. 270 లక్షల వ్యయం తగ్గుతుంది.

ఆంధ్రప్రభ
గురువారం 8 ఫిబ్రవరి 2018

నేటి బంద్‌ను జయప్రదం చేయండి

● అన్ని రాజకీయ పార్టీలు కలిసి రావాలి ● చంద్రబాబు డ్రామాలు ఆపి బంద్‌కు మద్దతు తెలపాలి ● ఏపీ పట్ల శత్రుత్వ వైఖరిని ప్రదర్శిస్తున్న కేంద్రం: సీపీఎం మధు, మల్లాది విష్ణు, పీడీఎఫ్ ఎమ్మెల్సీలు

అమరావతి, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్‌తోపాటు విభజన హామీలపట్ల కేంద్ర వైఖరిని నిరసిస్తూ వామపక్షాలు చేపట్టిన బంద్‌కు పూర్తి మద్దతు తెలుపుతున్నట్లు నాన్ పొలిటికల్ జేఏసీ పేర్కొంది. బుధవారం విజయవాడలో నాన్ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు అప్పికట్ల శ్రీహరి నాయుడు అధ్యర్యంలో జరిగిన సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి. మధు, వైసీపీ నేత మల్లాది విష్ణు, పీడీఎఫ్ ఎమ్మెల్సీలు బొడ్డు నాగేశ్వరావు, వై శ్రీనివాసులు రెడ్డి, రాము సూర్యారావు, వి. బాలసుబ్రమణ్యం, కొలను కొండ శివాజీ, కాపు నాయకుడు కటారి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ కె. లక్ష్మణరావు తదితరులు పాల్గొని కేంద్రంపై మండిపడ్డారు. ఈసమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి పి. మధు మాట్లాడుతూ విభజన హామీల అమలు విషయంలో కేంద్రానికి చిత్తశుద్ధి లేదని, ముఖ్యమంత్రి చంద్రబాబు డ్రామాలు ఆపి బంద్‌కు మద్దతు తెలపాలన్నారు. సింగపూర్ లాంటి రాజధాని కడతామని ప్రగల్భాలు పలుకుతున్నారని, బీజేపీ, టీడీపీ నేతలు ప్రకటనలకే పరిమితమయ్యారన్నారు.

బంద్‌కు టీడీపీ మద్దతు ప్రకటించాలి - సీఎంకు రామకృష్ణ లేఖ

అమరావతి, ఆంధ్రప్రభ బ్యూరో: రాష్ట్రానికి 44 మాసాలుగా కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అన్యాయంపై, కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధుల కేటాయింపులకు నిరసనగా 8వ తేదీన వామపక్షాలు బంద్‌కు పిలుపునివ్వడం జరిగిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ముఖ్యమంత్రి చంద్రబాబుకి రాసిన లేఖలో పేర్కొన్నారు. బంద్‌ను ప్రతిపక్షపార్టీ వైసీపీ, కాంగ్రెస్ పార్టీలు బలపరిచాయని, రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టు సంఘాలు, ప్రజాసంఘాలు, ట్రేడ్ యూనియన్లు, విద్యార్థి, యువజన సంఘాలు, లారీ యజమానుల సంఘం, ముస్లిం ఐక్యవేదిక, ఉత్తరాంధ్ర చర్చావేదిక, రాయలసీమ ప్రజాసమితి తదితర సంఘాలన్నీ బంద్‌కు మద్దతు ప్రకటించి ప్రత్యక్షంగా పాల్గొంటున్నాయని రామకృష్ణ తెలిపారు. ఈ నేపథ్యంలో టీడీపీ కూడా బంద్‌కు మద్దతు ప్రకటించి కేంద్ర నిర్లక్ష్యంపై నిరసన తెలియజేయాలన్న అవసరం ఎంతో ఉందన్నారు. కేంద్రంపై ఉమ్మడి పోరాటం చేయాల్సిందిపోయి తెలుగుదేశం, వైసీపీ పార్టీలు రెండూ ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకోవడానికి ఇది సరైన సమయం కాదన్నారు. ఇది సరైన సమయంగా భావించి బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలపాలని లేఖలో కోరారు.

వైసీపీ నేత మల్లాది విష్ణు మాట్లాడుతూ పోరాటం ఇక్కడ కాదు ఢిల్లీలో చేయాలని ముఖ్యమంత్రి నిస్సిగ్గా మట్లాడుతున్నారని, నాలుగు సంవత్సరాలు పూర్తికావస్తున్నా టిడిపి ఎంపీలు ఏమి పగల తీసారని మండిపడ్డారు. అనంతరం పీడీఎఫ్ ఎమ్మెల్సీలు బొడ్డు నాగేశ్వరావు, వై శ్రీనివాసులు రెడ్డి, రాము సూర్యారావు, వి. బాలసుబ్రమణ్యం, కొలను కొండ శివాజీ, కాపు నాయకుడు కటారి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈబంద్‌కు ఇతర రాజకీయపార్టీల తోపాటు తెలుగుదేశం పార్టీకూడా మద్దతు తెలిపి ప్రజల పక్షాన నిలబడాలన్నారు. ఒక పక్క ప్రతిపక్షనేత జగన్, సీపీఐ, సీపీఎం పార్టీలు పోరాటం చేస్తుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు మాత్రం విదేశీ పర్యటనలు చేస్తున్నారని, ఇప్పటికైనా చంద్ర బాబు డ్రామాలు మానుకోవాలన్నారు. ఈబంద్‌లో ప్రజలు, ప్రజా సంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక వర్గాలు స్వచ్ఛందంగా పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

రాష్ట్ర బంద్‌కు పటిష్ట బందోబస్తు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్ర బడ్జెట్‌లో జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ గురువారం వామపక్ష పార్టీలు, ఇతర ప్రజా సంఘాలు బంద్‌కు పిలుపునివ్వడంతో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. రాష్ట్ర బంద్ విషయంలో ఇతర పార్టీలు, వివిధ సంఘాలు మద్దతు ఉండటంతో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అవసరమైన చర్యలు పోలీసు శాఖ చేపట్టింది. ఎక్కడా ఏ విధమైన అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక బలగాలను తరలిస్తున్నారు. సమస్యాత్మక ప్రాంతాలకు అదనపు బలగాలను తరలించడంతో పాటు బందోబస్తులో హింసాత్మక ఘటనలు నిలువరించేందుకు వీడియో కెమెరాలు, బాడీవోన్ కెమెరాలు సిద్ధం చేశారు. చిన్నపాటి ఘర్షణలు కూడా చోటు చేసుకోకుండా నిలువరించేందుకు అవసరమైన బందోబస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర డీజీపీ డాక్టర్ ఎం.మాలకొండయ్య జిల్లాల ఎస్పీలను, ఇతర ఉన్నతాధికారులను ఆదేశించారు. కొద్ది రోజుల కిందట పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి ఏ విధమైన కేటాయింపులు జరపలేదు. కేంద్ర ప్రభుత్వ చర్యను అధికార తెలుగుదేశం పార్టీ సహా అన్ని పక్షాలు, సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వ చర్యను నిరసిస్తూ అధికార తెలుగుదేశం పార్టీ పార్లమెంటును వేదికగా చేసుకొని ఆందోళన చేపట్టగా...వామపక్ష పార్టీలు గురువారం రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చాయి. వీరి బంద్‌కు ఇతర పార్టీలు, సంఘాలు కూడా మద్దతు ప్రకటించడంతో పోలీసు యంత్రాంగం పూర్తి స్థాయిలో అప్రమత్తమైంది. అన్ని వైపుల నుంచి బంద్‌కు మద్దతు ఇవ్వడం మూడున్నరేళ్ల కాలంలో ఇదే తొలిసారి. నిర్వాహకులు కూడా బంద్‌ను విజయవంతం చేయడాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. తాము చేపట్టిన బంద్‌ను విజయవంతం చేయడం ద్వారా కేంద్ర ప్రభుత్వ చర్యను ప్రజల్లోకి తీసుకెళ్లాలనేది నిర్వాహకుల వ్యూహం. ఇదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందనే సంకేతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నిర్వాహకులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇతర పక్షాల నుంచి కూడా గట్టి మద్దతు లభించడంతో తాము అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చునేది నిర్వాహకుల నిశ్చితాభిప్రాయం. ఈ దృష్ట్యా అన్ని పక్షాలు బంద్‌ను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని విధ్వంసక చర్యలకు పాల్పడే అవకాశాలు లేకపోలేదని పోలీసు వర్గాల అభిప్రాయం. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు నష్టం కలిగించేందుకు అసాంఘిక శక్తులు ప్రయత్నించొచ్చనే నిఘా వర్గాల సమాచారం మేరకు అన్ని జిల్లాల్లో పోలీసు అధికారులు అప్రమత్తమయ్యారు. ఆయా జిల్లాల్లో బంద్‌కు అధిక మద్దతు లభించే ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక బలగాలను తరలిస్తున్నారు. జిల్లా ప్రధాన కేంద్రాల్లో రాపిడ్ యాక్షన్ ఫోర్స్ బృందాలను సిద్ధం చేశారు. బంద్ సమయంలో విధ్వంసక చర్యలను చిత్రీకరించేందుకు వీడియో, బాడీవోన్ కెమెరాలను వినియోగించాలని అధికారులు నిర్ణయించారు.


నేడు ప్రజా సంకల్పయాత్ర నిలుపుదల

అమరావతి, ఆంధ్రప్రభ: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చేపట్టిన ప్రజా సంకల్ప యాత్ర గురువారం నిలుపుదల చేస్తున్నట్లు ఆపార్టీ బుధవారం నాడొక ప్రకటనలో తెలిపింది. రాష్ట్ర విభజన తరువాత ఆంధ్రప్రదేశ్‌కు జరుగుతున్న అన్యాయాలను వ్యతిరేకిస్తూ, ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనకు మద్దతుగా నేడు జరుగుతున్న వామపక్షాల బంద్ పిలుపుకు వైయస్సార్‌కాంగ్రెస్ పార్టీ తన విధానంలో భాగంగా సంఘీభావం ప్రకటించిందని సంగతి విదితమే. ఈనేపథ్యంలో నేటి బంద్‌కు మద్దతుగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్ మోహన్ రెడ్డి తన ప్రజా సంకల్ప యాత్రను నిలుపుదల చేస్తున్నట్లు ఆపార్టీ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాలకోసం ప్రజలంతా ఒక్కటిగా నిలబడాలని, నేటి బంద్‌ను విజయవంతం చేయాలని పార్టీ కోరింది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆస్తుల వద్ద ప్రత్యేక బలగాలతో పికెట్లు నిర్వహిస్తున్నారు. ఆర్టీసీ, రైల్వే ఆస్తులకు ఏ విధమైన నష్టం కలగకుండా చూడాలంటూ ఇప్పటికే ఎస్పీలకు ఉన్నతస్థాయి ఆదేశాలు వెళ్లాయి. ఆయా జిల్లాల్లో బంద్‌కు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు పోలీసు ప్రధాన కార్యాలయానికి అందజేయాలంటూ తగిన ఆదేశాలు జారీ చేశారు. అన్ని పక్షాలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న రాష్ట్ర బంద్‌కు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు యంత్రాంగాన్ని సమాయత్తం చేసినట్లు పోలీసు ఉన్నతాధికారులు చెపుతున్నారు.

బంద్ అవాంఛనీయం

● అప్రమత్తం, అనివార్యం
● అసాంఘిక శక్తులతో భద్రం... డీజీపీతో ముఖ్యమంత్రి
● వామపక్షాలది ద్వంద్వ నీతి
● రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టండి...
● టీడీపీ శ్రేణులకు సీఎం పిలుపు



అమరావతి, ఆంధ్రప్రభ : నేడు రాష్ట్ర బంద్ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఇందుకు సంబంధించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికార యంత్రాంగానికి నిర్దిష్టమైన ఆదేశాలు జారీ చేశారు. బుధవారం కూడా ఆయన రాష్ట్ర హోంశాఖ, పోలీసు ఉన్నతాధికారులకు తాజా పరిస్థితులపై చర్చించారని సమాచారం. అదే విధంగా అందుబాటులో ఉన్న పార్టీ సీనియర్‌లతోనూ ఇదే విషయమై మాట్లాడారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాల్సిందిగా ముఖ్యమంత్రి రాష్ట్ర డిజిపి మాలకొండయ్యను ఆదేశించారు. గత రాత్రి కూడా శాంతి భద్రతల అంశంపై గట్టి ఆదేశాలిచ్చిన ముఖ్యమంత్రి బుధవారం కూడా బంద్ పిలుపు పరిణామాలపై ఆరా తీశారు. బంద్ పిలుపును తప్పుపట్టిన ముఖ్యమంత్రి, ఇదే సమయంలో సంఘ విద్రోహ శక్తులు వల్ల ముప్పు వాటిల్లితే బాధ్యులెవరని ప్రశ్నించారు. బాధ్యతా రాహిత్యంగా వామపక్షాలతో సహా ఇతర రాజకీయ పార్టీలు కూడా కేంద్రం లో ఆందోళన కార్యక్రమాలు చేపట్టకుండా, రాష్ట్రంలో బంద్‌లు అంటూ హడావిడి చేయడాన్ని తప్పు పట్టారు. ఇదే విషయాన్ని ముఖ్య మంత్రి డిజిపి వద్ద కూడా ప్రస్తావించి అసాంఘిక శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. బంద్ ప్రభావం ఉండే ప్రాంతాల్ని గుర్తించాలని, అదనపు పోలీసు బలగాల్ని నియమించాలని ముఖ్యమంత్రి డిజిపిని ఆదేశించారు. ముందస్తు చర్యలు తీసుకోవడంలో సమర్థవంతంగా వ్యవహరించాలని, గొడవలను ప్రోత్సహించే వామపక్ష, ఇతర పార్టీల నేతల పట్ల జాగ్రత్తగా ఉండాలంటూ ముఖ్యమంత్రి హోంశాఖకు, డిజిపికి దిశానిర్దేశం చేశారు. గత రాత్రి కూడా ఇదే అంశమై డిజిపితో మాట్లాడిన ముఖ్యమంత్రి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు కూడా మరోవైపు ఉపముఖ్య మంత్రి నిమ్మకాయల చినరాజప్పతోను ముఖ్య మంత్రి బంద్ పై చర్చించారు. బంద్ రోజున తాను దుబాయ్ పర్యటనలో ఉంటున్నందు వల్ల అప్రమత్తంగా ఉండాల్సిందిగా డిప్యూటి సీఎం(హోం)ను కోరారు.

వామపక్షాలపై ఆగ్రహం ..

కాగా కేంద్రంలో ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన అన్యాయంపై వామపక్షాలు ఎక్కడా నిలదీసిన సంఘటనలు కూడా లేవని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. అలాంటిది రాష్ట్రంలో బంద్‌లు అంటూ ప్రజలను అసౌకర్యానికి గురి చేసే ప్రయత్నాలకు దిగడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. బడ్జెట్‌ను వ్యతిరేకించినట్లయితే, ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరుగుతుందని భావించిన పక్షంలో ఢిల్లీలో ఆందోళన ఎందుకు చేయడం లేదని ముఖ్యమంత్రి సూటిగా ప్రశ్నించారు. ఇది ద్వంద్వ నీతికి నిదర్శనం కాదా అన్నారు. బంద్ మాటున అసాంఘిక శక్తులు పేట్రగితే వామపక్ష, ఇతర రాజకీయ పార్టీలదే బాధ్యత అని అన్నారు. కేంద్రంలో ఒక తీరుగా, రాష్ట్రంలో మరో తీరుగా వామపక్షాలు అనుసరిస్తున్న తీరును ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. కేంద్రం ఇచ్చిన హామీలు అమలుకాకపోవడంతో రాష్ట్ర ప్రజలు ఇప్పటికే ఇబ్బందులు పాలవుతున్నారని, బంద్ పేరుతో మరిన్ని ఇబ్బందులకు గురిచేయవద్దని కోరారు. బడ్జెట్‌తో రాష్ట్ర ప్రజల్లో అసంతృప్తి ఏర్పడిందని, పునర్విభజన చట్టం అమలుకాక మరిన్ని ఇబ్బందులు సృష్టించారని అన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు సవ్యంగా కొనసాగే విధంగా సహకరించాలని రాజకీయ పార్టీలను, ప్రజలను కోరారు.

నిరసనలకు పిలుపు ..

గురువారం రాష్ట్ర వ్యాప్తంగా బడ్జెట్‌కు వ్యతిరేకం గా నిరసన ప్రదర్శన నిర్వహించాల్సిందిగా ముఖ్యమంత్రి టిడిపి శ్రేణులకు పిలుపునిచ్చారు. శాంతియుతంగా ప్రదర్శనలు నిర్వహించి ఏపీకి జరిగిన అన్యాయంపై నినాదించాలని పిలుపు నిచ్చారు. అదే విధంగా విభజన హామీల అమలులో నిర్లక్ష్యంపై, పోలవరం ప్రాజెక్టు అమరావతి నిధులు, ఇతర పథకాలకు సంబంధించి ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని రాష్ట్ర, జిల్లా, క్షేత్రస్థాయి కేడర్‌ను కోరారు. ఇప్పటికే పార్లమెంట్ స్థాయిలో చేస్తున్న ఆందోళన కార్యక్రమాలతో కేంద్రంలో కదలిక వచ్చిందని అభిప్రాయపడుతున్న ఇక క్షేత్రస్థాయిలో కూడా రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై ప్రజల్లోకి వెళ్ళాలని ముఖ్యమంత్రి పిలుపు నిచ్చారు.

పోరాటం చేయండి.. బంద్ విరమించండి: మంత్రులు అచ్చెన్నా, ఆనందబాబు



అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రానికి అన్యాయం జరిగిన చోటే పోరాటం చేయాలని బంద్‌ను విరమించాలని మంత్రులు అచ్చెన్నాయుడు, నక్కా ఆనందబాబు కోరారు. కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం జరిగిందని వామపక్షాలు ఇచ్చిన రాష్ట్రబంద్ పిలుపుపై పునరాలోచన చేసి బంద్ విరమించాలని ప్రభుత్వం తరపున వారు విజ్ఞప్తి చేశారు. సమస్య న్యాయమైనదేననీ, అయితే ఈ అంశంపై పార్లమెంటులో కలిసి రావాలని కోరారు. సచివాలయం నాలుగో బ్లాక్ పబ్లిసిటీ సెల్‌లో బుధవారం మంత్రులు మీడియాతో మాట్లాడారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రాష్ట్రం మూడున్నరేళ్ల చంటిబిడ్డ అని, చిన్నపిల్లలను ఎలా చూసుకుంటారో అలా రాష్ట్రాన్ని చూసుకోవాలన్నారు. నష్టాల్లో ఉన్న రాష్ట్రంలో బంద్ చేయడం వల్ల మనకే నష్టం జరుగుతుందన్నారు. వామపక్షాలకు ఇక్కడ శాసనసభలో ప్రాతినిధ్యం లేకపోయినా పార్లమెంటులో వారి సభ్యులు ఉన్నందున కేంద్రంపై ఢిల్లీలో పోరాడాలన్నారు. ఈ అంశంలో ప్రధాని కల్పించు కున్నప్పటికీ స్పష్టమైన హామీ ఇచ్చే వరకు తమ పోరాటం ఆగదని చెప్పారు. మిత్రపక్షంగా ఉంటూ కేంద్రంపై ఈ విధమైన ఆందోళన చేయడం దేశంలో తాము మొదటిసారి చూస్తున్నామన్నారు. ఢిల్లీలో తమ ఎంపీలతో కలిసి ఆ ఆందోళనకు మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. బంద్ వల్ల రాష్ట్రానికి నష్టమేకాకుండా, ప్రజలు ఇబ్బందులు పడతారని, అందువల్ల వామపక్షాలు, ఇతర పార్టీలు బంద్‌పై పునరాలోచన చేసి విరమించాలని అచ్చెన్నాయుడు కోరారు.

జాతీయ స్థాయిలో ప్రతిబింబించే విధంగా ఆందోళన..

మంత్రి ఆనందబాబు మాట్లాడుతూ ఎక్కడ అన్యాయం జరిగిందో అదే పార్లమెంటు వద్ద జాతీయస్థాయిలో ప్రతిబింబించే విధంగా ఆందోళన చేపట్టాలన్నారు. ప్రధాన మంత్రి, కేంద్ర ఆర్థిక మంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. హామీలు అమలు చేయమని అడగటం ఏపీ హక్కన్నారు. ఈ విషయంలో రాష్ట్రాన్ని విడదీసిన పార్టీలకు బాధ్యత ఉందని గుర్తు చేశారు. ఎన్డీఏలో టీడీపీ భాగస్వామిగా ఉన్నా ఆందోళనలు చేయడంలో వెనకాడేది లేదన్నారు. స్పష్టత వచ్చేవరకు పోరాటం చేస్తామన్నారు. ఏపీలో నిరసన తెలియజేసి ఢిల్లీలో కలిసి ఆందోళన చేస్తే ప్రయోజనం ఉంటుందన్నారు. మంచి మనసుతో ఆలోచన చేసి బంద్ విరమించుకోవాలని ఆనంద్‌బాబు కోరారు.

టీడీపీ ఎంపీలకు సంఘీభావంగా నేడు ప్రదర్శనలు - కళా వెంకట్రావు..

నవ్యాంధ్ర ప్రయోజనాల కోసం పార్లమెంటు వేదికగా విభజన చట్టంలోని అంశాలను అమలు చేయాలని, కేంద్ర బడ్జెట్‌లో జరిగిన అన్యాయాన్ని సవరించి, తగినన్ని నిధులను కేటాయించాలని, రైల్వే జోన్, ప్రాజెక్టుల కోసం పోరాటం చేస్తున్న టీడీపీ ఎంపీలకు సంఘీభావంగా గురువారం రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ ఆధ్వర్యంలో ప్లకార్డుల ప్రదర్శనలు, సభలు, సమావేశాలను నిర్వహిస్తున్నట్లు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కిమిడి కళావెంకట్రావు తెలియజేశారు.

ఆంధ్రులను మోసం చేసిన
మోడీ సర్కార్


మోకాళ్లపై నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నేతలు

అమరావతి, ఆంధ్రప్రభ: ఇటీవల ప్రకటించిన కేంద్ర బడ్జెట్ లో నవ్యాంధ్ర అభివృద్ధికి అవసరమైన కనీస నిధులను కూడా కేటాయించకుండా ఆంధ్రులను మోడీ ప్రభుత్వం మోసం చేసిందని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ విమర్శించారు. బుధ వారం రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం గుంటూరులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్రుల హక్కు అయిన ప్రత్యేక హోదాను ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం నాలుగేళ్లు గడిచాక హోదా కుదరదని, డొల్ల ప్యాకేజీ ప్రకటించి రాష్ట్ర ప్రజలను నయవంచనకు గురి చేసిందన్నారు. అలాగే విభజన చట్టంలోని హామీలన్నింటినీ కూడా నెరవేరుస్తామని గత నాలుగేళ్లుగా చెప్పిన మోడీ ప్రభుత్వం వారి చివరి బడ్జెట్‌లో కూడా వాటి ఊసే ఎత్తుక మరోసారి వంచనచేసిందని ధ్వజమెత్తారు. ఆంధ్రులకు ఇంత పెద్ద ఎత్తున అన్యాయం జరుగుతుంటే బీజేపీతో మిత్రబంధం ఉన్న టీడీపీ పాలకులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దారుణమన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజా ప్రయోజనాకు తిలోదకాలిస్తూ అధికార టీడీపీ, ప్రతిపక్షవైసీపీ వ్యవహరించడం తగదని, ఇప్పటికైనా తీరు మార్చుకొని 25 ఎంపీలు రాజీనామా చేయడం ద్వారా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నేతలు మస్తాన్ వలి, మక్కన మల్లికార్జునరావు, బిట్రగుంట మల్లిక, పర్వీన్, విజయ, లింగంశెట్టి ఈశ్వరరావు, జయరాంబాబు, శ్రీనివాసరెడ్డి, రోహిత్, అబ్దుల్ వహీద్, సురేష్, ఉస్మాన్, రత్తయ్య, జాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కత్తి సుబ్బారావు మృతి పట్ల సీపీఐ సంతాపం

అమరావతి, ఆంధ్రప్రభ బ్యూరో: దళిత నేత కత్తి పద్మారావు తండ్రి కత్తి సుబ్బారావు మరణంపట్ల సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణప్రగాఢ సంతాపం తెలిపారు.

6వ తేదిన తీవ్ర అస్వస్థతకు గురై సుబ్బారావు గుంటూరు జిల్లా పొన్నూరులో మరణించడం బాధాకరమని అన్నారు. వారి కుటుంబ సభ్యులకు సీపీఐ రాష్ట్ర సమితి తరపున ప్రగాఢ సానుభూతిని రామకృష్ణచెప్పారు.

ముద్దుకృష్ణమనాయుడు మృతి పట్ల సంతాపం..

మాజీ మంత్రి, ఎమ్మెల్సీ, టీడీపీ సీనియర్ నాయకులు గాలి ముద్దుకృష్ణమనాయుడు మరణంపట్ల రామకృష్ణప్రగాఢ సంతాపం తెలిపారు. ఎన్టీఆర్ హయాంలో రాష్ట్ర అటవీ, విద్యా, సమాచార శాఖల మంత్రిగా ముద్దుకృష్ణమనాయుడు బాధ్యతలు సమర్ధవంతంగా నిర్వర్తించారన్నారు. రాజకీయాలలో తనదైన శైలితో ఆయన రాజకీయ ప్రస్థానం సాగించారని కొనియాడారు. వారి కుటుంబ సభ్యులకు సీపీఐ తరపున ప్రగాఢ సానుభూతిని రామకృష్ణతెలిపారు.

ముద్దుకృష్ణమ మృతి తీరని లోటు

మాజీ మంత్రి గాలి ముద్దుకృష్ణమనాయుడు అకాలమృతికి మంత్రి నారాయణ సంతాపం తెలిపారు. ఆయనతో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్న మంత్రి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నానని చెప్పారు. ముద్దుకృష్ణమనాయుడు కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని నారాయణ తెలియచేశారు.

ఉద్యోగుల సమస్యలపై ఆందోళన తీవ్రతరం

● సీపీఎస్ రద్దుపై 10న జిల్లా కేంద్రాలలో మహాధర్నా
● కేంద్రానికి సంబంధించిందని చేతులు దులుపుకోవటం సరికాదు
● 25న జేపీసీ ఆధ్వర్యంలో భవిష్యత్ కార్యాచరణ: అశోక్‌బాబు

అమరావతి, ఆంధ్రప్రభ: ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళలను మరింత తీవ్రతరం చేస్తామని, సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్దరించేవరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తీవ్ర ఒత్తిడి తీసుకొస్తామని ఉద్యోగ సంఘాల జేఏసీ ఛైర్మన్ పి. అశోక్ బాబు తెలిపారు. బుధవారం విజయవాడ లోని ఏపీఎన్జీవో అసోసియేషన్ కార్యాలయంలో సీపీఎస్ రద్దుపై చేపట్టనున్న ధర్నా, ఉద్యోగుల డిమాండ్లపై జేఏసీ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్బంగా మీడియాతో మాట్లాడుతూ సీపీఎస్ విధానం రద్దుపై గతంలో మండల స్థాయిలో ధర్నాలు నిర్వహించామని, ఈనెల 10వ తేదీన 13 జిల్లాల కేంద్రాలలో ధర్నా కార్యక్రమం పెద్ద ఎత్తున చేపడుతున్నామన్నారు. సీపీఎస్ విధానం కేంద్రానికి చెందిందా, రాష్ట్రానికి చెందిందా అనే అంశాన్ని పక్కన పెట్టి ఉద్యోగుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పాత పెన్షన్ విధానాన్ని పునరుద్దరించాలన్నారు. కేంద్రానికి సంబంధించిన అంశమని చేతులు దులుపుకోవటం సబబుకాదని, కేరళ వంటి రాష్ట్రాలు సీపీఎస్ విధానం నుంచి బయటకి వచ్చేందుకు ఇప్పటికే కేంద్రానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. సీపీఎస్‌లో వెసులుబాటు విధానాలను కాకుండా పూర్తిస్థాయిలో పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగాలు చేరడంలో భవిష్యత్తుకు భరోసాతోపాటు పెన్షన్ వస్తుందనే ఉద్యోగాలలో చేరతారని, ప్రైవేటు ఉద్యోగాల వైపు ఆసక్తి కనబర్చరన్నారు. ఈనెల 25న ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో రాష్ట్రంతోపాటు ఉద్యోగులు ఎన్నో సాదక, బాధలను ఓర్చుకున్నారని, రాష్ట్ర విభజన వల్లే ఇప్పటివరకు పీఆర్సీ ఎరియర్స్ కూడా అందుకోని స్థితిలో ఉన్నామన్నారు. స్పష్టమైన నిర్ణయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి పరిష్కారం దిశగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని, ఏపీజేఏసీ జనరల్ బాడీ సమావేశంలో భవిష్యత్ నిర్ణయాలను స్పష్టం చేస్తామన్నారు. సీపీఎస్ విధానం అమలు చేస్తున్న రాష్ట్రాలకు భిన్నంగా ఏపీ ఉద్యోగులకు గ్రాట్యూటీ, ఫ్యామిలీ పెన్షన్‌లను అమలు చేయటం కొంత ఊరట కలిగించినప్పటికీ పూర్తిగా రద్దు చేసేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న అశోక్ బాబు

కేంద్రం ప్రకటించిన బడ్జెట్ ఉద్యోగులకు తీవ్ర నిరాశను కలిగించిందని, గతంలో ఆదాయ పన్ను చెల్లింపులో ఉద్యోగులకు శ్లాబ్ రేటు పెంచడం జరిగేదని అందుకు విరుద్ధంగా ఈసారి బడ్జెట్‌లో శ్లాబ్ రేటు పెంచకపోగా అదనపు భారం ఉద్యోగులపై వేయడం దారుణమన్నారు. దీనిని సవరించకుంటే ఉద్యోగుల నుంచి నిరసన ఎదురుకోక తప్పదన్నారు. సీపీఎస్ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి సీఎం దాస్ మాట్లాడుతూ 2004 నుండి ఇప్పటివరకు పదవీవిరమణ పొందిన, మరణించిన ఉద్యోగులు ఉన్నారని వారి కుటుంబ సభ్యులకు పెన్షన్ పొందే సౌకర్యం లేకపోవటంతో వీధిన పడ్డారన్నారు. రాష్ట్రంలో 1,86000 మంది సీపీఎస్ ఉ ద్యోగుల భవిష్యత్తు అగమ్యగోచరంగా ఉందని, నూతనపెన్షన్ విధానాన్ని రద్దు చేసేవరకు విశ్రమించేది లేదన్నారు. ఈసమావేశంలో ఏపీ జేఏసీ వైస్ ఛైర్మన్ బండి శ్రీనివాసరావు, జనరల్ సెక్రెటరీ ఎన్. చంద్రశేఖర్ రెడ్డి, కోఛైర్మన్ యు. కుళ్లాయప్పతోపాటు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు త్రిబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలి



విశాఖలో కలెక్టర్ కార్యాలయం ఎదుట శాంతియుత ప్రదర్శన

విశాఖపట్నం, ప్రభన్యూస్ బ్యూరో: నంద్యాల ఉప ఎన్నికలు సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జర్నలిస్టులకు ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని కోరుతూ బుధవారం విశాఖలో పలువురు జర్నలిస్టులు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట శాంతియుత నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జర్నలిస్టులంతా శాంతియుతంగా పాల్గొన్నారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ హామీని తక్షణమే ఆచరణలోకి తేవాలని వీరంతా ఆకాంక్షించారు.ఈ సందర్భంగా వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ, త్రీబెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించేందుకు రాష్ట్ర,జిల్లా స్థాయిలో హౌసింగ్ కమిటీలు ఏర్పాటు చేయాలని కోరారు. అక్రిడేషన్ జర్నలిస్టులు, వర్కింగ్ జర్నలిస్టులకు త్రిబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయింపులో జాప్యం లేకుండా చూడాలన్నారు. వీటితో పాటు వర్కింగ్ జర్నలిస్టులకు పిఎఫ్, ఇఎస్ఐ , పింఛన్ సదుపాయం కల్పించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉన్నతాధికారులకు వినతిపత్రం సమర్పించారు. నగర అధ్యక్షులు పి.నారాయణ్, బ్రాడ్‌కాస్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఇరోతి ఈశ్వరరావు, కార్యదర్శి సాంబశివరావు, ఫోటో జర్నలిస్టు అసోసియేషన్ ప్రతినిధులు పి.ఎన్.మూర్తి, తిరుపతిరావు, రాజా, నగేష్, గోపి, వీడియో జర్నలిస్టులు సూర్యతో పాటు ఫెడరేషన్ కార్యవర్గ సభ్యులు, ఆయా మీడియా సంస్థల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

'బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్‌పై చర్యలు తీసుకోవాలి'

అమరావతి, ఆంధ్రప్రభ: ఏపీ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ ఛైర్మన్ వేమూరి ఆనంద సూర్య పార్టీ అధిష్టానం పేరుతో నియోజకవర్గ, జిల్లా కో ఆర్డినేటర్ల వ్యవస్థను రద్దు చేయడం ద్వారా పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్లు ముక్త కంఠంతో పేర్కొన్నారు. బుధవారం గుంటూరులోని టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో బోర్డు డైరెక్టర్లు, కో ఆర్డినేటర్లు అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా నియమించిన బ్రాహ్మణ కార్పొరేషన్ 13 జిల్లాల, 175 నియోజక వర్గాల కో ఆర్డినేటర్ల వ్యవస్థను కనీసం డైరెక్టర్లకు చెప్పకుండా రద్దు చేయడం దారుణమన్నారు. అలాగే నియమ, నిబంధనల ప్రకారం బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సమావేశాలు జరపకుండా కార్పొరేషన్ తరపున ఏకపక్ష నిర్ణయాలను ఛైర్మన్ తీసుకుంటుండటం తీవ్ర ఆక్షేపనీయమని వ్యాఖ్యానించారు. ఏకపక్ష నిర్ణయాలతో, ఒంటెద్దు పోకడతో పోతున్న ఆనంద సూర్య ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌ఛార్జీల సిఫారసులను సైతం లెక్కచేయడం లేదని ఆరోపించారు. అదేవిధంగా కార్పొరేషన్ ఫలాల పంపిణీ కోసం డిఎల్‌ఓ, ఎంఎల్‌ఓ, ఎంసీఎల్ఓ అనే నూతన నామినేటెడ్ పదవులను సృష్టించి, పార్టీ బ్రాహ్మణ కార్యకర్తలకు ప్రాధన్యతను ఇవ్వక తనకు చెందిన రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘ నేతలను ఎంపిక చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.తక్షణమే అతనిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ముఖ్యమంత్రికి వినతి పత్రం అందిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్లు గుమ్మా నాగరాజు, దువ్వూరి సురేష్, యామిజాల నరసింహమూర్తి, నేపాక పద్మావతి, 13 జిల్లాల, నియోజకవర్గాల కో ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

దళిత సంక్షేమానికి
ప్రభుత్వం కృషి: మంత్రి ఆనందబాబు



అమరావతి, ఆంధ్రప్రభ: దళితజాతి అభ్యున్నతికి, వారి సంక్షేమానికి టీడీపీ ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనందబాబు వెల్లడించారు. బుధవారం గుంటూరులోని టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన దళితతేజం -తెలుగుదేశం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్ష మేరకు ప్రతి దళిత కుటుంబానికి నెలకు రూ.10 వేల ఆదాయం చేకూర్చేందుకు వినూత్నమైన సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతోందన్నారు. కేవలం దళిత సంక్షేమానికే వినియోగించేందుకు ఏర్పాటు చేసిన ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను గత తల్లి, పిల్ల కాంగ్రెస్ పాలకులు దారి మళ్లించారని విమర్శించారు. కానీ టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత గత మూడేళ్లలో రూ.28 వేల కోట్ల సబ్‌ప్లాన్ నిధులను పారదర్శకంగా దళితుల సర్వతోముఖాభివృద్ధికి ఖర్చు చేశామని తెలిపారు. అలాగే ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రూ.2,034 కోట్ల నిధులను వివి ధ పథకాల ద్వారా దళిత ప్రజలకు అందించామని వివరించారు. దళితు ల ఆరాధ్య దైవమైన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 125అడుగుల విగ్రహంతో పాటు స్మృతివనం, మ్యూజియం, గ్రంథాలయం, కన్వెన్షన్ సెంటర్ లను ప్రజా రాజధాని అమరావతిలో రూ.100 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో విరివిగా అవకాశాలను కల్పిస్తూ సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో ఇతరులతో సమానంగా రాణించేలా దళితులకు తోడ్పాటును అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి దళిత పల్లెలు,కాలనీల్లో క్షేత్రస్థాయి పర్యటనలు చేసి వారిసమస్యల తక్షణ పరిష్కారం కోసం దేశంలోనే తొలిసారిగా దళితతేజం-తెలుగుదేశం కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'మత్స్యకారులను ఎస్టీలో చేర్చాలి'


మీడియాతో మాట్లాడుతున్న మోపిదేవి వెంకట రమణ, నడకుదిటి

అమరావతి, ఆంధ్రప్రభ: మత్సకారులను ఎస్టీ జాబితాలో చేర్చాలని గత 50 సంవత్సరాల నుంచి పోరాటం జరుగుతుందని రాష్ట్ర మాజీ మంత్రి మోపిదేవి వెంకట రమణ, మత్సకారుల నేత నడకుదుటి నరసింహారావు అన్నారు. బుదవారం విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో మత్సకారులు ఎస్టీ జాబితాలో ఉన్నారని, రాష్ట్రంలోని మత్సకారులను ఎస్టీ జాబితాలో చేర్చుతామని సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ ఇచ్చారని, ఆహామీని నిలబెట్టుకోవాలన్నారు. ప్రభుత్వం కొన్ని సామాజిక వర్గాలకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు చర్యలు తీసుకుందని, కాని మత్సకారులను ఎందుకు పట్టించుకోవటంలేదని ప్రశ్నించారు. శ్రీకాకుళంలో రిలే దీక్షలు చేస్తున్న మత్సకారులపై కొంతమంది ఆదీవాసీలు దాడి చేయటం అన్యాయమని, 156 వాహనాల్లో వచ్చి మత్సకారులపై దాడి చేశారంటే దీని వెనుక రాజకీయ శక్తులు ఉన్నాయని అనుమానం కలుగుతుందన్నారు. మత్సకారులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని తెలిపారు. ఆదీవాసీల దాడి వెనుక టీడీపీ నేతల హస్తం ఉందని మోపిదేవి వెంకట రమణ ఆరోపించగా రాజకీయపరమైన ఆరోపణలు చేయొద్దంటూ నడకుదిటి నరసింహారావు వారించారు. ఈసందర్భంగా ఇరువురి మధ్య కొద్ది సేపు వాదన జరిగింది. అనంతరం మత్సకారులను ఎస్టీల్లోకి చేర్చేందుకు తాము కలిసి పని చేస్తామని ప్రకటించారు.

కాంగ్రెస్ పాపాల పుట్ట

(మొదటి పేజీ తరువాయి)

చాలాకాలం ప్రతిపక్షం పరిమితంగా ఉండేది. రేడియో, టీవీలు వారి నియంత్రణలోనే ఉండేవి. చివరికి చీఫ్ జస్టిస్‌నూ వారి ప్రభుత్వమే ఎంపిక చేసుకునేదని దుయ్యబట్టారు. ప్రధాని ప్రసంగానికి ప్రతిపక్షాలు పదేపదే అడ్డుతగలగా, టీడీపీ సభ్యులు మాత్రం ప్రసంగానికి అరగంట ముందే ఆందోళన విరమించారు. స్పీకర్ సుమిత్రా మహాజన్ మూడుసార్లు హెచ్చరించడంతో తెదేపా ఎంపీలు ఆందోళన విరమించి వారి స్థానాల్లో కూర్చున్నారు. వైకాపా సభ్యులు మాత్రం నిరసనల అనంతరం సభ నుంచి బయటకు వెళ్లిపోయారు. తొలుత లోక్‌సభలో మాట్లాడిన ఆయన ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ విభజన అంశాన్ని ప్రస్తావించారు. 'అవిభాజ్య ఆంధ్రప్రదేశ్‌ను కాంగ్రెస్ విభజించిన తీరు వల్లే ఇన్నేళ్లయినా సమస్యలు అలాగే ఉన్నాయి. కేవలం రాజకీయ ప్రయోజనాల కోణంలోనే విభజన చేయడం వల్ల, నేటికీ ప్రజలు కష్టాలు ఎదుర్కొంటున్నారు. గతంలో ఎన్డీయే హయాంలో మూడు రాష్ట్రాల ఏర్పాటు జరిగింది. ఉత్తరాఖండ్, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలను ఏర్పాటు సమయంలో అప్పటి వాజ్‌పేయి ప్రభుత్వం రాజనీతిజ్ఞతతో వ్యవహరించింది. రాజకీయ దృష్టితో కాకుండా ప్రజల కోసం పనిచేశాము' అంటూ కాంగ్రెస్ పార్టీపై ప్రధాని నిప్పులు చెరిగారు.

కాంగ్రెస్ పాపాలు నేటికీ వెంటాడుతున్నాయ్

కాంగ్రెస్ చేసిన పాపాలే ఇప్పటికీ వెంటాడుతున్నాయి. రాష్ట్రాలనే కాదు దేశాన్ని కూడా విభజించింది. ఏపీ ప్రజల మనోభావాలను అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోలేదు. లోక్‌సభ తలుపులు మూసి మరీ చట్టాన్ని ఆమోదించారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఇష్టానుసారం వ్యవహరించారు. ఏపీ విభజన జరిగి నాలుగేళ్లయినా ఇంకా సమస్యలున్నాయి. తెలంగాణ ప్రజల మనోభావాలకు అనుగుణంగా ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు మేం మద్దతు పలికాం. వాజ్‌పేయి ప్రభుత్వం దూరదృష్టి కారణంగా మూడు రాష్ట్రాలు విభజించినా ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాలేదు. ఎవరి వాటాలు వారికి ఇచ్చారు. కానీ ఆంధ్రప్రదేశ్ విషయంలో అలా జరగలేదు. రాజకీయ లబ్ధి కోసం పార్లమెంటు తలుపులు మూసివేసి విభజన బిల్లు ఆమోదింపజేసుకున్నారు. నామమాత్రం ప్రతిపక్షం, ప్రసార మాధ్యమాలపై నియంత్రణతో కాంగ్రెస్ ఇష్టారాజ్యంగా వ్యవహరించింది. తమ నిర్వాకాలు బయటకు రాకుండా కాంగ్రెస్ పార్టీ ఇష్టారీతిగా వ్యవహరించింది. అప్పుడు వారు చేసిన తప్పుల వల్లనే ఈనాడు ప్రతిపక్షంలో కూర్చున్నారు.

ప్రజాస్వామ్యం అంటే మాదే..

దళితులను అవమానించే కాంగ్రెస్ ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం తగదు. ప్రజాస్వామ్యం అంటే మాదే. ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్ పార్టీకి లేదు. కాంగ్రెస్ పార్టీ, నెహ్రూ ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించలేదు. రాజీవ్‌గాంధీ చేసిన అవమానాల వల్లే ఏపీలో ఎన్టీ రామారావు తెలుగుదేశం పార్టీ పెట్టారన్నారు. హైదరాబాద్‌లో ఏపీ దళిత ముఖ్యమంత్రిని రాజీవ్‌గాంధీ అవమానించారు. నీలం సంజీవరెడ్డి, అంజయ్య, పీవీ నర్సింహారావును కాంగ్రెస్ అవమానించింది. తెలుగు ప్రజల ఆత్మగౌరవం కాపాడేందుకు తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించింది. దీనికోసమే తెలుగు ప్రజల ఆరాధ్యదైవం ఎన్టీఆర్ సినిమాలు వదిలి రాజకీయ ప్రవేశం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ చేసిన రాజకీయ అరాచకాలు అనేకం. అలాంటివారా ఆ రాష్ట్రం గురించి మాట్లాడేది? కర్ణాటక ఎన్నికలు లేకుంటే, ఆంధ్రప్రదేశ్ విభజన గురించి మల్లికార్జున ఖర్గే మాట్లాడేవారేనా? తమిళనాడు, పంజాబ్, కేరళ రాష్ట్రాల్లో ప్రజాస్వామ్యాన్ని అణచివేసిన చరిత్ర కాంగ్రెస్‌ది కాదా? రాహుల్‌కు పార్టీ పగ్గాలు అప్పగించడం వారసత్వానికి నిదర్శనం.

నేను చెప్పేది వినేందుకు ధైర్యం ఉండాలి

నేను చెప్పేది వినేందుకు ధైర్యం లేకనే కాంగ్రెస్ పార్టీ నా ప్రసంగాన్ని అడ్డుకుంటోంది. పార్టీలు శాశ్వతం కాదు. దేశమే శాశ్వతమన్న విషయాన్ని వారు గుర్తుంచుకోవాలి. కాంగ్రెస్ హయంలో రోజుకు 11 కిలోమీటర్లు మేర రోడ్డు వేస్తే, మా హయాంలో రోజుకు 22కి.మీల మేర రహదారులు వేశాం. అభివృద్ధి విషయంలో భేదభావాలు చూపడం లేదు. ఖర్గే ఎంపీగా ఉన్న బీదర్‌లో వాజ్‌పేయి ప్రభుత్వం 1020 కిలోమీటర్ల మేర రైల్వేలైన్ వేసింది. ఖర్గే రైల్వేమంత్రిగా ఉండి ఏం చేశారో చెప్పాలి. ఇచ్చిన హామీల మేరకు ఈశాన్య రాష్ట్రాల్లో అభివృద్ధి పనులు ప్రారంభించడం జరిగింది. యూపీఏ కంటే ఎన్డీయే ప్రభుత్వం వచ్చాకే మెజార్టీ గ్రామాల్లో ఫైబర్‌నెట్ వ్యవస్థ వెళ్లూనుకుంది. మోడీ వస్తే ఆధార్‌కు మంగళం పాడతారని ప్రతిపక్షం ప్రచారం చేసింది. ఆధార్ వ్యవస్థను బలోపేతం చేసేసరికి ఇప్పుడు ఆధార్‌ను కాంగ్రెస్ వద్దంటోంది.

ఎన్‌పీఏ సంక్షోభాలు కాంగ్రెస్ పాపాలే

బ్యాంకుల వద్ద పేరుకుపోయిన నిరర్ధక ఆస్తులపై కొందరు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. 36 శాతం ఎన్‌పీఏలను 86శాతంగా చూపిస్తున్నారు. అసలు ఈ సంక్షోభానికి గత ప్రభుత్వాలే కారణం. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన రుణాల వల్లే ఎన్‌పీఏ సంక్షోభం ఏర్పడింది. అప్పట్లో అధికారంలో ఉన్నవారి సన్నిహితులకే రుణాలు ఇచ్చారు. దీని మూలంగా ఆర్థికవ్యవస్థకు తీరని నష్టం వాటిల్లింది.

ఏకకాల ఎన్నికలను స్వాగతించండి..

ఎన్నికల నిర్వహణకు వేలాది కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నాం. అంతేకాదు ఎంతో సమయం, శక్తి వృథా అవుతోంది. ఇండియా వంటి దేశాలు ఈ భారాన్ని మోయగలవా? మీరే ఆలోచించండి. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించడం వల్ల డబ్బు, సమయం ఆదా అవుతుంది. ఇందుకు ప్రతిపక్షం సహకరించాలి.

నిరుద్యోగంపై తప్పుడు ప్రచారం తగదు..

ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూడొద్దు. 70 లక్షల మంది కొత్తగా ఈపీఎఫ్ ఖాతాలు ప్రారంభించారు. ఇవన్నీ 18-25 ఏళ్ల మధ్య వయసు వారివే. స్టార్టప్ ఇండియా, స్కిల్ ఇండియా, స్టాండప్ ఇండియా పథకాలు యువత ఆకాంక్షలకు ఊతమిస్తున్నాయి. మన యువకుల్లో శక్తి, ఆసక్తిని నేను గమనించాను. సొంతంగా స్టార్టప్స్ ప్రారంభించాలన్న ఆకాంక్ష వారిలో కనిపిస్తోంది. మధ్యతరగతికి మా ప్రభుత్వం విస్తృత ప్రోత్సాహం ఇస్తున్నది. అవినీతి, నల్లధనానికి వ్యతిరేకంగా మా ప్రభుత్వం చేస్తున్న పోరాటంతో వారికి నిద్ర కరువైంది. అందుకే విపక్షాలు నన్ను లక్ష్యంగా చేసుకున్నాయి. దళారులు, అవినీతి పరుల ఆట కట్టించడంతో కాంగ్రెస్ నిరుత్సాహానికి లోనైంది. సామాన్యుడిని దోపిడీ చేసిన సొత్తంతా తిరిగి సామాన్యులకు చేరాల్సిందేనని మోడీ అన్నారు.

కోరుకుంటున్నది ఒకటి.. మోడీ మాట్లాడిందొకటి

●ప్రధాని కొత్తగా చెప్పిందేమీ లేదు ●ఉద్యోగాల సృష్టి ప్రస్తావన లేదు ●సోనియాగాంధీ పెదవి విరుపు

న్యూఢిల్లీ : కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ ప్రధాని నరేంద్ర మోడీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రజలు ఒకటి కోరుకుంటుంటే..మోడీ మరొకటి చెబుతున్నారని మండిపడ్డారు.బుధవారం పార్లమెంట్ లో రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానం సందర్భంగా కాంగ్రెస్ పై మోడీ చేసిన వ్యాఖ్యలను ఆమె తీవ్రంగా ఖండించారు. మోడీ ప్రసంగంలో కొత్తేమీ లేదని.. ప్రజలు తమ భవిష్యత్, ఉద్యోగాలపై ఆశలు పెట్టుకుంటే..ప్రధాని వారి ఆశలపై నీళ్లు చల్లారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని మాటల్లో కొత్తేమీ లేదు..పాత పల్లవినే వల్లెవేశారు. ప్రజలు తమ భవిష్యత్ గురించి ఆలోచిస్తున్నారు. ఉద్యోగాలు కోసం ఆరాటపడుతున్నారు. అని రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాల తీర్మానం సందర్భంగా మోడీ వ్యాఖ్యలపై పెదవి విరిచారు. రైతు సమస్యలు, నిరుద్యోగం,రాఫెల్ అక్రమాలపై ప్రతిపక్షాల ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పకుండా ఎదురుదాడికి దిగడం విచారకరమన్నారు. ఆర్థిక వ్యవస్థపై భరోసా కల్పించాల్సిన ప్రధాని...పార్లమెంట్ లో కేవలం ప్రతిపక్షాలను టార్గెట్ చేస్తూ విమర్శలు గుప్పించడం గర్హనీయమని మండిపడ్డారు.


విభజన హామీలు నెరవేర్చండి

●ఆంధ్ర డిమాండ్లకు మా మద్దతు ●లోక్‌సభలో తెరాస నేత

న్యూఢిల్లీ: విభజన చట్టంలో తెలంగాణకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని లోక్‌సభలో తెరాస పక్ష నేత జితేందర్ రెడ్డి బుధవారం లోక్‌సభలో డిమాండ్ చేశారు. కేంద్ర బడ్జెట్‌పై జరిగిన చర్చలో మాట్లాడుతూ, కేంద్ర బడ్జెట్ పూర్తిగా గందరగోళంగా ఉందని, ఏ ఒక్క రాష్ట్రాన్నీ సంతృప్తి పరిచేలా లేదని అన్నారు. రైతుల పంటలకు మద్దతు ధరలు ఇచ్చే విషయంలో బడ్జెట్లో ఎంతమాత్రం స్పష్టత లేదని ఆయనన్నారు. తెలంగాణ రాష్ట్రానికి ఎయిమ్స్ ఇస్తామని ఆర్థిక మంత్రి జైట్లీ సభలోనే హామీ ఇచ్చారని, కాని ఆ హామీ నిలబెట్టుకోలేదని, ఇలాంటప్పుడు విలువేమి ఉంటుందని ఆయన నిలదీశారు. విభజన చట్టంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఇచ్చిన హామీలను నెరవేర్చే క్రమంలో ఆ రాష్ట్రానికి జరిగిన అన్యాయానికి తాము కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నామని, ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్‌కు తమ పార్టీ సంఘీభావం వ్యక్తం చేస్తున్నదని అంటూ, కేంద్రం వెంటనే స్పందించి తగిన న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

జాతీయ ఎజెండాగా రాష్ట్ర సమస్యలు

●విభజనకు ముందు, అనంతరం కూడా తప్పని పోరాటం ●రెండు ప్రభుత్వాల మధ్య సమస్య ఇది ●ఎంపీలతో టెలీకాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు ●టీడీపీ బృందంతో ఢిల్లీలో చర్చలు




అమరావతి, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్ సమస్యలను జాతీయ స్థాయి ఎజెండాగా మార్చగలిగామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. సభ నుంచి సస్పెండ్ చేసినప్పటికీ ఎంపీలు వెనుకంజ వేయవద్దని స్పష్టం చేశారు. బుధవారం ఆయన తెలుగుదేశంకు చెందిన లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి తాజా పరిణామాలపై చర్చించారు. ఆందోళన కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబునాయుడు మాట్లాడుతూ పార్లమెంట్‌లో ఎంపీలు స్ఫూర్తిదాయకంగా ఆందోళన చేస్తున్నారని చెప్పారు. ఏపీకి జరిగిన అన్యాయం దేశవ్యాప్తంగా చర్చనీయాంశం అయ్యేలా చేశామని, ఇక నుంచి దీనిపై హేతుబద్ధంగా ముందుకు తీసుకువెళ్లే విధంగా వ్యవహరించాల్సి ఉందని అన్నారు. ఫలితంగా రాష్ట్ర ప్రయోజనాలను సాధించాల్సి ఉందని ముఖ్యమంత్రి చెప్పారు. విభజన సమయంలో ఆరు నెలలు పార్లమెంట్‌లో పోరాటం చేశామని, తక్కువ మంది ఎంపీలతోనే సభను స్థంభింపజేశామని చంద్రబాబు గుర్తుచేశారు. అన్యాయాన్ని ప్రతిఘటించడంలో తెగువను చూపడం జరిగిందని అప్పట్లో వాళ్లు చేసేది, వాళ్లు చేస్తే ప్రజలు మాత్రం తాము చేయాల్సింది, చేశారని అన్నారు. ఏ పార్టీ అయినా ప్రజాభిప్రాయం మేరకే నడుచుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రయోజనాలే మనకు ముఖ్యమని రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగాలని ఆయన ఎంపీలతో వ్యాఖ్యానించారు. ఏ పార్టీ అయినా ప్రజల మనోగతానికి అనుగుణంగా వ్యవహరించాలని అంటూ ఇది రెండు ప్రభుత్వాల మధ్య సమస్య అని పేర్కొన్నారు. బంద్‌ల ద్వారా జన జీవనానికి ఇబ్బందులు మంచిది కాదని వ్యాఖ్యానించారు. పార్లమెంట్‌లో పోరాడాల్సిన సమస్య అని, వీధి పోరాటాల సమస్య అసలే కాదని స్పష్టం చేశారు. రాష్ట్ర విభజనకు లేని ఫార్ములా రాష్ట్రాన్ని ఆదుకోవడంలో కావాలా..? అని ప్రశ్నించారు. ఆర్థిక లోటు భర్తీపై ఇప్పుడు కొత్తగా ఫార్ములా ప్రస్తావన ఏంటి అని ఇది డొంక తిరుగుడు వ్యవహారం కాదా అని ముఖ్యమంత్రి అన్నారు. ఆర్థిక లోటు భర్తీపై వాస్తవ విరుద్ధంగా మాట్లాడడం మంచి పద్ధతి కాదని, ఇది హుందాగా లేదని, అసలు కొత్తగా ఫార్ములా ప్రస్తావనను తెరపైకి తేవడంలో ఔచిత్యం ఏమిటని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన అన్యాయంపై కాంగ్రెస్ నాయకుడు మల్లిఖార్జునఖర్గే ఎందుకు ప్రశ్నించలేదని ప్రశ్నించారు. బుధ, గురువారాలు మాత్రమే సభ జరుగుతుందని శుక్రవారం వాయిదా పడుతుందని, ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వంపై పెద్ద ఎత్తున ఒత్తిడి పెంచాలని పార్లమెంట్ సభ్యులతో అన్నారు. రాష్ట్ర విభజనకు ముందు అనంతరం కూడా అమూల్యమైన సమయం అంతా పోరాటాలతోనే సరిపోతోందని తెలిపారు. కేంద్రం ఆంధ్రప్రదేశ్ ప్రజల సహనానికి పరీక్ష పెడుతోందని ఇది దురదృష్టకరమని కూడా వ్యాఖ్యానించారు. విభజన హామీలను అలక్ష్యం చేసి కేంద్రం మిత్ర ధర్మాన్ని విస్మరించడం బాధిస్తోందని చంద్రబాబునాయుడు అన్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా, దేశ వ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన అన్యాయంపై సానుభూతి వెల్లువెత్తుతున్నదని తాను కూడా స్వయంగా ముఖ్యమంత్రి హోదాలో, ప్రధాని మంత్రిని స్వయంగా కలిసినప్పటికి ఫలితం అంతంతమాత్రమేనని, పరిస్థితి ఇలానే కొనసాగితే ప్రజలకు ఏమి సమాధానం చెప్పుకోవాలని పేర్కొన్నారు. గత మూడున్నర సంవత్సరాల నుంచి ఇదే తంతు కొనసాగుతున్నదని, ఎప్పటికప్పుడు రాష్ట్ర డిమాండ్‌లపై కేంద్రం దృష్టికి తెచ్చామని అన్నారు. అనివార్యమైన పరిస్థితుల్లో ప్రజల వాణిని పార్లమెంట్ వేదికగా వినిపించాల్సి రావడం దురదృష్టకరమని చంద్రబాబునాయుడు వ్యాఖ్యానించారు. ఇప్పటికి విభజన హామీలపై నిర్దిష్టమైన కార్యాచరణతో ముందుకు రావాలని, ఏపీ ప్రభుత్వం కూడా అన్ని విధాలా సహకరించేందుకు సిద్ధంగానే ఉండినట్లు తెలిపారు.

ఎంపీల పట్టుదల..

ఇదిలా ఉండగా పార్లమెంట్ సభ్యులు కూడా ముఖ్యమంత్రితో మాట్లాడుతున్న సమయంలో పట్టుదలను ప్రదర్శించారు. తాము రాష్ట్ర సమస్యలను పార్లమెంట్ వేదికగా ఎలుగెత్తి చాటడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, ఈ విషయంలో తుది వరకు ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని, కేంద్రంపై ఒత్తిడి పెంచుతూనే ఉంటామని చంద్రబాబునాయుడుతో అన్నారు. ఇప్పటికే కేంద్రంలో కదలిక వచ్చినట్లేనని, కేంద్ర స్థాయిలో ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర బడ్జెట్‌లో అన్యాయం జరిగిన అంశం చర్చనీయాంశంగా మారిందని ఎంపీలు చంద్రబాబుతో అన్నారు. అవసరమైతే రాష్ట్ర విభజన సమయంలో వ్యవహరించిన తీరులోనే ఏపీకి జరిగిన నిధుల కేటాయింపులో అన్యాయంపై కూడా తాము పెద్ద ఎత్తున ఆందోళన చేసేందుకు సిద్ధమని ప్రకటించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి పార్లమెంట్ సభ్యులు ఢిల్లీలోని రాజకీయ పరిస్థితులను వివరించారు. కేంద్రంపై ఒత్తిడి పెంచే క్రమంలో వ్యూహాత్మకంగా ముందుకు సాగుతామని ముఖ్యమంత్రి చంద్రబాబుతో అన్నారు.

తెదేపా-బీజేపీది లాలూచీ వ్యవహారం

చర్చలన్నీ ఓ నాటకం : కాంగ్రెస్ ఎంపీ కేవీపీ రామచంద్రరావు



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : కాంగ్రెస్ ఎంపీ కెవిపి రామచంద్రరావు బుధవారం రాజ్యసభలో నిరసనకు దిగారు. చైర్మన్ పోడియం వద్దకు వెళ్లి ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేయాలని ప్లకార్డులు ప్రదర్శించారు. అయితే వెల్ నుంచి వెళ్లిపోవాలని పదే పదే చైర్మన్ వెంకయ్యనాయుడు సూచించారు. లేదంటే రాజ్యసభ నిబంధనల కింద చర్య తీసుకుంటామని హెచ్చరించారు. ఒక సభ్యుడు సభా కార్యక్రమాలను ఆటంకం కలిగించేందుకు అవకాశం కల్పిస్తే రేపు మరొకరు ఇదే పరిస్థితి సృష్టిస్తారని వెంకయ్యనాయుడు వ్యాఖ్యానించారు. దాంతో ఎంపీ కెవిపి సభ నుంచి బయటకు వెళ్లి పార్లమెంటులోని గాంధీ విగ్రహం వద్ద నిరసన కొనసాగించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, సభలో ఉంటే కూర్చోమని లేదంటే వెళ్లిపోమని అన్నారని, దాంతో గాంధీ విగ్రహం వద్ద మౌన ప్రదర్శన నిర్వహించాని చెప్పారు. ఏపీకి న్యాయం చేయాలని గాంధీ ఆశీస్సులు తీసుకున్నానని అన్నారు. కాంగ్రెస్ పార్టీ హేతుబద్ధగా విభజించలేదని ప్రధాని అనడం సరైందని కాదని, ప్రస్తుతం బిజెపి ఏం చేస్తుందో చెప్పాలని ప్రశ్నించారు. తిరుపతి వెంకన్నసాక్షిగా మోడీ ఇచ్చిన హామీ ఏమైదని, నాలుగేళ్లయినా దానికి హేతుబద్ధత లేదా అని ప్రశ్నించారు. టిడిపిబిజెపి చర్చలు కేవలం నాటకం మాత్రమేనని అన్నారు. సీఎం చంద్రబాబు మాటలకే పరిమితమయ్యారని, చేతల్లో ఏమి లేదని విమర్శించారు. ఎకనామిక్స్ చదివిన చంద్రబాబుకు, ఏపీకి బిజెపి ఏమిచ్చిందో తెలియాలని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. టిడిపి, బిజెపి వ్యవహారాం లాలూచీలా కనపడుతోందన్నారు. ఏపీకి 53లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని టిడిపి చెప్పుకుంటుండం వల్లే ఏపీకి కేంద్రం న్యాయం చేయడం లేదేమోనని అన్నారు. రాష్ట్రంలోకి వచ్చిన పెట్టుబడులపై ఓ శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కొనసాగిన వైకాపా ఎంపీల ఆందోళన

●ఉదయం రాజ్‌నాథ్ సింగ్‌తో సమావేశం ●ప్రధాని ప్రసంగం సమయంలో వాకౌట్

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : గత రెండు రోజులుగా తెలుగుదేశం పార్టీతో పోటాపోటీగా ఆందోళనలు చేస్తున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు, బుధవారం కూడా ఆందోళన కొనసాగించారు. అంతకంటే ముందు ఉదయం గం. 9.30 ని. సమయంలో కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీ వైకాపా ఎంపీలు వైవీ సుబ్బారెడ్డి, విజయసాయి రెడ్డి, వరప్రసాద్, అవినాశ్ రెడ్డి, మిథున్ రెడ్డి సమావేశమయ్యారు. విభజన చట్టంలోని హామీలతో పాటు ప్రత్యేక హోదాను అమలు చేయాలని కోరుతూ ఒక విజ్ఞాపనా పత్రాన్ని ఆయనకు అందజేశారు. మంగళవారం కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ చేసిన ప్రకటనలో కొత్తేమీ లేదని ఆయనకు చెప్పారు. అనంతరం ఎంపీ వైవీ



సుబ్బారెడ్డి మీడియాతో మాట్లాడుతూ, తెలుగుదేశం ఎంపీలు తమ ఆందోళన మంగళవారం విరమించుకున్నారని, తాము మాత్రం కొనసాగించామని చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం పాటు పడుతున్నారో ప్రజలు గమనిస్తున్నారని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రజల కష్టాలను రాజ్‌నాథ్ సింగ్‌కు చెప్పామని అన్నారు. ప్రత్యేక హోదా, రైల్వే జోన్, పోలవరం, దుగ్గరాజపట్నం, కడప స్టీల్ ప్లాంట్ వంటి అంశాలను రాజ్‌నాథ్ సింగ్ దృష్టికి తీసుకువచ్చామని అన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉండి డ్రామాలు చేస్తోందని, హామీల అమలుపై కేంద్రంపై ఒత్తిడి చేయడం లేదని విమర్శించారు. బడ్జెట్ సమావేశాల్లోపు విభజన హామీలపై కేంద్రం స్పష్టతనివ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం నేరుగా పార్లమెంట్ చేరుకున్న వైకాపా ఎంపీలు, ఆవరణలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద తెలుగుదేశం ఎంపీలకు పోటీగా ప్లకార్డులు పట్టుకుని ప్రదర్శన చేపట్టారు. వారితో సమానంగా నినాదాలు చేశారు. సభ మొదలయ్యాక లోక్‌సభలో స్పీకర్ పోడియం ఎదురుగా వెల్‌లో నిలబడి తెలుగుదేశం ఎంపీలతో పాటుగా నినాదాలు చేశారు. అయితే ప్రధాని ప్రసంగం ప్రారంభమయ్యే సమయానికి తెలుగుదేశం ఎంపీలంతా ఎవరి సీట్లలోకి వాళ్లు వెళ్లిపోవడంతో వైకాపా ఎంపీలకు తొలుత ఏం చేయాలో తోచలేదు. కాసేపటి తేరుకుని సభ నుంచి బయటికొచ్చారు. నేరుగా విజయ్ చౌక్ దగ్గర ఉన్న మీడియా పాయింట్‌కు చేరుకుని తాము ప్రధాని ప్రసంగాన్ని బహిష్కరించామని ప్రకటించారు. అందుకే వాకౌట్ చేసి బయటికొచ్చామని తెలిపారు.

తెదేపా నిరసన ఓ నాటకం ప్రధాని ప్రసంగాన్ని అడ్డుకోలేదు మేం బహిష్కరించి వాకౌట్ చేశాం: వైకాపా ఎంపీలు

విజయ్ చౌక్ మీడియా పాయింట్ వద్ద మాట్లాడిన ఎంపీ వైవీ సుబ్బారెడ్డి తెలుగుదేశం పార్టీపై విరుచుకుపడ్డారు. కీలక ప్రధాని ప్రసంగాన్ని అడ్డుకోవడమో లేక తమలా బహిష్కరించడమో చేయకుండా సభలో కూర్చున్నారని విమర్శించారు. ఇదంతా ఒక డ్రామా అని, ప్రజలను మభ్యపెట్టేందుకు నాటకాలాడుతున్నారని ఆరోపించారు. తామ వాకౌట్ చేయడానికి ముందు రాష్ట్ర విభజన సమస్యలను చెప్పుకునేందుకు అవకాశమివ్వాలని స్పీకర్‌ను కోరామని, ఇవ్వకపోవడంతోనే నిరసనగా వాకౌట్ చేశామని ఆయన చెప్పుకొచ్చారు. సాయంత్రం మీడియా పాయింట్ వద్ద మాట్లాడిన వైకాపా రాజ్యసభ సభ్యులు విజయసాయి రెడ్డి, తెదేపా ఆందోళనను ఒక నాటకంగా కొట్టిపడేశారు. రాష్ట్రపతి ప్రసంగాన్ని కేంద్ర కేబినెట్ ఆమోదించే సమయంలో కేబినెట్ మంత్రిగా ఉన్న అశోక్ గజపతి రాజు ఎందుకు అభ్యంతరం చెప్పలేదని ప్రశ్నించారు. ఆ ప్రసంగంలో ఆంధ్రప్రదేశ్ విభజన సమస్యలు, హామీలను జోడించాల్సిందిగా ఒత్తిడి చేసి ఉండాల్సిందని సాయిరెడ్డి అన్నారు.

మార్చి నుంచి ఇండిగో కొత్త విమాన సర్వీసులు

బెంగళూరు, హైదరాబాద్, చెన్నైకు ఇక ప్రతిరోజు



అమరావతి, ఆంధ్రప్రభ: ప్రముఖ విమాన యాన సంస్థ ఇండిగో విజయవాడ నుంచి కొత్త సర్వీసులను ప్రారంభించనుంది. మార్చి2వ తేదీ నుంచి బెంగుళూరు, హైద్రాబాద్, చెన్నైకు మూడు కొత్త సర్వీసులను ప్రారంభించనున్నట్లు ఇండిగో సంస్థ చీఫ్ కమర్షియల్ మేనేజర్ (సిసిఓ) సంజయ్‌కుమార్ తెలిపారు. ఇక్కడి హోటల్‌లో సంస్థ కార్పొరేట్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ అజయ్‌బస్రాతో కలసి సంజయ్‌కుమార్ విలేఖరులతో బుధవారం సాయంత్రం మాట్లాడారు. విజయవాడ నుంచి తమ సర్వీసులను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. త్వరలో ఢిల్లీ, ముంబైలకు కూడా సర్వీసులు ప్రారంభిస్తామన్నారు. దక్షిణ భారతదేశంలో అభివృద్ధి చెందుతున్న, దేశీయ రంగానికి పెరుగుతున్న ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని , భారతదేశపు అతిపెద్ద , అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న లోకాస్ట్ క్యారియర్ ఇండిగో, తమ రూట్ నెట్‌వర్క్‌లో 50వ గమ్యస్థానంగా విజయవాడను ఎంచుకున్నామని వారు తెలిపారు. మార్చి 2వ తేది నుంచి ఇండిగో విజయవాడ నుండి ప్రతీ రోజూ మూడు విమానాలను హైదరాబాద్‌కు నడపడంతో పాటుగా బెంగుళూరు , చెన్నైలకు ప్రతీ రోజూ ఒక విమానాన్ని నడపనున్నట్లు తెలిపారు. విజయవాడ మాత్రమే గాక ప్రస్తుత ఇండిగో నెట్‌వర్క్ అయినటువంటి ఎయిర్ బస్ 320, ఏటీఆర్ కు మరిన్ని నూతన నగరాలను జోడించనున్నామని, తమ విమానాలను విజయవాడ నుండి ఢిల్లీ, ముంబై, కోల్‌కత్తా, దుబాయ్, సింగపూర్, షార్జా వంటి నగరాలను బెంగుళూరు, హైదరాబాద్, చెన్నై నగరాల ద్వారా కలుపనున్నామని తెలిపారు. కార్పొరేట్ , లీజర్ ప్రయాణీకులు ఇప్పుడు విజయవాడ నుండి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రయాణించే అనుభవాలను పొందడంతో పాటు ఆన్‌టైమ్ పెర్ఫార్మెన్స్ అనుభవాలనూ పొందే అవకాశం కొత్త సర్వీసుల ద్వారా ఏర్పడనుందని వారు తెలిపారు. తమ ప్రాంతీయ కనెక్టివిటీని సైతం మరింతగా మెరుగుపరుస్తూ రాజమండ్రి, తిరుపతిలలో ఇప్పటికే ఇండిగో కార్యకలాపాలు ప్రారంభించిందని తెలిపారు. రాబోయే సంవత్సరా లలో తమ నెట్ వర్క్‌ను విస్తరించడం ద్వారా బిజినెస్, లీజర్ ట్రావెలర్ల అవసరాలను తీర్చనున్నామన్నారు.

రాజధానిలో మొట్టమొదటి విశ్వవిద్యాలయం విట్

విట్ ఏపీ వైస్ ప్రెసిడెంట్ డా. శేఖర్ విశ్వనాథన్



అమరావతి, ఆంధ్రప్రభ: ప్రజా రాజధాని అమరావతిలో తొలిగా అడుగుపెట్టిన విశ్వవిద్యాలయం విట్ ఏపీ తొలిసారిగా జాతీయ స్థాయి క్రీడా సాంస్కృతిక ఉత్సవానికి సన్నద్ధం అయ్యిందని విట్ ఏపి వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శేఖర్ విశ్వనాధన్ తెలిపారు. అనుమతులు ఇచ్చిన ఆరు నెలలోనే సొంత క్యాంపస్ లో తరగతులు నిర్వహిస్తున్న విట్ ఏపి విటోపియా 2018 పేరుతో ఈ నెల 9న కాలేజీ క్యాంపస్‌లో జాతీయ స్థాయి క్రీడా సాంస్కృతిక ఉత్సవం నిర్వహించనుందని, ఈ నెల 9న క్రీడాకార్యక్రమాలు, సాయంత్రం ప్రముఖ బాలివుడ్ సింగర్ బెన్ని దయాళ్, టాలివుడ్ సింగర్ దామిని బాట్ల మ్యూజికల్ షో జరగనుందని వివరించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మానవవనరుల శాఖా మంత్రి గంటా శ్రీనివాసరావు ముఖ్యఅతిధిగా హాజరవ్వనున్నారని విశ్వనాధ్ చెప్పారు. విట్ ఏపీ కాలేజీలో తొలిసారి నిర్వహిస్తున్న ఈ క్రీడా సాంస్కృతిక కార్యక్రమంలో దేశం నలుమూలల నుండి వచ్చిన విద్యార్థులు 300 మంది పలు క్రీడల్లో పాల్గొనగా 9వ తారీఖు ఉదయం గుంటూరు రూరల్ ఎస్పీ సిహెచ్ వెంకటప్పల నాయుడు క్రీడల పోటీల విజేతలకు పతకాలు అందజేయనున్నారని, అదే విధంగా సాయంత్రం జరిగే కార్యక్రమంలో మానవవనరుల శాఖా మంత్రి గంటా శ్రీనివాసరావు స్టాండప్ కామెడీ, సింగింగ్‌కాంపిటేషన్ విజేతలకు బహుమతి ప్రదానం చేస్తారని శేఖర్ విశ్వనాధన్ చెప్పారు.

బీజేపీని వదులుకుంటే టీడీపీకి మరిన్ని సీట్లు

మాజీ మంత్రి మహ్మద్ జానీ



అమరావతి, ఆంధ్రప్రభ: వచ్చే సాధారణ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ బీజేపీతో పొత్తు పెట్టుకోకపోవడం మంచిదని మాజీ మంత్రి మహ్మద్ జానీ అన్నారు. ఫలితంగా తెలుగుదేశంకు 25 శాతం ఓట్లు అధికంగా పడే అవకాశాలున్నాయని చెప్పారు. బుధవారం నాడు ఇక్కడ ఆయన 'ఆంధ్రప్రభ' ప్రతినిధితో మాట్లాడుతూ బీజేపీతో తెగదెంపులు చేసుకున్న పక్షంలో తెలుగుదేశం పార్టీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడుకు సూచించారు. లేనట్లయితే ఎస్సీ, ఎస్టీ మైనార్టీల ఓట్లలో తేడా వచ్చే అవకాశముందని గుర్తుచేశారు. భారతీయ జనతా పార్టీని విడిచిపెడితే వచ్చే ఎన్నికల్లో దళితులు, ఎస్టీలు, మైనార్టీలు పక్కాగా తెలుగుదేశంకు ఓటు వేయడం జరుగుతుందని అన్నారు. ప్రత్యర్థిని ఎప్పుడూ కూడా తక్కువ అంచనా వేయకూడదని, ఇప్పటికే ప్రజల్లో పాజిటివ్ వాతావరణం ఉన్న నేపథ్యంలో టీడీపీకి అనుకూలమైన వాతావరణం ఉందని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సమర్ధవంతమైన నాయకుడని, ఎన్నికల ఎత్తుగడల్లో అనుభవం ఉన్నవారని అన్నారు. కేంద్ర బడ్జెట్ కేటాయింపుల విషయంలో రాష్ట్రానికి అన్యాయం చేసిన బీజేపీ పట్ల ఆంధ్రప్రదేశ్ ప్రజల్లో తీవ్రమైన అసంతృప్తి ఉన్న విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సి ఉందని ఆయన చెప్పారు. బీజేపీతో తెగదెంపులు చేసుకోవడానికి కూడా ఇదే అదును అనే విషయాన్ని పరిగణనలోకి తీసుకుని ముందుకు సాగాలని అన్నారు. ఆ పార్టీతో తెగదెంపులు చేసుకున్న పక్షంలో ఎన్నికల్లో గెలవడం ద్వారా టీడీపీ అధికారంలోకి రావడమే కాకుండా అదనంగా 25 ఎస్సీ, ఎస్టీ మైనార్టీల శాతం ఓట్లు పోలయ్యేందుకు మార్గం సుగమం అవుతుందని చంద్రబాబు నాయుడుకు సూచించారు.

బృంగిపై శ్రీశైల మల్లన్న

కర్నూలు బ్యూరో, ప్రభ న్యూస్: స్వయంభు లింగంగా వెలసిన శ్రీశైల మహాక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు భక్తులు వేలాదిగా తరలివస్తున్నారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి భ్రమరాంభ సమేతుడైన మల్లికార్జునుడు బృంగి భుజస్కంధాలపై ఊరేగాడు. పరమేశ్వరుడు ప్రమాదగణాలలో ముఖ్యుడైన బృంగి స్వామి, అమ్మవార్ల సేవలో తరించాడు. ముందుగా అమ్మవారి అలంకార మండపంలో వివిధ రకాల సుగంధ పుష్పాలతో అలంకరించిన బృంగి వాహనంపై స్వామి, అమ్మవార్లను అధిష్టింపజేశారు. అనంతరం ఉత్సవమూర్తులను ఆలయ ప్రదక్షణ అనంతరం బృంగి వాహన సమేతుడైన స్వామి, అమ్మవార్లను రథశాల వద్దకు చేర్చారు. అక్కడ ప్రత్యేక పూజాధికాలను నిర్వహించిన అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు.ఈ గ్రామోత్సవం నంది మండపం, అంకాలమ్మ గుడి, బయలు వీరభద్రస్వామి ఆలయం వద్దకు చేరుకొని అక్కడి నుండి రాత్రి 9 గంటలకు ఆలయ ప్రాంగణం చేరుతుంది. పురవీధులలో గ్రామోత్సవాన్ని తిలకించిన వేలాది మంది భక్తులు స్వామి, అమ్మవార్లకు కర్పూర నీరాజనాలు అర్పించారు. ఈ గ్రామోత్సవంలో గురువయ్య నృత్యాలు, లంబాడీల ఆటలు, కోలాటములు, శివ వేషధారణలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ గ్రామోత్సవంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎన్ భరత్‌గుప్త, ఏసి నాగేశ్వరరెడ్డి, ఎఇఓలు రాజశేఖర్, మోహన్, శ్రీశైలప్రభ ఎడిటర్ అనిల్, సిఆర్ఓ శ్రీనివాసులు, వేద పండితులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో నైపుణ్యం చూపే సిబ్బందికి సహకారం

డీజీపీ డాక్టర్ మాలకొండయ్య



అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్ర పోలీసు శాఖ తరుపున క్రీడల్లో ప్రతిభ చూపే సిబ్బందికి అన్ని విధాలా సహకారం అందిస్తామని డీజీపీ డాక్టర్ ఎం.మాలకొండయ్య హామీ ఇచ్చారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జనవరి 29నుంచి ఈ నెల 2 వరకు బిఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 11వ అఖిల భారత పోలీసు షూటింగ్ ఛాంపియన్ షిప్-2017లో ఏపీ పోలీసులు ఒక బంగారు, రజత పతకంతో పాటు మూడు కాంస్యపతకాలు సాధించారు. వీరిని బెటాలియన్స్, స్పోర్ట్స్ ఐజీ రాజీవ్ కుమార్ మీనా బుధవారం డీజీపీ మాలకొండయ్య వద్దకు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో ఏపీ పేరును నిలబెట్టిన వీరిని డీజీపీ ప్రత్యేకంగా అభినందించి శాఖాపరంగా ఇవ్వనున్న సహకారాన్ని తెలియజేశారు. ఆక్టోపస్ కానిస్టేబుల్ ఎం.కృష్ణా(పీసీ 1770) వ్యక్తిగత విభాగంలో బంగారు, రజత పతకం, 300 మీటర్ల టీమ్ విభాగంలో కాంస్య పతకం సాధించారు. గ్రేహౌండ్స్ నుంచి పి.వి.రవీంద్ర(ఎస్‌సి 8639) 300 మీటర్ల టీమ్ విభాగంలో కాంస్య పతకం, ఆక్టోపస్ నుంచి వై.భరత్ కుమార్ (పిసి 8639) 300 మీటర్ల టీమ్ విభాగంలో కాంస్య పతకం సాధించారు. కార్యక్రమంలో ఐజీ ఆర్.పి.మీనా తదితర అధికారులు పాల్గొన్నారు.

మిథాలీ సేన విజయం



• 178 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా ఓటమి
• సిరీస్ 2-0తో భారత్ కైవసం



కింబర్లీ: స్థానిక ఓవల్ మైదానంలో భారత్, దక్షిణాఫ్రికా మహిళా క్రికెట్ జట్ల మధ్య రెండో వన్డే మ్యాచ్‌లో భారత్ 178 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది. భారత్ నిర్దేశించిన 303 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడంలో సఫారీ మహిళా జట్టు 30.5 ఓవర్లలో 124 పరుగులకే కుప్ప కూలింది. ఐసీసీ మహిళా ఛాంపియన్ షిప్‌లో భాగంగా ఈ సిరీస్ జరుగుతోంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇంకో మ్యాచ్ మిగిలి ఉండగానే భారత్ 2-0 ఆధిక్యంతో సిరీస్‌ను గెలుచుకుంది. భారత ఇన్నింగ్స్‌లో ఎస్ మంధాన మరోసారి మెరిసింది. అద్భుతమైన ఆటతో 135 పరుగులు చేసి భారత భారీ స్కోరుకు పునాది వేసింది. హర్మన్ ప్రీత్ కౌర్, వి కృష్ణమూర్తి కూడా అర్ధ శతకాలు చేశారు. ఓడయం టాస్ గెలిచిన దక్షిణాఫ్రికా జట్టు కెప్టెన్ వ్యాన్ నెయికెర్క్ బౌలింగ్‌ను ఎంచుకుంది. భారత ఓపెనర్లు పీజీ రౌత్, మంధానాలు ధాటిగా ఆడుతూ స్కోరును పరుగులెత్తింపజేశారు. 9.2 ఓవర్లలోనే భారత్ 50 పరుగులను చేసింది. తొలి వికెట్‌కు 60 బంతుల్లో 50 పరుగుల భాగస్వామ్యం నమోదైంది.

12.3 ఓవర్లో రౌత్ 20 పరుగులు చేసి క్లాస్ బౌలింగ్‌లో వికెట్ కీపర్ చెట్టికి క్యాచ్ ఇచ్చి ఔటయింది. అనం తరం బ్యాటింగ్‌కు వచ్చిన కెప్టెన్ మిథాలీ రాజ్ 20 పరుగులకే బిల్యూస్ బౌలింగ్‌లో ఆమెకే రిటర్న్ క్యాచ్ ఇచ్చి ఔటయింది. హర్మీందర్ కౌర్ బ్యాటింగ్‌కు వచ్చి మంధానా కలిసి సఫారీల బౌలింగ్‌ను ఉతికి పారేశారు. మంధానా 116 బంతులను ఎదుర్కొని తన సెంచరీని పూర్తి చేసుకుంది. ఇందుకు ఆమె 115 నిమిషాల సమయాన్ని తీసుకుంది. భారత్‌స్కోరు 40.4 ఓవర్లలో 200 మార్కును చేరింది. ఇన్నింగ్స్ 43.2 ఓవర్లో మూడవ వికెట్‌గా మంధాన 135 పరుగులకు వెనుతిరిగింది. ఎన్టోజాకె బౌలింగ్‌లో వికెట్ కీపర్ చెట్టికి క్యాచ్ ఇచ్చి ఔటయింది. బ్యాటింగ్‌కు వచ్చిన వి కృష్ణ మూర్తి, కౌర్‌లు కలిసి భారత నిర్ణీత 50 ఓవర్లు పూర్తయ్యే సరికి మరో వికెట్ నష్టపోకుండా 302 స్కోరును సాధించింది. అనంత రం బ్యాటింగ్ ప్రారంభించిన దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మన్లు లీ, వాల్వార్డ్ జంట బ్యాటింగ్‌ను ధాటిగా ప్రారంభించింది. సఫారీల తొలివికెట్ ఐదో ఓవర్లో పడింది. గోస్వామి బౌలింగ్‌లో వాల్వార్డ్(9) వర్మకు క్యాచ్ ఇచ్చి ఔటయింది. అనంతరం వచ్చిన సఫారీల బ్యాట్స్‌మన్లు ఏమాత్రం నిలదొక్కుకోలేకపోయారు. లీ ఒక పక్క ధాటిగా ఆడుతూ ఉంటే మిగతా బ్యాట్స్‌మన్లు ఇటు వచ్చి అటు పోయే చందంగా మారింది. లీ 109 బంతులు ఎదుర్కొని 73 పరుగులు చేసి శర్మ బౌలింగ్‌లో ఎల్బీడబ్ల్యుగా వెనుదిరిగింది. సఫారీల బ్యాట్స్‌మన్లలో లీ తర్వాత ఎం కాప్ ఒక్కతే రెండంకెల స్కోరును చేసింది. మొత్తానికి దక్షిణాఫ్రికా 30.5 ఓవర్లాడి 124పరుగులకు ఆలౌటయింది. సీఎల్ ట్రెయాన్ ఒక పరుగుచేసి రనౌట్ అయింది. భారత బౌలర్లలో పూనం యాదవ్ 4 వికెట్లు తీయగా, ఆర్ఎస్ గ్వైక్వాడ్, పిబి శర్మలు చెరి 2 వికెట్లు తీశారు. గోస్వామి ఒక వికెట్‌ను పడగొట్టింది.

స్కోరు బోర్డు: భారత్: పిజి రౌత్ (సి) చెట్టి (బి)క్లాస్ 20, మిథాలీ రాజ్ (సి అండ్ బి) ల్యూస్ 20, మంధాన (సి) చెట్టి (బి) ఎన్టోజాకె 135, హెచ్. కౌర్ నాటౌట్ 55, వి. కృష్ణమూర్తి నౌటౌట్51, ఎక్స్ట్రాలు:21, (మొత్తం పరుగులు 302/3, 50 ఓవర్లలో), **వికెట్ల పతనం:** 1-56, 2-107, 3-241

ద. ఆఫ్రికా బౌలింగ్: ఎ ఖాకా 8-0-63-0, ఎం కప్ 9-0-41-0, ఎం క్లాస్ 9-0-65-1, వ్యాన్ నెకెర్క్ 10-1-38-0, ఆర్ ఎన్టోజాకె 9-0-63-1, ఎస్ ల్యూస్ 5-0-31-1, **ద.ఆఫ్రికా బ్యాటింగ్:** ఎల్ లీ ఎల్బీడబ్ల్యు (బి) శర్మ 73 ఎల్ వాల్వార్ట్ (సి) వర్మ (బి) గోస్వామి 9, టి చెట్టి (సి) మేశ్రం(బి)గ్వైక్వాడ్ 9, స్టెయిన్ (సి) కృష్ణమూర్తి (బి)పూనం యాదవ్3, ల్యూస్ (సి) కృష్ణమూర్తి (బి)పూనం యాదవ్ 2, వ్యాన్ నెయ్‌కెర్క్ ఎల్బీడబ్ల్యు (బి)గ్వైక్వాడ్ 7, ట్రెయాన్ రనౌట్ (గ్వైక్వాడ్/వర్మ)1, కాప్ నాటౌట్ 17, ఖాకా (బి) శర్మ 0, క్లాస్ (బి) పూనం యాదవ్ 4, ఎన్టోజాకె పూనం యాదవ్ 0. ఎక్స్ట్రాలు2(మొత్తం:124 ఆలౌట్ 30.5 ఓవర్లు)

భారత్ బౌలింగ్: గోస్వామి 7-0-29-1, ఎస్ పాండే 4-1-23-0, ఆర్ఎస్ గ్వైక్వాడ్ 6-0-14-2, పూనం యాదవ్ 7.5-1-24-4, డీబీ శర్మ 6-1-34-2

కేప్‌టౌన్: భారత్ చారిత్రక విజయం సాధించింది. స్పిన్నర్ల మాయాజాలానికి సఫారీలు తలవంచారు. చాహల్, యాదవ్‌లు చెరి 4వికెట్లు దక్కించుకున్నారు. దక్షిణాఫ్రికా గడ్డపై ఆదేశంపై వరుసగా 3వన్డేల్లో నెగ్గింది. బుధవారం జరిగిన మూడో వన్డేలో భారత్ తొలుత బ్యాటింగ్ చేసి 303 పరుగుల లక్ష్యంను సఫారీల ముందుంచుంది. లక్ష్య ఛేదనలో దక్షిణాఫ్రికా 40 ఓవర్లలోనే 179 పరుగులకు చేతులెత్తేసింది. దీనితో భారత్ 124 పరుగుల తేడాతో విజయం సాధించింది. దక్షిణాఫ్రికాలో ఆతిథ్య దేశంపై అత్యధిక తేడాతో భారత్ భారీ తేడాతో విజయం సాధించిన రికార్డు ఇదే. సిరీస్‌లో 3-0 ఆధిక్యం సాధించింది. అజేయ శతకంతో 160 పరుగులతో నాటౌట్‌గా నిలిచిన కోహ్లికి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. తొలి ఓవర్లోనే భారత్‌కు ఎదురు దెబ్బ తగిలింది. రోహిత్ డకౌట్ అయ్యాడు. రబాడా వేసిన ఓవర్ చివరి బంతిని ఆడుతూ వికెట్ కీపర్ క్లాసెన్‌కు క్యాచ్ ఇచ్చి వెనుతిరి గాడు. బ్యాటింగ్‌కు వచ్చిన కెప్టెన్ కోహ్లీ తాను ఆడిన తొలి బంతిని ఫోర్‌గా మలిచాడు. రబాడా, ఎన్గిడి బౌలింగ్‌ను ఎదుర్కొంటూ ఆరు ఓవర్లు ముగిసే సరికి భారత్ స్కోరును 28 పరుగులకు చేర్చారు. 17వ ఓవర్లో ధావన్ తన 25వ అర్ధ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. 17 ఓవర్లు ముగిసే సరికి భారత్ వికెట్ నష్టానికి 140 పరుగులు చేసింది. ఇది దక్షిణాఫ్రికాలో దక్షిణాఫ్రికాపై భారత్ రెండో వికెట్‌కు జమచేసిన అత్యధిక పరుగుల భాగస్వామ్యం ఇదే. కాగా ధాటిగా ఆడుతున్న ధావన్ 76 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద స్పిన్నర్ డుమిని బౌలింగ్‌లో మర్‌క్రమ్‌కు క్యాచిచ్చి ఔటయ్యాడు. రహానే బ్యాటింగ్ వచ్చి కోహ్లీకి జత కలిశాడు. 25 ఓవర్లు ముగిసే సరికి భారత్ 150 పరుగులు చేసింది. అయితే రహానే(11) ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయాడు. పెహ్లుక్‌వాయో బౌలింగ్‌లో డిమినికి క్యాచ్ ఇచ్చి పెవిలియన్‌కు చేరాడు. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన హార్దిక్ పాండ్యా కేవలం 15 బంతులు ఎదుర్కొని 14 పరుగులు చేసి మోరిస్ బౌలింగ్‌లో క్లాసెన్‌కు క్యాచిచ్చి ఔటయ్యాడు. ధోని బ్యాటింగ్ వచ్చాడు. మరోపక్క కోహ్లీ వన్డేల్లో 34వ సెంచరీని చేశాడు. ఇందుకు కోహ్లీ 119 బంతులను ఎదుర్కొన్నాడు. 43వ ఓవర్లో ధోని 10 పరుగులు చేసి తాహిర్ బౌలింగ్‌లో ఎన్గిడికి క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. కేదార్ జాదవ్ బ్యాటింగ్ వచ్చి 1 పరుగు చేసి పెహ్లుక్‌వాయో బౌలింగ్‌లో కీపర్‌కు క్యాచ్‌ఇచ్చి వెనుదిరిగాడు. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన భువనేశ్వర్, కోహ్లీలు భారత్ ఇన్నింగ్స్‌ను 50 ఓవర్లలో 303 పరుగులు చేసి ముగించారు. మోరిస్ వేసిన 48 ఓవర్లో 3 బంతిని కోహ్లీ సిక్సర్‌గా మలిచే ప్రక్రియలో గాల్లోకి లేపాడు. బంతిని మిల్లర్ క్యాచ్ పట్టాడు. అయితే మిల్లర్ ఈ క్రమంలో బౌండరీ లైన్ తాడును పక్కకు జరపటంతో అంపైర్ దాన్ని సిక్సర్‌గా ప్రకటించాడు. కోహ్లీ తన ఇన్నింగ్స్‌లో రెండు సిక్సర్లు, 12 ఫోర్లు కొట్టాడు. లక్ష్య ఛేదనకు దిగిన సఫారీల జట్టు ఓపెనర్లు, మర్‌క్రమ్, హాషీం ఆమ్లా జంట రెండో ఓవర్లోనే విడిపోయింది. ఆమ్లా(1) రెండో ఓవర్ తొలి బంతికి బుమ్రాకు ఎల్బీడబ్ల్యు రూపంలో చిక్కాడు. అనంతరం డుమిని బ్యాటింగ్ వచ్చి సఫారీల బ్యాటింగ్‌ను కుదుట పర్చాడు. 16 ఓవర్ల వరకు వీరిద్దరూ ఆడుతూ స్కోరును 78 పరుగులకు చేర్చారు. 17 ఓవర్ తొలిబంతికి మర్‌క్రమ్(32) కులదీప్ యాదవ్ బౌలింగ్‌లో ధోనీకి క్యాచిచ్చి ఔటయ్యాడు. అతని స్థానంలో బ్యాటిం గ్‌కు వచ్చిన క్లాసెన్ రెండు ఓవర్లు ఆడి ఆరు పరుగులు చేసి చాహల్‌కు ఎల్బీడబ్ల్యుగా చిక్కాడు. డుమిని అర్ధ శతకంను పూర్తిచేసుకున్నాడు. ఇందుకు 64 బంతులను ఎదుర్కొన్నాడు. మిల్లర్ బ్యాటింగ్ వచ్చి డుమినికి జత కలిశాడు. 21 ఓవర్లు పూర్తయ్యే సరికి సఫారీల స్కోరు 91/3. భారత బౌలర్లకు పరీక్షపెడుతున్న డుమిని 22వ ఓవర్లో చాహల్ బౌలింగ్‌లో ఎల్బీడబ్ల్యుగా ఔటయ్యాడు. జొండో వచ్చి మిల్లర్ కలిసి స్కోరును నెమ్మదిగా ముందుకు పోనిచ్చారు. బుమ్రా బౌలింగ్‌లో మిల్లర్(3) ధోనికి క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. బ్యాటింగ్‌కు వచ్చిన మోరిస్(14) యాదవ్ ఎల్బీడబ్ల్యుగా ఔటయ్యాడు. అనంతరం పెహ్లుక్‌వాయో బ్యాటింగ్‌కు వచ్చాడు. 37వ ఓవర్లో జొండోను చాహల్ పెవిలియన్‌కు పంపించాడు. 17 పరుగులుచేసి మనీష్‌పాండేకు (సబ్‌స్టిట్యూట్) క్యాచిచ్చి ఔటయ్యాడు. రబాడా బ్యాటింగ్ వచ్చాడు. జొండో 38వ ఓవర్లో పెహ్లుక్‌వాయో(3) యాదవ్ బౌలింగ్‌లో కోహ్లీకి క్యాచిచ్చి వెనుదిరిగాడు. తాహిర్‌ను చాహల్ ఔట్ చేయగా, ఎన్గిడి వికెట్‌ను కులదీప్ యాదవ్ చేజిక్కించుకున్నాడు. మొత్తానికి సఫారీల ఇన్నింగ్స్ 40 ఓవర్లలో 179 పరుగులకు ముగిసింది.

క్రీడాప్రభ



• 124 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా పై విజయం
• సిరీస్‌లో 3-0తో ముందంజ

కోహ్లీ 160 నాటౌట్

స్పిన్‌కు సఫారీలు విలవిల!

భారత్ బ్యాటింగ్: రోహిత్ (సి)క్లాసెన్ (బి) రబాడా0, ధావన్ రనౌట్ (సి)మర్‌క్రం (బి)డుమిని76, కోహ్లీ (కెప్టెన్)160 నాటౌట్,రహానే (సి)పెహ్లుక్‌వాయో (బి) డుమిని 11, పాండ్యా (సి) క్లాసెన్(బి) మోరిస్ 14, ధోనీ(సి) ఎన్గిడి (బి) తాహిర్10,జాదవ్ (సి) క్లాసెన్ (బి)పెహ్లుక్‌వాయో 1, భువనేశ్వర్ నాటౌట్ 16 ఎక్స్ట్రాలు 15, (మొత్తం 50 ఓవర్లలో 303), **వికెట్ల పతనం:** 0-1,140-2,160-3,188-4, 228-5,236-6, **బౌలింగ్:** రబాడా 10-1-54-1,ఎన్గిడి 6-0-47-0,మోరిస్ 9-0-45-1, పెహ్లుక్‌వాయో 6-0-42-1,ఇమ్రాన్ తాహిర్ 9-0-52-1,జెపి డుమిని 10-0-62-2, **దక్షిణాఫ్రికా బ్యాటింగ్:** ఆమ్లా ఎల్బీడబ్ల్యు (బి)బుమ్రా 1, ,ఏడెన్ మర్‌క్రం (సి) ధోనీ (బి)యాదవ్32, జెపి డుమిని ఎల్బీడబ్ల్యు (బి)చాహల్ 6, క్లాసెల్ ఎల్బీడబ్ల్యు (బి)చాహల్ 6, మిల్లర్(సి) ధోని (బి)బుమ్రా 25, జోండో (సి)పాండే (బి) చాహల్ 17, క్రిస్ మోరిస్ ఎల్బీడబ్ల్యు (బి)యాదవ్ 14, ఆండిలె పెహ్లుక్‌వాయో (సి) కోహ్లీ (బి) యాదవ్ 3, రబాడా నానౌట్ 12, తాహిర్ (సి) కోహ్లీ (బి) చాహల్ 8, ఎన్గిడి ఎల్బీడబ్ల్యు (బి) యాదవ్ 6 **ఎక్స్ట్రాలు:** 4,(మొత్తం 40 ఓవర్లలో 179 ఆలౌట్), **వికెట్ల పతనం:**1-1, 79-2,88-3,95-4,129-5,150-6,150-7,158-8,167-9,179-10, **బౌలింగ్:** భువనేశ్వర్ 7-0-41-0, బుమ్రా 7-0-32-2, పాండ్యా 8-0-35-0, చాహల్ 9-0-46-4, కులదీప్ యాదవ్, 9-1-23-4.

భారత్ ఫుట్‌బాల్ కోచ్ గడువు పెంపునకు ఓకే

• ఏఐఎఫ్ఎఫ్ టెక్నికల్ కమిటీ తీర్మానం



న్యూఢిల్లీ: భారత ఫుట్‌బాల్ కోచ్ స్టీఫెన్ కాన్‌స్టేంటైన్‌తో ఏఐఎఫ్ఎఫ్ ఒప్పందాన్ని పొడిగించేందుకు ఆలిండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ అంగీకరించింది. బుధవారం ముంబైలో మాజీ ఫుట్‌బాల్ ఆటగాడు శ్యాంథాపా ఆధ్వర్యంలోని ఏఐఎఫ్ఎఫ్ సాంకేతిక కమిటీ ఏకగ్రీవంగా స్టీఫెన్ గడువు పొడిగింపును అంగీకరిస్తూ తీర్మానం చేసింది. ఈ తీర్మానాన్ని ఏఐఎఫ్ఎఫ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఆమోదిస్తే ఒప్పందం పొడిగింపు అమల్లోకి వస్తుంది. భారత జట్టు ఇటీవల ఆడిన 13 మ్యాచుల్లో 11 మ్యాచుల్లో విజయం సాధించగా, 2 మ్యాచ్‌లను డ్రా చేసుకుంది. అంతేకాక, భారత జట్టు తన ర్యాంకింగ్‌ను 1996తో పోలిస్తే 2017 జూలైనాటికి అత్యుత్తమ ర్యాంకింగ్ 96ను సాధించింది. ఇటీవల భారత్‌లో ఫుట్‌బాల్ క్రీడకు పెరుగుతున్న ఆదరణ, భారత్‌లో ఫుట్ బాల్ జట్టు సాధిస్తున్న విజయాలు తమను ఆకట్టుకున్నాయని ఏఐఎఫ్ఎఫ్ సాంకేతిక కమిటీ సభ్యులు వాఖ్యానించారు. ఈ నేపథ్యంలో తాను ఎఎఫ్ సి ఆసియన్ కప్-2019 వరకు తన ఒప్పందాన్ని పొడిగించుకోవడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపాడు. ఈ నేపథ్యంలో 55ఏళ్ల కాన్‌స్టాంటైన్‌ను వదులు కోవడానికి ఏఐఎఫ్ఎఫ్ సిద్ధంగా లేదు. 'ఫెడరేషన్ సభ్యులు కాన్‌స్టాంటైన్‌ను వదులుకోవడానికి సిద్ధంగాలేరు ఎందుకంటే ఆయన ఆధ్వర్యంలో భారత జట్టు ఏఎఫ్‌సి ఆసియన్ కప్-2019కి అర్హత సాధించింది. అంతేకాక, ఆసియన్ దేశాల్లో నిలకడగా రాణిస్తూ టాప్ 15 దేశాల్లో భారత్ నిలిచింది' అని ఏఐఎఫ్ఎఫ్ సాంకేతిక బోర్డు మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.

ఆసియా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్

• భారత్ మాల్దీవులపై గెలుపు

అలోర్ సెటార్: ఆసియా బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్‌లో పురుషుల విభాగంలో కిదాంబి శ్రీకాంత్(ప్రపంచ ర్యాంక్5) నేతృత్వంలోని జట్టు మాల్దీవుల జట్టును 5-0 తేడాతో ఓడించింది. సింగిల్స్‌లో కిదాంబి హుస్సేన్ జాయన్‌పై 21-5, 21-6 తేడాతో విజయం సాధించగా, మరో సింగిల్స్‌లో సాయి ప్రణీత్, మాల్దీవులకు చెందిన అహ్మద్ నిబాల్‌పై 21-0 21-4 తేడాతో విజయం సాధించాడు. సమీర్ వర్మ తన ప్రత్యర్థి మహ్మద్ అర్సాలాన్‌పై 21-5, 21-1తేడాతో గెలిచాడు. డబుల్స్‌లో సాత్వాకాసాయిరాజ్ రింకిరెడ్డి, చిరాగ్ షెట్టి జోడీ షహీద్ హుసేన్ జాయాన్, షహీం హసన్ అఫ్షీంపై 21-8, 21-8 తేడాతో గెలిచారు. అర్జున్ ఎంఆర్ శ్లోక్ రామచంద్రన్ జంట మహ్మద్ మహ్మద్ అర్సాలాని, అహ్మద్ నిబాల్‌లపై 21-2,21-5 తేడాతో విజయం సాధించారు. తర్వాత రౌండ్లో భాగంగా నేడు భారత ఆటగాళ్ల జట్టు ఇండోనేషియాను ఢీ కొంటుంది. కాగా మహిళల జట్టు జపాన్‌తో తలపడనుంది.

రగ్బీ నేషనల్ టోర్నీ షురూ



హైదరాబాద్, ఆంధ్రప్రభ: భారత పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో 63వ రగ్బీ నేషనల్ చాంపియన్‌షిప్-2018 టోర్నమెంట్ బుధవా రంనాడిక్కడ ప్రారంభమైంది. ఎల్బీ స్టేడియంలో నిర్వహిస్తు న్న రగ్బీ టోర్నమెంట్‌ను తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. మూడు రోజుల పాటు పోటీలు జరుగనున్నాయి. ఈ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లతో పాటు 14 రాష్ట్రాల నుంచి అండర్-17, అండర్-19 వయస్సు గ్రూపులకు చెందిన సుమారు 600 బాలబాలికలు క్రీడాకారులు పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా శాట్స్ చైర్మన్ మాట్లాడుతూ, యూరప్, అమెరికా దేశాలలో రగ్బీ క్రీడ ఏవిధంగా అయితే అభివృద్ధి చెందిందో తెలంగాణలో కూడా రగ్బీ క్రీడ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఎస్‌జీఎఫ్ఐ ద్వారా ఈ క్రీడా పట్ల ఎక్కువ శ్రద్ధ వహించి, ఈ క్రీడను తెలంగాణలోని అన్ని గ్రామీణ పాటశాలలో కూడా ఆడించాలని శాట్స్ చైర్మన్ కోరారు. రగ్బీ అసోసియేషన్‌కు అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని శాట్స్ చైర్మన్ హామీనిచ్చారు. ఆసియా రగ్బీ ఛాంపియన్‌షిప్ తెలంగాణలో నిర్వహించడానికి శాట్స్ నుండి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని వెంకటేశ్వర్ రెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా డీఈఓ కే. సత్యనారాయణ రెడ్డి, తెలంగాణ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి కే. రాంరెడ్డి, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి యస్.ఆర్. ప్రేమ్‌రాజ్, తెలంగాణ వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు డా. యస్. సోమేశ్వర్ రావు, రగ్బీ నేషనల్ ఛాంపియన్‌షిప్ నిర్వహణ కార్యదర్శి పి.సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫెడరేషన్ కప్‌లో భారత జంట ఓటమి

• 2-1 తేడాతో చైనా గెలుపు • అంకిత గెలిచినా ఓటమి తప్పలేదు



న్యూఢిల్లీ: ఫెడరేషన్ కప్ టెన్నిస్ టోర్నీలో భాగంగా బుధవారం రెండో రోజు జరిగిన పోటీల్లో భారత జట్టుకు చెందిన అంకితా రైనా సింగిల్స్‌లో గెలిచినప్పటికి టీం విజయం సాధించలేకపోయింది. ఆసియా/ఓసియనా గ్రూప్-1 మ్యాచుల్లో భాగంగా ఆరెకె ఖన్నా స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో అంకితా(253ర్యాంక్) చైనాకు చెందిన 120 ర్యాంకర్ లిన్ జుపై 6-3, 6-2 తేడాతో గెలుపొందింది. మరో సింగిల్స్‌లో కర్మన్ కౌర్ థాండి తన తొలి మ్యాచ్‌ను యఫాన్ వాంగ్‌కు(125 ర్యాంకు) కోల్పోయింది. థాండి 2-6, 2-6 తేడాతో ఓడిపోయింది. అనంతరం అంకితా, ప్రథానా థాంబేర్‌తో కలిసి డబుల్స్ మ్యాచ్‌లో చైనా జోడీ వాంగ్, జావొగ్జువాన్ యాంగ్(ర్యాంకు31)తో తలపడి 2-6, 6-7(1)తేడాతో ఓటమిని పొందింది. భారత జంట ఆటలో చురుకుదనంను ప్రదర్శించక పోవడం, వారిద్దరి మధ్య పరస్పర అవగాహన కూడా లోపించ డంతో ఓట మిని చవిచూడాల్సి వచ్చిందని విశ్లేషకులు అంటున్నారు. దీనితో భారత్ 1-2 తేడాతో చైనాకు మ్యాచ్‌ను కోల్పోవలసి వచ్చింది. నేడు కజికిస్తాన్ జట్టుతో ఆడనుంది. ఇందులో గెలిస్తేనే ప్లే ఆఫ్ దశకు భారత్ చేరుకుంటుంది.

అంధుల క్రికెట్ ఆసోసియేషన్‌ను గుర్తించండి

• బీసీసీఐకి టెండూల్కర్ లేఖ



న్యూఢిల్లీ: భారత అంధుల క్రికెట్ అసోసియేషన్ కు(సీఏబీఐ) గుర్తింపు ఇవ్వాలని క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ బీసీసీఐను కోరాడు. ఈ మేరకు టెండూల్కర్ బుధవారం బీసీసీఐకి కమిటీ ఆఫ్ అడ్మినేస్ట్రేషన్(సీవోఏ) ఛైర్మన్ వినోద్‌రాయ్‌కు లేఖను రాస్తూ.. అంధుల క్రికెట్ అసోసియేషన్‌కు గుర్తింపునిచ్చి అంధ క్రికెటర్లకు బోర్డు తరపున పించన్ సౌకర్యంను కల్పించాలని విజ్ఞప్తి చేశాడు. అంధుల క్రికెట్ జట్టు 2018లో ప్రపంచకప్ ఫైనల్లో పాకిస్తాన్‌పై గెలిచిందని వారి ప్రతిభను కూడా గుర్తించాలని టెండూల్కర్ లేఖలో కోరారు. 'అంధుల ప్రపంచ కప్‌లో వరుసగా భారత్ నాలుగుసార్లు కప్‌ను గెలిచింది. అంధుల క్రికెట్ అసోసియేషన్‌ను బీసీసీఐ గుర్తించేవిధంగా తగిన చర్యలు చేపట్టాలని' మీకు నేను విన్నపం చేస్తున్నాను అని టెండూల్కర్ లేఖలో పేర్కొన్నాడు. అంధుల క్రికెట్ క్రీడాకారుల ఆటను టెండూల్కర్ ప్రశంసించాడు. వారి పోరాట పటిమ గొప్పదని వారిని ఇతరులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అంధుల క్రికెట్ జట్టు అనేక అవాంతరాలను అధిగమించి ఒకే లక్ష్యంతో దేశానికి పేరు తెచ్చింది. వీరి విజయం మానవ మేదస్సు అనంత శక్తిని చాటుతుంది. మునపటిలాగే వీరికి మద్దతు ఈ సారీకూడా బీసీసీఐ ఇస్తుందని అనుకుంటున్నానని టెండూల్కర్ తన లేఖలో తెలిపారు. ఎంతో కాలంగా అంధుల క్రికెట్ అసోసియేషన్ గుర్తింపు ఇవ్వాలన్న వాదన వస్తోంది. బీసీసీఐ ఈ దిశగా సకారాత్మకంగా నిర్ణయం తీసుకుంటుందని ఆశిస్తున్నానన్నారు. కాగా గతంలో వినోద్ రాయ్ ప్రపంచకప్ విజేతలుగా నిలిచిన జట్టులోని క్రీడాకారులకు వారి సామర్థ్యాలను గుర్తిస్తూ బీసీసీఐ తగిన పారితోషకంను ఇస్తుందని ప్రకటించిన విషయం తెలిసిందే. సీఏబీఐకు బీసీసీఐ గుర్తింపు క్రీడా ప్రపంచంలో సంచలనంగా ఉంటుందన్నారు. ఈ గర్తింపుతో మిగతా వికలాంగ క్రీడాకారుల్లో ఉత్సాహం వస్తుందన్నారు.

'బేబీ లీగ్' అమలులో ఈశాన్య రాష్ట్రాలు బెస్ట్

• ఐదేళ్ల నుంచే ఫుట్‌బాల్‌పై అవగాహన తేవాలి
• ఏఐఎఫ్ఎఫ్ ప్లేయర్ డెవలప్‌మెంట్ విభాగంహెడ్ రిచర్డ్‌హుడ్



న్యూఢిల్లీ: దేశంలో ఫుట్‌బాల్ క్రీడకు ప్రాచుర్యం తేవాలంటే అట్టడుగు స్థాయి నుంచి సంస్కరణలు తీసుకురా వాలని ఆలిండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ (ఏఐఎఫ్ఎఫ్) ప్లేయర్ డెవలప్ మెంట్ విభాగం హెడ్ రిచర్డ్‌హుడ్ అన్నారు. అట్టడుగు స్థాయిలో ఫుట్ బాల్ క్రీడను ప్రోత్సహిస్తూ ఆటలో నాణ్యతను పెంచుతూ మరోపక్క యువ తలో ఈ క్రీడపట్ల మక్కువను పెంచి ఆటగాళ్ల సంఖ్యను పెంచుకోవచ్చని రిచర్డ్ పేర్కొన్నారు. ఇందుకు నేషనల్ ఫెడరేషన్‌తో కలిసి రాష్ట్రాలు, ఫుట్‌బాల్ అసోసియేషన్లు కృషిచేయాలని పిలుపు నిచ్చారు. బుధవారం రిచర్డ్ మీడియాతో ముచ్చటిస్తూ ఐదేళ్ల వయస్సునుంచే పిల్లలు ఫుట్‌బాల్ ఆడేలా ప్రోత్సాహానిచ్చేందుకు ఏఐఎఫ్ఎఫ్ గతేడాది ఈ లక్ష్య సాధనకోసం బేబీ లీగ్‌ను ప్రారంభించిందన్నారు. వారిలో ఆటను ఎలా ఆడాలో తెలుపుతూ వారిలో నైపుణ్యాలను అభివృద్ధి చేయడమే ఈ లీగ్ లక్ష్యమని ఆయన చెప్పారు. 'మా ప్రదర్శనలతో అపూర్వమైన విజయాలను సాధించాము. భారత్‌లో ఫుట్ బాల్ క్రీడకు ప్రాధాన్యం రావాలంటే అట్టడుగు స్థాయినుంచేమార్పు తేవాల్సి ఉంటుంది' అని రిచర్డ్ అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా భారత్ గతంలో సాధించిన విజయాలు యువతలో ఆసక్తిని కలిగించాయి. ఇవే లీగ్‌ను ముందుకు తీసుకుపోవడానికి క్రీడలో స్థిరమైన అభివృద్ధికి దోహదపడుతాయని పేర్కొన్నారు. బేబీ లీగ్ కార్యక్రమంతో దేశంలో కిందిస్థాయి నుంచి ఫుట్‌బాల్ క్రీడ అభివృద్ధిలో రాష్ట్రాల అసోసియేషన్‌లు కీలక పాత్ర వహిస్తాయన్నారు. ఇప్పటికే పలు ఆసోసియేషన్‌లు ఈ వ్యవస్థను ఏర్పాటుచేసుకున్నాయని రిచర్డ్ తెలిపారు. మహారాష్ట్ర(డబ్ల్యుఎఫ్ఏ) ముంబై (ఎండీఎఫ్ఏ)లతో తాము 'ప్లేయర్ డెవలప్‌మెంట్' ఒప్పందాన్ని గతేడాది ఆగస్టులో కుదుర్చుకున్నామన్నారు. అప్పటినుంచి తాము డబ్ల్యుఎఫ్ఏ-ముంబైసిటీ ఎఫ్‌సి అనుబంధ సంస్థలతో కలిసి బలీయమైన లీగ్ వ్యవస్థను ప్రారంభించామన్నారు. ఇవి పాఠశాల స్థాయినుంచే ఫుట్‌బాల్ క్రీడ పట్ల అవగాహన పెంపొందిస్తుందని తెలిపారు. భారత్‌లో ఫుట్‌బాల్ క్రీడకు హాట్‌స్పాట్‌గా ఈశాన్య రాష్ట్రాలను చెపుతారని ఆయన అన్నారు. వారి సంస్కృతిలో క్రీడలు ఒక భాగమయ్యాయని అన్నారు. మేఘాలయ గత జూలైలో తమ ఒప్పందం కుదుర్చుకొందని, బేబీలీగ్ ప్రతిపాదనపట్ల ఆ రాష్ట్రం ఉత్సుకతతోఉందన్నారు. షిల్లాంగ్ కేంద్రంగా పొరుగు జిల్లాల్లో ఈ క్రీడను అభివృద్ధి చేయనుందన్నారు. మిజోరం జనవరిలో ఒప్పందాన్ని కుదుర్చుకుందన్నారు. బేబీ లీగ్‌ను అమలు చేస్తున్న రాష్ట్రా ల్లో తాము అమోఘమైన ఫలితాలను చూశామన్నారు. మేము అద్భుతమైన నాయకత్వ లక్షణాలు, జట్టు సమష్టికృషిని గమనించాము. 12 నుంచి 15 ఏళ్లలో ఫుట్‌బాల్ క్రీడాకారులు దేశంలో వెల్లువెత్తుతారని రిచర్డ్ ఆశిస్తున్నారు.

Printed & Published by MOOTHA GOUTAM on behalf of Andhra Prabha Publications Ltd., and Printed at Andhra Prabha Publications Ltd., Part no 75, Opp: Time Hospital, Ashok Nagar, Vijayawada - 520010.
Editor: Mootha Goutam, Responsible for News selection under PRB ACT. RNI Regd No. 3464/59.